
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 5
జిల్లా వార్తలు
గురువారం 14, మార్చి 2024

ఒంగోలులో హోంగార్డులకు ఇళ్లస్థలాలు అంటూ హోంగార్డుల సంఘం మాజీ నేత ఏకంగా గ్రూపులలో మెసేజ్ పెట్టడం దుమారం రేపుతోంది. ఇళ్ల స్థలాలు కావాల్సిన వారు రేషన్ కార్డు, ఆధార్, ఓటరు కార్డుతోపాటు నివేశన స్థలం కోసం దరఖాస్తు తీసుకొని రండి అంటూ ఆయన సమాచారం ఇవ్వడంతో ఎన్నికల వేళ ఇలా తాయిలాలు ఏమిటి అన్న చర్చ ప్రారంభమైంది.

అధికార పార్టీలో చేరకపోతే రౌడీషీటు తెరుస్తామని ఓ టీడీపీ నాయకుడిని ఇటీవల పొన్నలూరు ఎస్ఐ రాజేష్ బెదిరించిన విషయం వివాదాస్పదమైంది. దీనిపై కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ఎన్నికల కమిషన్‌కు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఇదీ జిల్లాలో పోలీసు శాఖ పరిస్థితి. కొందరు పోలీసు అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అధికార పార్టీ నాయకుల ప్రాపకం కోసం వారికి తొత్తుల్లా పనిచేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీస్ బాస్ నేర సమీక్ష సమావేశంలో ఇచ్చిన సూచనలను కూడా పెడచెవిన పెట్టడం చర్చనీయాంశమైంది. సినిమా పోలీసులం కాదు అంటూ అందరినీ ఎస్పీ హెచ్చరించినప్పటికీ కిందిస్థాయి అధికారుల వ్యవహారశైలిలో ఎలాంటి మార్పు కన్పించకపోవడం వారి ధిక్కార పోకడను తేటతెల్లం చేస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇలాంటి అధికారులపై కన్నేసి కట్టడి చేయాల్సిన అవసరం ఉందని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

# ఎస్..బాస్..!

- అధికారానికి పోలీసుల సలాం
- స్పెషల్ బ్రాంచ్‌పైనా వైసీపీ నేతల స్వారీ
- పెత్తనం చెలాయిస్తున్న కొంతమంది ఖాకీలు
- అధికారపార్టీ నాయకుల మాదిరిగా వ్యవహారం
- హోంగార్డులకు ఇళ్ల స్థలాలంటూ తాయిలం

ఒంగోలు(క్రైం), మార్చి 13 : కొంతమంది పోలీసులు అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులొత్తుతున్నారు. బహిరంగంగానే ఆ పార్టీకి సహకరించాలంటూ తాయిలాలతో సిద్ధమైపోయారు. స్వయంగా గ్రూపులలో మెసేజ్‌లు పెట్టడంతోపాటు బెదిరింపులకు దిగుతున్నారు. వివరాల్లోకి వెళితే.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాప్రతినిధుల సిఫార్సు లేకుండా కనీసం కానిస్టేబుల్ బదిలీ కూడా కావడం లేదు. అయితే ఇటీవల స్పెషల్ బ్రాంచ్‌లో ఓ హెడ్‌కానిస్టేబుల్ ఆకస్మిక బదిలీ పోలీసు శాఖలో చర్చనీయాంశమైంది. సిబ్బంది బదిలీ విషయంలో ఒంగోలులో కొంతమంది పోలీసులు (అధికారపార్టీ సానుభూతిపరులుగా ముద్రపడిన వారు) జట్టుకట్టి తమ కనుసన్నల్లో వ్యవహారాలు నడుపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. పోలీసు శాఖలో ఎలాంటి పని కావాలన్నా వారి దగ్గరకు వెళ్లి ప్రసన్నంచేసుకుంటే చాలు అనేది అందరికీ తెలిసిన విషయమే. అందుకు ఓ పోలీసు సంఘం మాజీ నేత కేంద్ర బిందువుగా వ్యవహరిస్తున్నాడు.

### స్పెషల్ బ్రాంచ్‌పై అధికార పార్టీ పెత్తనం

స్పెషల్ బ్రాంచ్ అంటే పోలీసు శాఖకు కళ్లు, చెవులు వంటిది. అలాంటి ఎస్‌బీలో పనిచేయాలన్నా కూడా ప్రజాప్రతినిధుల సిఫార్సు కావాల్సి వస్తోంది. ఎన్నికల సమయం ఆసన్నమైన వేళ తాలూకా పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ బదిలీ విషయంలో నేతల ఒత్తిళ్లకు తలొగ్గారన్న ప్రచారం జరుగుతోంది. తిరిగి అక్కడ మరొకరిని నియమించడం కోసం కూడా మల్లగుల్లాలు పడుతున్నారు. అక్కడ పోస్టింగ్ విషయంలో అనేక మంది పోటీలో ఉన్నారు. నిబంధనల ప్రకారం స్పెషల్ బ్రాంచ్‌లో నియామకం జరగాలంటే వారికి ఇంటెలిజెన్స్ క్లియరెన్స్ ఉండాలి. అలాంటి వారి జాబితాను సిద్ధంగా ఉంచుకొని అవకాశం ఉన్న సమయంలో పోస్టింగ్ ఇవ్వాలి. కానీ ఇప్పుడు ఎన్ని అభియోగాలు ఉన్నా ప్రజాప్రతినిధుల సిఫార్సు ఉంటే ఎస్‌బీలో పోస్టింగ్ ఇవ్వడం పరిపాటైంది. దీంతో తాలూకాలో ఎస్‌బీ పోస్టింగ్‌కు డిమాండ్ పెరిగింది.

ఈ విషయం పోలీసువర్గాల్లో దుమారం రేపుతోంది. గత నెలరోజులుగా పోలీసు స్టేషన్లలో కేసుల దర్యాప్తు గాలికొదిలేసి ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతుండటం కొందరు అధికారుల పనిగా మారింది. జిల్లాలో పరిస్థితి చూస్తే ఓ మాజీ మంత్రి, ఆయనకు ఇరుపక్కల ఉన్న నియోజకవర్గాల్లో ఇన్‌చార్జులుగా ఉన్న మంత్రుల చుట్టూ కొందరు ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు ముందుకు సాగడం లేదు. పోలీసు అధికారులు స్టేషన్లు వదిలి ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకోవడంతోనే సరిపోతోంది. పైగా వారి అంతరంగిక సేవలోనూ తరిస్తున్నారు. ఇందుకు పొన్నలూరు ఎస్సై రాజేష్ వ్యవహారమే ఒక నిదర్శనం. అధికారపార్టీలో చేరకపోతే రౌడీషీటు తెరుస్తామని టీడీపీ నేతను ఆయన బెదిరించడం విమర్శలకు తావిచ్చింది.

### చక్రంతిప్పుతున్న కొంతమంది పోలీసులు

ఇద్దరు ముగ్గురు పోలీసులు జట్టుగా ఏర్పడి అధికార పార్టీ తరఫున ఒంగోలులో చక్రం తిప్పుతున్నారు. వారు ఏవిధులు నిర్వహిస్తున్నారు అనేది కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. పోలీసు శాఖలో బదిలీ వ్యవహారాలు చూడటంతోపాటుగా ఏఅధికారి ఎక్కడికి రావాలన్న విషయంపై కూడా వారు ప్రజాప్రతినిధులకు సలహాలు ఇవ్వడం చూస్తుంటే పోలీసు శాఖలో పనిచేస్తున్నారా? లేక అధికారపార్టీకి సేవ చేస్తున్నారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక కానిస్టేబుల్ బదిలీ విషయంలో ఎస్పీ ఆదేశాలు ఇచ్చినప్పటికీ మనోడు కాదు అంటూ పట్టుబట్టి నిలిపివేయించిన ఉదంతాలు ఉన్నాయి. దీంతో పోలీసు శాఖలో పనిచేసే సిబ్బంది వారిని ప్రసన్నంచేసుకోక తప్పడం లేదు.

### హోంగార్డులకు ఇళ్ల స్థలాలంటూ ఆశలు

ఎన్నికల వేళ రాజకీయ నాయకులు తాయిలాలు ఇవ్వడం పరిపాటి. అయితే ఒంగోలులో హోంగార్డులకు ఇళ్లస్థలాలు అంటూ హోంగార్డుల సంఘం మాజీ నేత ఒకరు ఏకంగా గ్రూపులలో మెసేజ్ పెట్టడం దుమారం రేపుతోంది. ఆయన నేరుగా ఇలా చెప్పడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అధికారులే దీనిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శాఖ పరువు తీస్తున్నారంటూ మండిపడుతున్నారు. ఎన్నికల వేళ ఇలా ప్రకటనలు చేయడం ఏమిటన్న చర్చ ప్రారంభమైంది. హోంగార్డులకు నివేశన స్థలాలు ఇవ్వడం సబబే అయినప్పటికీ.. ఎన్నికల ముందు మాయ చేయడం, అదీ పోలీసు శాఖలో అనుబంధంగా పనిచేసే హోంగార్డులు కావడంతో విమర్శలకు తావిస్తోంది.

# టీడీపీ రెండో జాబితా సిద్ధం

- గిద్దలూరు, మార్కాపురం, చీరాల, కందుకూరు అభ్యర్థుల ఎంపిక
- దర్శిపై కొనసాగుతున్న కసరత్తు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జనసేన, బీజేపీతో ఎన్నికల ఒప్పందంలో భాగంగా పోటీచేసే స్థానాలపై పూర్తిస్థాయి అవగాహన రావడంతో అభ్యర్థుల రెండో జాబితాను టీడీపీ సిద్ధం చేసింది. ఆ మేరకు నేడో, రేపో ఆపార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించనున్నట్లు సమాచారం. రెండో జాబితాలో భాగంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాల అభ్యర్థుల పేర్లను ఖరారు చేసుకున్నట్లు సమాచారం. దర్శి అభ్యర్థి ఎంపికపై మాత్రం కసరత్తు కొనసాగుతోంది. గిద్దలూరు, మార్కాపురం, చీరాల, కందుకూరు స్థానాల నుంచి ప్రస్తుత ఆ పార్టీ ఇన్‌చార్జులనే రంగంలోకి దింపాలన్న నిర్ణయానికి అధిష్ఠానం వచ్చినట్లు సమాచారం. ఇప్పటికే టీడీపీ, జనసేనలు అభ్యర్థుల తొలి జాబితాలను ప్రకటించి ఉన్నాయి. అందులో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఏడు స్థానాల అభ్యర్థులను టీడీపీ ప్రకటించింది. బీజేపీతో నిన్నమొన్నటి వరకు కొనసాగుతున్న చర్చలు, జిల్లాలో ఒంగోలు ఎంపీ మాగుంటలాంటి పలువురి ప్రముఖులను దృష్టిలో ఉంచుకుని మిగిలిన ఐదు స్థానాల అభ్యర్థుల ఎంపికను ఆ పార్టీ పెండింగ్‌లో పెట్టింది. తాజాగా మూడు పార్టీల మధ్య జరిగిన ఒప్పందంలో భాగంగా తొలుత జనసేనకు కేటాయించిన దర్శి కూడా టీడీపీ ఖాతాలోకి రావడంతో మిగిలిన ఐదు స్థానాల అభ్యర్థులను టీడీపీ ప్రకటించాల్సి ఉంది. ఈ అభ్యర్థుల ఎంపికపై రెండు,మూడు రోజుల నుంచి ఆపార్టీ అధినేత చంద్రబాబు కసరత్తు చేశారు. మంచిరోజు కావడంతో గురువారం, కానీ పక్షంలో మరోరోజు అటుఇటుగా రెండో జాబితాను ప్రకటించేందుకు బాబు సిద్ధమయ్యారు. రెండో జాబితాలో మిగిలిన అసెంబ్లీ స్థానాల్లో నాలుగుచోట్ల అభ్యర్థులను ప్రకటించబోతున్నారు. గిద్దలూరు నుంచి మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేరును గతంలోనే ఖరారు చేశారు. ఇతరత్రా కొన్ని అంశాలపై తర్జనభర్జన అనంతరం మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని, చీరాల నుంచి ఎంఎం. కొండయ్యయాదవ్‌ను, కందుకూరు నుంచి ఇంటూరి నాగేశ్వరరావును రంగంలోకి దించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అనూహ్య పరిణామాల నేపథ్యంలో ఒకటీ అరా స్థానాల అభ్యర్థుల పేర్లను ప్రకటించకపోయినప్పటికీ రెండో జాబితాలో అశోక్‌రెడ్డితోపాటు మరో ఇద్దరి పేర్లను వెల్లడించనున్నారని ఆ పార్టీ అగ్రనేతల సమాచారం ద్వారా తెలుస్తోంది.






### దర్శికి పలువురి పేర్ల పరిశీలన

జనసేన, బీజేపీలతో కుదిరిన అవగాహన అనంతరం దర్శి టీడీపీకే దక్కింది. దీటైన అభ్యర్థిని రంగంలోకి దింపే కార్యక్రమంలో భాగంగా పలువురి పేర్లను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే పరిశీలనలో ఉన్న మాజీ మంత్రి శిద్దా కుటుంబసభ్యుల్లో ఒకరితోపాటు బాచిన కృష్ణచైతన్య, డాక్టర్ లక్ష్మి, మరికొందరి పేర్లను పరిశీలనలోకి తీసుకున్నారు. ప్రస్తుతం టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న హర్షిణీ విద్యాసంస్థల అధినేత రవికుమార్ పేరును కూడా సీరియస్‌గా పరిశీలిస్తున్నారు. గతంలో లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంలోనూ, కనిగిరిలో చంద్రబాబు పాల్గొన్న బహిరంగసభ సమయంలోనూ దర్శి నుంచి జన సమీకరణలో రవికుమార్ కీలకపాత్ర పోషించారు. 17న జరగనున్న పేట సభకు కూడా జనసమీకరణ బాధ్యతలను రవికుమార్‌కే అప్పగించారు. ఆ మేరకు బుధవారం రవికుమార్‌కు లోకేష్ ప్రత్యేకంగా చెప్పినట్లు తెలిసింది. ఆయన పేరు పరిశీలనలో ఉండటంతోనే బాధ్యతలు ఇచ్చారని భావిస్తున్నారు. జనసేన తరఫున ఇప్పటివరకు కార్యక్రమాలను నిర్వహిస్తున్న గరికపాటి వెంకట్ కూడా టీడీపీ నుంచి పోటీకి సిద్ధం కావడంతో ఆయన పేరునూ పరిశీలనలోకి తీసుకున్నారు. మరోవైపు కాపు సామాజికవర్గానికి కూడా ప్రాధాన్యం ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అందులోభాగంగా మాజీ ఎమ్మెల్యేలు కదిరి బాబూరావు, నారపుశెట్టి పాపారావుల పేర్లను కూడా అధిష్ఠానం పరిశీలిస్తోంది. రానున్న రెండు రోజుల్లో మరికొన్ని సర్వేలు నిర్వహించి వీరిలో ఎవరికి అవకాశం ఇవ్వాలన్న దానిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. వీరిలో కృష్ణచైతన్య ఈనెల 16న టీడీపీలో చేరనుండగా, బాబూరావు కూడా చేరేందుకు సంకేతం పంపినట్లు సమాచారం.



ఒంగోలులో మాజీ ఎమ్మెల్యే జనార్దన్ సమక్షంలో టీడీపీలో చేరిన నల్లమల్లి బాలు, ఆర్యవైశ్యులు



వైసీపీని వీడి గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన పొదలకొండపల్లి వాసులు

# అందరి చూపు టీడీపీ వైపే!

- 16న సైకిలెక్కనున్న ఎంపీ మాగుంట, రాఘవరెడ్డి, భారీగా అనుచరులు
- అదేరోజు గరటయ్య, చైతన్య కూడా చేరిక
- మరికొందరు ప్రముఖులు సైతం టీడీపీ తీర్థం
- జిల్లాలో ఒకేరోజు వైసీపీ నుంచి భారీగా వలసలు
- ఒంగోలులో ఆర్యవైశ్య సామాజిక నేత, యువకులు
- గిద్దలూరు, పర్చూరులో రెడ్డి సామాజికవర్గం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో తెలుగుదేశం పార్టీలోకి ఓటు బ్యాంకులైన నాయకులు పోలోమని పోతున్నారు. టీడీపీ, జనసేనలతోపాటు బీజేపీ కూడా ఆ పార్టీలతో జతకట్టిన నేపథ్యంలో చేరికల్లో మరింత ఊపు పెరిగింది. ఈనెల 17న జిల్లాకు సమీపంలో జరిగే కూటమి బహిరంగ సభలో చంద్రబాబు, పవన్‌తోపాటు ప్రధాని మోదీ కూడా పాల్గొంటున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో కొన్ని స్థాయిల్లోని వైసీపీ శ్రేణులు, నాయకులు ఇప్పటి వరకూ రాష్ట్రప్రభుత్వ కక్షసాధింపు చర్యలపై ఉన్న భయాన్ని వీడి పోలోమని టీడీపీలో చేరుతున్నారు. ముందు నుంచి అనుకున్న ప్రకారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఆయన కుమారుడు రాఘవరెడ్డి, వారి అనుచరులు 16న చంద్రబాబు సమక్షంలో సైకిలెక్కుతున్నారు. సాయంత్రం 4గంటలకు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో వీరి చేరిక కార్యక్రమం జరగనుంది. వీరితోపాటు వైసీపీలో ఉన్న మాగుంట అనుచరగణం టీడీపీలో చేరబోతోంది. వారిలో కొందరు ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, సింగిల్ విండో అధ్యక్షులు, కొన్ని కార్పొరేషన్ల డైరెక్టర్లు కూడా ఉన్నారు.

### అదే రోజు బాచిన

మరోవైపు వైసీపీలో దగాపడ్డ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాచిన చెంచుగరటయ్య, ఆయన కుమారుడైన వైసీపీ అద్దంకి మాజీ ఇన్‌చార్జి కృష్ణచైతన్య టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఎమ్మెల్యేలు రవికుమార్, సాంబశివరావు ఇచ్చిన సమాచారంతో చంద్రబాబు వీరి చేరికకు సమయాన్ని కేటాయించారు. వీరితోపాటు ప్రధానంగా నియోజకవర్గంలోని వారి అనుచరులు భారీగా చేరనున్నారు. ఇంకోవైపు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పేరు ప్రచారంలో ఉండగా, తాజాగా కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు కూడా టీడీపీలో చేరే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

### ఒంగోలు, గిద్దలూరు, పర్చూరుల్లో భారీ చేరికలు

జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో బుధవారం వైసీపీ నుంచి, వివిధ ప్రజాసంఘాల నుంచి టీడీపీలో చేరే వారి సంఖ్య భారీగా కనిపించింది. ప్రధానంగా ఒంగోలు, గిద్దలూరు, పర్చూరులో ఆయా సామాజికవర్గాల్లోనూ, వైసీపీలోనూ కీలక భూమిక పోషిస్తున్న పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఒంగోలులో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమక్షంలో ఆర్యవైశ్య సామాజికవర్గం నుంచి భారీగా టీడీపీలో చేరడం విశేషం. ప్రధానంగా వైసీపీకి గుడ్‌బై చెప్పి వారంతా టీడీపీలోకి వచ్చారు. ఒకప్పుడు ఎమ్మెల్యే బాలినేనికి అత్యంత సన్నిహితునిగా మెలిగిన నల్లమల్లి బాలుతోపాటు ఆసామాజికవర్గంలోని యువకులు టీడీపీలో చేరడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇక గిద్దలూరు, పర్చూరు నియోజకవర్గాల్లో రెడ్డి సామాజికవర్గం, బలహీనవర్గాలకు చెందిన వారు పెద్దసంఖ్యలో టీడీపీలో చేరారు. గిద్దలూరు మండలంలోని పొదలకొండపల్లి పంచాయతీ, సమీప గ్రామాల్లో పట్టు ఉన్న వైసీపీ నేత జయరామిరెడ్డి పెద్ద సంఖ్యలో అనుచరులతో టీడీపీలో చేరారు. టీడీపీ నేత ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో జయరామిరెడ్డితోపాటు గ్రామసర్పంచ్, ఐదుగురు వార్డుసభ్యులు, గ్రామంలో ఆయా వర్గాల ప్రజలపై ప్రభావం చూపే కీలక వ్యక్తులు 250మంది టీడీపీలో చేరారు. పర్చూరు నియోజకవర్గంలో అయితే గ్రామాలకు గ్రామాల ప్రజలే తరలివచ్చి ఎమ్మెల్యే సాంబశివరావు సమక్షంలో టీడీపీలో చేరారు. ప్రధానంగా చినగంజాం మండలంలోని కొత్తపాలెం, మున్నంవారిపల్లె, రాజుబంగారుపాలెం గ్రామాల నుంచి భారీగా వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరారు. రెడ్డి సామాజికవర్గం, బలహీనవర్గాల నాయకులు, ప్రజలు కూడా సైకిలెక్కారు. తమకు పట్టున్న మండలంగా వైసీపీ నాయకులు భావిస్తున్న చినగంజాం మండలం నుంచి పూర్తిస్థాయి వైసీపీ శ్రేణులు పచ్చకండువాలు కప్పుకున్నారు. మూలగారివారిపాలెం నుంచి ఎ.చెన్నారెడ్డి, బి.వెంకటేశ్వర్‌రెడ్డితోపాటు 50 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. మున్నంగివారిపాలెం నుంచి నరేంద్రరెడ్డి, బాలిరెడ్డి, కోటిరెడ్డిలతోపాటు పలు కుటుంబాల వారు చేరారు. రాజుబంగారుపాలెం నుంచి ఎ.చిన్ననరసింహారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, 40 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే యద్దనపూడి మండలం నుంచి కూడా కొన్ని గ్రామాల వారు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు.

# ఎన్నికల వేళ కరువు గుర్తుకొచ్చింది!

- నివేదికలు కోరిన ప్రభుత్వం
- కసరత్తు చేస్తున్న యంత్రాంగం
- రబీలో 44 శాతం లోటు వర్షపాతం
- 36 శాతం తగ్గిన పంటల సాగు

ఒంగోలు మార్చి 13(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నెలకొన్న తీవ్ర కరువు, పంటల పరిస్థితి ప్రభుత్వానికి ఇప్పటికి గుర్తు వచ్చింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ రైతులను మభ్యపెట్టేందుకు కరువుపై జిల్లా యంత్రాంగాన్ని నివేదికలు పంపాలని కోరింది. పంటల సీజన్ పూర్తయి వచ్చిన అరకొర ఉత్పత్తుల అమ్మకాలు చేసే తరుణంలో నివేదికలు కోరడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది అటు ఖరీఫ్, ఇటు రబీ రెండు సీజన్‌లలోనూ కరువు వెంటాడింది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 366.3 మి.మీ సాధారణ వర్షపాతం కాగా 18.5శాతం లోటుతో 298.6 మి.మీ కురిసినట్లు అధికారిక లెక్కలు బట్టి తెలుస్తోంది. అందులో పంటల సాగుకు ఉపకరించే సమయంలో వర్షాలు లేక సాగు ముందుకు సాగలేదు. ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 5.36లక్షలు ఎకరాలు కాగా 3.54 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. అంటే 66 శాతం మాత్రమే పంటలు సాగు కాగా మూడో వంతు విస్తీర్ణంలో విత్తనం పడలేదు. వేసిన పంటలు కూడా వర్షాలు సరి లేక, దిగుబడులు రాక రైతులు నష్టపోయారు. ఆ సీజన్‌లో కరువు గురించి ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదు. ఇక రబీ సీజన్ చూస్తే ఈ సీజన్‌లో జిల్లాలో 384.80 మి.మీ సాధారణ వర్షపాతం కాగా కేవలం 214.10 మి.మీ నమోదైంది. అంటే దాదాపు 44శాతం లోటు ఉంది. ఆ ప్రభావం పంటల సాగుపై తీవ్రంగా పడింది. ఈ సీజన్‌లో జిల్లాలో 4.27లక్షల ఎకరాలలో వివిధ పంటలు సాగు కావాల్సి ఉండగా 2.77లక్షల ఎకరాల్లో మాత్రమే పడ్డాయి. అంటే రబీలో 44శాతం వర్షపాతం తగ్గగా, 36 శాతం విస్తీర్ణంలో విత్తనం పడలేదు. కీలకమైన శనగ, వరి, మొక్కజొన్న, మిర్చి వంటి పంటల సాగు గణనీయంగా తగ్గిపోగా పొగాకు మాత్రం కాస్తంత పెరిగింది. అయితే వర్షాలు లేక పొగాకు రైతులు కోట్లాది రూపాయలు వెచ్చించి నీటితడులు ఇచ్చి పంటను కాపాడుకొన్నారు. ఇతర పంటలు దిగుబడులు తగ్గిపోయాయి. అంతేకాక పంట సాగు డిసెంబర్ నాటికి పూర్తయి ప్రస్తుతం అన్ని రకాల పంటలు ఇళ్లకు చేరి అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో ప్రభుత్వానికి కరువు గుర్తుకొచ్చింది. నిజంగా కరువు బారినపడ్డ రైతులను ఆదుకునే ఆలోచన ప్రభుత్వానికి ఉంటే డిసెంబర్ ఆఖరులోనే ఆవైపు దృష్టి సారించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. అయితే ఖరీఫ్‌లో కరువును అసలు వదిలేసి, ఎన్నికలు సమీపిస్తున్న వేళ రబీ కరువుపై నివేదికలు కోరడం విమర్శలకు తావిస్తోంది. అయితే ప్రభుత్వ ఆదేశాలతో కరువుపై సమగ్ర నివేదిక పంపేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

# వైసీపీ నాయకులను అరెస్టు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే కందుల డిమాండ్

మార్కాపురం రూరల్, మార్చి 13: టీడీపీ కార్యకర్తను వేధించి అతని ఆత్మహత్యాయత్నానికి కారణమైన వైసీపీ నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా వైద్యశాలలో తర్లుపాడు మండలం కందుల్లపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బ్రహ్మతేజ్ కుమార్ పురుగుమందు తాగి చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న కందుల అక్కడికి వెళ్లి పరామర్శించారు. పార్టీ తరఫున అన్నివిధాలా ఆదుకుంటామని బాధితుడికి ధైర్యం చెప్పారు. అనంతరం కందుల విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నాయకుల దౌర్జన్యాలు, వేధింపులు గ్రామాల్లో ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రహ్మతేజ్‌కుమార్‌పై వేధింపులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. అరాచకాలకు పాల్పడిన వైసీపీ నాయకులపై తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దౌర్జన్యంగా ప్రజల భూములను, ఆస్తులను వైసీపీ నాయకులు ఫోర్జరీ సంతకాలతో కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, తర్లుపాడు మండల అధ్యక్షుడు చిన్నపరెడ్డి, చిట్యాల శేఖర్‌రెడ్డి, బాధితుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శిస్తున్న కందుల

## పేద ఖైదీల విడుదలకు ఆదేశాలు

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 13 : సామాజికంగా వెనుకబడిన, పేదవర్గాలకు చెందిన ఖైదీలను 'పేద ఖైదీలకు మద్దతు పథకం' కింద విడుదల చేయటానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఆయన అధ్యక్షతన బుధవారం జిల్లాస్థాయి సాధికార కమిటీ సమావేశం జరిగింది. ఉప కారాగారాల్లో విచారణ, శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు బెయిల్ పూచీకత్తు లేదా జరిమానా మొత్తాన్ని చెల్లించడానికి ఆర్థిక స్తోమత లేని వారిని గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం మంత్రిత్వశాఖ రాష్ట్రాలకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇందుకోసం జిల్లాలో సాధికార కమిటీని ఏర్పాటు చేసి తొలి సమావేశం నిర్వహించామన్నారు. సమావేశంలో సభ్యులుగా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యామ్‌బాబు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.సత్యకుమారి, ఎస్పీ వి.పరమేశ్వరరెడ్డి, కన్వీనర్‌గా జిల్లా జిల్లా కారాగార అధికారి పి.వరుణారెడ్డి, జిల్లా ఉపకారాగారాల అధికారి కె.వెంకటరెడ్డి, జైలర్ వి.రమేష్‌లు పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఓంప్రకాష్ మృతి


పమిడి ఓంప్రకాష్

టంగుటూరు, మార్చి 13 : టంగుటూరుకు చెందిన ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ పమిడి ఓంప్రకాష్ మృతి చెందారు. కొద్దిరోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో ప్రాణాలు విడిచారు. ఓంప్రకాష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. స్థానిక వాణీనగర్‌లోని స్వగృహంలో ఉన్న ఓంప్రకాష్ పార్థివదేహాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తోపాటు టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్, నాయకుడు మొలకలపల్లి శ్రీనివాసరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. బుధవారమే అంత్యక్రియలు జరిగాయి.

## చేయూత చెక్కుల పంపిణీ


చెక్కును అందజేస్తున్న మంత్రి నాగార్జున

నాగులుప్పలపాడు, మార్చి 13: నాలుగులప్పలపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం మంత్రి మేరుగ నాగార్జున స్వయం సహాయ సంఘాల మహిళలకు చేయూత చెక్కులకు అందజేశారు. నాలుగో విడత చేయూత పథకం కింద 3,542 మందికి రూ.6,64,12,500 చెక్కులను ఆయన చేశారు. మహిళాభివృద్ధికి వైసీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. అనంతరం మహిళలతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి పాల అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ, ఎంపీడీవో మహాలక్ష్మి, నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, మారెళ్ల బంగారుబాబు, పోలినేని కోటేశ్వరరావు, పోలవరపు శ్రీమన్నారాయణ, కంచర్ల సుధాకర్, కోమట్ల త్రినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పౌరసత్వ చట్టాన్ని వెనక్కు తీసుకోవాలి

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 13 : పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ముస్లిం ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఒంగోలులోని పాత కూరగాయల మార్కెట్ సెంటర్‌లోని మౌలానా అబుల్ కలాం అజాద్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సవరణ చట్టాన్ని నోటిపై చేస్తూ ఇది వెంటనే అమలులోకి వస్తుందని ప్రకటించిన నేపథ్యంలో భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా రూపొందించబడిన చట్టాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక కన్వీనర్ పఠాన్ కరిముల్లా, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి నాయకులు ఖాజా, నాయకులు సందాని, షేక్ అబ్దుల్ రవూఫ్, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రితో ముఖాముఖి

ఒంగోలు నగరం, మార్చి 13: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీ, ఎన్‌బీసీఎఫ్‌డీసీ, శ్రీనిధి పథకాల కింద లబ్ధిపొందిన వారితో బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఢిల్లీ నుంచి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న నిధులతో 80 మంది లబ్ధిదారులకు 16 మురుగు శుద్ధి చేయు వాహనాలను గ్రౌండింగ్ చేశారు. రూ.5 కోట్లతో ట్రాన్స్‌పోర్టు వాహనాలను అందించారు. దీంతో ప్రధానమంత్రి వర్చువల్‌లో లబ్ధిదారులతో మాట్లాడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానమంత్రి మోదీ తన అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో డీడీ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# ఇక వైసీపీలో ఉండలేము..!

**ఆ పార్టీ వాణిజ్యవిభాగం నేత నల్లమల్లి బాలు ● దామచర్ల సమక్షంలో టీడీపీలో చేరిక ● భారీగా తరలివచ్చిన అనుచరులు**



అనుచరులతో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నల్లమల్లి బాలు, టీడీపీ కండువా వేసి ఆహ్వానిస్తున్న దామచర్ల (పక్కన)

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 13 : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార వైసీపీకి వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మరోవైపు ఒంగోలు నగరంలోని వైసీపీలో కీలకంగా వ్యవహరించి, ఆ పార్టీ గెలుపులో తమవంతుగా సహకారం అందించిన వారు కూడా నేడు వైసీపీ వద్దు.. టీడీపీ ముద్దు అంటున్నారు. అందులో భాగంగా ఇటీవల నగరంలోని గోపాలనగరంనకు చెందిన పటాపంజుల శ్రీనివాసరావు, కమ్మపాలెంకు చెందిన సీతయ్యతోపాటు ఆర్యవైశ్యులు, అలాగే పలు డివిజన్లలో వైసీపీ కోసం కష్టపడి పని చేసినవారంతా నేడు సైకిల్ ఎక్కుతున్నారు. అందులో భాగంగా బుధవారం వైసీపీ వాణిజ్య విభాగం నగర అధ్యక్షులు నల్లమల్లి బాలు ఆ పార్టీని వీడారు. తన అనుచరులు మరో 150 మందితో కలిసి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. దామచర్ల వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జనార్దన్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనపై ప్రజలే కాకుండా ఆ పార్టీ నేతలు కూడా విసుగు చెందారన్నారు. నాలుగున్నరేళ్ళుగా కనీస అభివృద్ధి చేయకపోవడంతో రాష్ట్ర భవిష్యత్‌పై అందరిలోనూ ఆందోళన నెలకొందన్నారు. మరోసారి జగన్ ముఖ్యమంత్రి అయితే ప్రజలు రాష్ట్రాన్ని విడిచి వలసలు పోయే ప్రమాదం ఉందని ఆందోళనవ్యక్తం చేశారు. అందుకే విజ్ఞులైనవారందరూ వైసీపీకి వీడ్కోలు చెప్పేస్తున్నారని దామచర్ల పేర్కొన్నారు. అందరూ టీడీపీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. అలాగే పార్టీలో చేరిన అందరికీ సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. వైసీపీ నుంచి ముఖ్య నాయకుడుగా ఉన్న నల్లమల్లి బాలు తెలుగుదేశం పార్టీలోకి చేరడం సంతోషంగా ఉందని స్పష్టం చేశారు. అనతరం నల్లమల్లి బాలు మాట్లాడుతూ తాను వైసీపీ కోసం ఎంతో కష్టపడినట్లు చెప్పారు. అయితే జగన్ పాలనలో వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారని, అలాగే యువత కూడా ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోయారన్నారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం ఇరవై ఏళ్ళు వెనక్కు పోయిందన్నారు. తనతోపాటు తన మిత్రులు, బంధువులు, కుటుంబ సభ్యులందరు తెలుగుదేశం పార్టీలో చేరడం సంతోషంగా ఉందని, ఇకపై తాము పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేసి, చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా, దామచర్ల జనార్దన్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నగరానికి చెందిన పలువురు ఆర్యవైశ్యులు ఉన్నారు. దీంతో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది.

# చిలకలూరిపేట సభను విజయవంతం చేయాలి

**టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి విజయకుమార్ పిలుపు ● పార్టీలోకి చేరిన వైసీపీ నాయకులు ● సాదరంగా ఆహ్వానించిన బీఎన్**


విజయ్‌కుమార్‌కు బొకే అందజేసి టీడీపీలోకి చేరిన నాయకులు


వెల్లంపల్లిలో కరపత్రాలను అందజేస్తున్న బీఎన్

మద్దిపాడు, మార్చి 13: చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద ఈనెల 17న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి బీఎన్.విజయకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మద్దిపాడులోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ పాల్గొంటారని తెలిపారు. వైసీపీ విధ్వంసపాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ఈ మూడు పార్టీల కూటమిగా ఏర్పడ్డాయన్నారు. ప్రజలు రాష్ట్ర అభివృద్ధి కోసం భాగస్వాములు కావాలని బీఎన్ కోరారు.

**వైసీపీ నుంచి టీడీపీలో చేరిక**

మండలంలోని గాజులపాలెం వైసీపీ నాయకుడు బేతనముడి రాము ఆధ్వర్యంలో ఐదు కుటుంబాలు మద్దిపాడులోని టీడీపీ కార్యాలయంలో బీఎన్.విజయకుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి బీఎన్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో చాలామంది వైసీపీ కార్యకర్తలు తనకు టచ్‌లు ఉన్నారని చెప్పారు. ఇనమనమెళ్లూరు, నేలటూరు, రాచవారిపాలెం, దొడ్డవరప్పాడు, లింగంగుంట గ్రామాల నుంచి వైసీపీ నాయకులు పార్టీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. బేతనముడి రాము మాట్లాడుతూ వైసీపీ నాయకులు గ్రామస్థాయిలో వ్యవహరిస్తున్న తీరు బాధేసిందని, దీంతో టీడీపీలో చేరినట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, దుద్దుకూరి డేవిడ్, రావి నరసింహారావు, మండవ గోపినాథ్, రెబ్బవరపు ప్రభాకర్ పాల్గొన్నారు.

**వైసీపీ పాలనలో ప్రగతి శూన్యం**

వైసీపీ పాలనలో ప్రగతి శూన్యమని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి బీఎన్.విజయకుమార్ అన్నారు. బుధవారం వెల్లంపల్లి గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. అందువల్ల ప్రజలు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, ముచ్చు సుబ్బారావు, అద్దేపల్లి దుర్గాభవాని, దాట్ల వేణుగోపాల్‌రాజు, బాపట్ల ఆశీర్వాదం తదిరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

**● కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం**


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్) మార్చి 13: ఎన్నికల కమిషన్ సూచనలను పాటించి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ పరమేశ్వరరెడ్డితో కలిసి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఆర్వోలు, డీఎస్పీలు, ఏఆర్వోలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, ఈడీటీలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఏ క్షణమైనా వచ్చే అవకాశం ఉన్నందున నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు సన్నద్ధంగా ఉండాలన్నారు. నియోజకవర్గ పరిధిలో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. నోటిఫికేషన్ జారీ నుంచి పోలింగ్ వరకు చేపట్టాల్సిన రోజు వారి విధులపై చెక్ లిస్ట్‌తో పాటు కార్యచరణ ప్రణాళికను రూపొందించుకొని ఏర్పాట్లు పూర్తి చేయాలని చెప్పారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అధికారులు, పోలీసు అధికారుల మధ్య సమన్వయం అత్యంత కీలకమన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ, మార్కాపురం, సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, అడిషినల్ ఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్వో శ్రీలత, జడ్పీసీఈవో జాలిరెడ్డి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

**ఎన్నికలకు ప్రణాళికలు సిద్ధం**

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ రాష్ట్ర ప్రధాన ఎన్నిక అధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. బుధవారం అమరావతి నుంచి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో సాధారణ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడనున్న దృష్ట్యా, పెండింగ్‌లో ఉన్న ఫామ్స్ 6,7,8లను త్వరితగతిన క్లియర్ చేసేలా చర్యలు చేపట్టాలని, జారీ చేసిన ఎపిక్ కార్డును త్వరగా పంపిణీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో 6,718 ఫామ్స్ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ పరమేశ్వరరెడ్డి, జేసీ గోపాలక్రిష్ణ, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్వో శ్రీలత, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**● పరిశీలకులు ప్రసన్నకుమార్**



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

ఒంగోలు(విద్య) మార్చి 13: జిల్లాలో ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల రాష్ట్ర పరిశీలకులు ఎంఆర్.ప్రసన్నకుమార్ ఆదేశించారు. ఒంగోలులోని జిల్లా పరిషత్ పాత సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన ఒంగోలు డివిజన్‌లోని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని, విద్యార్థులెవరూ కింద కూర్చొని పరీక్ష రాయకుండా ఫర్నీచరు ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని కేంద్రాలలో విద్యుత్, ఫ్యాన్లు, తాగునీరు, టాయిలెట్లు, అత్యవసర మందులు, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని, సబ్జెక్టు టీచర్లను వారి పరీక్షకు ముందు రోజే విధుల నుంచి రిలీవ్ చేయాలన్నారు. వాళ్ల విద్యార్థులు పరీక్ష రాసే కేంద్రాలకు ఆయా టీచర్లను ఇన్విజిలేటర్లుగా నియమించకూడదని ప్రసన్నకుమార్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్, ఉప విద్యాధికారి అనితా రోజ్ రాణి, డీసీఈబీ కార్యదర్శి వై.వెంకట్రావు, కిశోర్‌బాబు, డి.వెంకారెడ్డి, ఎస్.సుబ్బారావు, బి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు : మంత్రి సురేష్


నమూనా చెక్కులు అందజేస్తున్న మంత్రి సురేష్

సింగరాయకొండ, మార్చి 13 : ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక బస్టాండ్‌లో రూ.80 లక్షలు వెచ్చించి పూర్తి చేసిన పనులను ఆయన బుధవారం ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, సంస్థ నెల్లూరు జోనల్ చైర్‌పర్సన్ బత్తుల సుప్రజారెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నెల్లూరు జోనల్ ఈడీ ఆదాం సాహెబ్, జిల్లా ప్రజా రవాణాధికారి బి.సుధాకర్, ఒంగోలు డిపో మేనేజర్ డి.శ్రీనివాసరావు, ఎంపీపీ కట్టా శోభారాణి, సర్పంచ్ తాటిపర్తి వనజ, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

కొండపి: వైఎస్సార్ చేయూత నమూనా చెక్కులను రాష్ట్ర మంత్రి, వైసీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ మండల కార్యాలయాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తొలుత ఆయన సీఎం ఫొటోకు పాలభిషేకం చేశారు. వెలుగు ఏపీఎంలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## అవీ..ఇవీ..

### నిరుద్యోగ మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంతనూతలపాడు, మార్చి 13: నిరుద్యోగ మహిళలకు ఉచితంగా మూడు నెలలుపాటు కంప్యూటర్ నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజయాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎండ్లూరు డొంకవద్దనున్న మహిళ ప్రాంగణంలో ఈ శిక్షణ ఉంటుందని, 15-45 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9963005209 సెల్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

### కవయిత్రి మొల్లకు ఘన నివాళి

ఒంగోలు క్రైం, మార్చి 13: ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అదనపు ఎస్పీ ఏఆర్.అశోక్‌బాబు మాట్లాడుతూ అణగారిన కులాలపట్ల వివక్షను ఛేదించుకొని వెలుగు చూసిన నారీమణి మొల్ల అని కొనియాడారు. కార్యక్రమంలో ఏవో ఎం.సులోచన, ఆర్ఐలు సీతారామిరెడ్డి, రమేష్, కృష్ణ, రమణారెడ్డి తదితరుల పాల్గొన్నారు.

### రాజీవ్ గృహకల్పలో పోలీస్ కవాతు


కవాతు నిర్వహిస్తున్న సీఐ భక్తవత్సలరెడ్డి, ప్రత్యేక బలగాలు

ఒంగోలు క్రైం, మార్చి 13: రానున్న ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. బుధవారం సాయంత్రం ఒంగోలు నగరంలోని కొప్పోలు రోడ్డులో గల ఇందిరమ్మ కాలనీ, రాజీవ్‌గృహకల్పలో తాలుకా సీఐ భక్తవత్సలరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎలాంటి అసాంఘీక చర్యలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.233

సంతనూతలపాడు, మార్చి 13: పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం పొగాకు గరిష్ఠ ధర రూ.233 పలికింది. మద్దులూరు నుంచి 790 పొగాకు బేళ్లు రాగా 730 బేళ్లు అమ్ముడయ్యాయని, 60 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర కేజీ రూ.233 పలకగా, కనిష్ఠ ధర రూ.220 పలికింది. సరాసరి ధర రూ.229.51 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

### బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం


మాట్లాడుతున్న అడకా స్వాములు

సంతనూతలపాడు, మార్చి 13: రాష్ట్రంలోని బీసీల అభివృద్ధి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతోందని టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు పేర్కొన్నారు. బుధవారం సంతనూతలపాడులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీసీల డిక్లరేషన్ సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్, బీసీలకు శాశ్వత కులధ్రువీకరణ పత్రం వంటివి ఎన్నో ఉన్నాయన్నారు. నియోజవకర్గంలోని నాలుగు మండలాల్లో బీసీ నాయకులందరూ ఇంటింటికి డోర్ తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే బీసీలకు జరిగే లబ్ధిని వివరించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో బీసీ సోదరులందరూ టీడీపీకి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు రావి శ్రీను తన్నీరు శ్రీను, బొడ్డు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీలు బాధ్యతగా పనిచేయాలి

సంతనూతలపాడు, మార్చి 13: అంగన్‌వాడీలు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేయాలని ఐటీసీ ప్రతినిధి, ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్రావు పేర్కొన్నారు. బుధవారం ఎండ్లూరు డొంకవద్ద నున్న మహిళా ప్రాంగణంలో ఐటీసీ, ప్రథమ్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3 నుంచి 6 సంవత్సరాలు గల పిల్లల్లో మంచి ఆరోగ్యాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవోలు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

### జలజీవన్ పథకానికి శంకుస్థాపన

సంతనూతలపాడు, మార్చి 13: మంగమూరు గ్రామంలో రూ.56లక్షల వ్యయంతో నిర్మించదలచిన జలజీవన్ పథకానికి మంత్రి మేరుగ నాగార్జున బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం అదే గ్రామంలో వైసీపీ నాయకుని తండ్రి టి.పాపయ్య దశదినకర్మకు హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ, జడ్పీటీసీ డి.రమణమ్మ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

### నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్ చైర్మన్‌గా రమేష్‌బాబు

ఒంగోలు(కలెక్టరేట్) మార్చి 13: ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్ ఫెడరేషన్ ఎన్నికలలో ప్రకాశం జిల్లా చైర్మన్‌గా తన్నీరు వి.రమేష్‌బాబు ఎన్నికయ్యారు. బుధవారం ఒంగోలు నగరం సంతపేటలోని పశుసంవర్ధక శాఖ ఆవరణలో ఎన్నికలు నిర్వహింగా కో చైర్మన్‌గా శంకరరావు, వైస్ చైర్మన్ గా కె.రాజేశ్వరి, ఖాజామొహిద్దీన్, ఎం.రంగనాథ్, డి.కృష్ణాంజనేయులు, జాయింట్ సెక్రటరీగా ఎం.కోటేశ్వర రావు, పి.రవిచంద్రకుమార్, బి.చరణ్‌కుమార్ కె.కుమారి, టి.శ్యామలా కుమారి, ట్రెజరర్‌గా బి.ప్రభావతి ఎన్నికయ్యారు. మొత్తం మూడు సంఘాలకు చెందిన 170 మంది ఎన్నికలలో పాల్గొన్నారు.

### విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారుల దాడులు


మాట్లాడుతున్న విద్యుత్‌శాఖాధికారులు

చీమకుర్తి, మార్చి13 : విద్యుత్‌శాఖకు చెందిన విజిలెన్స్ అధికారులు బుధవారం చీమకుర్తి సెక్షన్ పరిధిలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ కట్టా వెంకటేశ్వర్లు, ఆపరేషన్స్ ఈఈ అబ్దుల్‌కరీం ఆధ్వర్యంలో 39 బృందాలు దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా అదనపులోడు వాడుతున్న 73సర్వీసులును గుర్తించి రూ.4.57లక్షలు అపరాధ రుసుం విధించారు. అదేవిదంగా అక్రమంగా కరెంటు వాడుతున్న వారిపై పెనాల్టీ విధించారు. అనంతరం స్థానిక కార్యాలయంలో ఇందుకు సంబంధించి వివరాలను అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో చీమకుర్తి డీఈఈ కృష్ణారెడ్డి, దర్శి డీఈఈ పిచ్చయ్య, ఏఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి

**● చైర్మన్‌కు అప్డేట్ సభ్యుల వినతి**


వినతిపత్రాన్ని అందజేస్తున్న సభ్యులు

సింగరాయకొండ, మార్చి 13 : జాతీయ రహదారిపై వెళ్లే ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంస్థ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డిని అప్డేట్ సభ్యులు కోరారు. బుధవారం సింగరాయకొండకు వచ్చిన ఆయనకు ఆమేరకు వినతి పత్రం అందజేశారు. అధికారుల లెక్కల ప్రకారం బస్టాండ్‌లోకి రోజుకు 100పైగా సర్వీసులు రావాల్సి ఉండగా 30 నుంచి 40 మాత్రమే వస్తున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 వరకు నెల్లూరు, విజయవాడ వైపు వెళ్లే బస్సులు రావడం లేదని చైర్మన్‌కు తెలిపారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని వివరించారు. దీనిపై మల్లికార్జున్‌రెడ్డి స్పందిస్తూ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగరాయకొండ అప్డేట్స్ సభ్యులు కాకా సాయితేజ, చెన్నంశెట్టి హరిబాబు, మస్తాన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

### బాలుడు అదృశ్యంపై కలకలం

ఒంగోలు క్రైం, మార్చి 13: పన్నెండేళ్ల బాలుడు అదృశ్యమైన ఘటనపై బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒంగోలులో నివాసముంటున్న యక్కల భరద్వాజ్ హితేష్ సీతారామ్ 7వ తరగతి చదువుతున్నాడు. ఆయన బుధవారం మధ్యాహ్నం ఇంటిలో దుస్తులు సర్దుకుని సైకిల్‌పై బయలు దేరి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బాలుడి తాతయ్య వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐ లక్ష్మణ్ సిబ్బందిని అప్రమత్తం చేసి వెంటనే విచారణ ముమ్మరం చేశారు. ఆ బాలుడు స్థానిక రంగారాయుడు చెరువు కట్ట ఉండటంతో పోలీసులు సిబ్బంది వెంటనే గుర్తించారు. సీఐ సకాలంలో స్పందించి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

# వలంటీర్లకు వాయినాలోయ్..!



డిన్నర్‌సెట్, వాటర్‌బాటిల్‌ను తీసుకుని బండిపై వెళ్తున్న వలంటీర్

**రూ. 5వేల నగదు, డిన్నర్ సెట్, కూలింగ్ బాటిల్ పంపిణీ**

**'కనిగిరి'లో పూర్తిస్థాయిలో పంచలేదంటూ గగ్గోలు**

కనిగిరి, మార్చి 13 : ఇస్తినమ్మ వాయినం.. పుచ్చుకుంటినమ్మా వాయినం అనే నానుడి చందంగా ఉంది వైసీపీ నేతలు, వలంటీర్ల తీరు. ఎన్నికలు సమీపిస్తుండటంతో వైసీపీ అధిష్ఠానం రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లను ప్రచారకర్తలుగా, ఓట్లకు ఎర వేసే నోట్ల పంపిణీ ఏజెంట్లుగా మార్చుకునేందుకు సరికొత్త వ్యూహానికి తెర లేపింది. అందులో భాగంగా వలంటీర్లకు నగదు, ఆకర్షణీయమైన బహుమతులు పంచుతున్నారు. దీంతో బుధవారం కనిగిరిలోని ఆరు మండలాల్లో వలంటీర్లకు రూ.5వేలు నగదు, డిన్నర్‌సెట్, కూలింగ్ వాటర్ బాటిల్‌లను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో మాత్రం పూర్తిస్థాయిలో వలంటీర్లకు అందలేదంటూ గగ్గోలు మొదలైంది. జిల్లా వైసీపీ పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కనుసన్నల్లోనే నడిపిస్తున్నారని సమాచారం. మరోవక్క కనిగిరి పార్టీ 'ఆ నలుగురు' చెప్పుచేతల్లోనే నడుస్తోందని మిగిలిన నేతలు రగిలిపోతున్నారు. ఆ క్రమంలోనే వలంటీర్లకు తాయిలాలు మొక్కుబడిగా పంపిణీ చేసినట్లు సమాచారం.




డిన్నర్ సెట్ సంచి

## వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



టీడీపీలోకి చేరిన వారితో దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 13 : ఒంగోలు నగరంలోని 29వ డివిజన్‌కు చెందిన పలువురు వైసీపీ సానుభూతిపరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. బుధవారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పుసుపులేటి వెంకటేశ్వర్లు, మునగాల రామాంజనేయులు, గొరపర్తి భద్రయ్య కంచర్లపల్లి రామరావుతో పాటు పలువురు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

# విజృంభించిన చికున్‌గున్యా

**నాయుడుపాలెంలో 300 మందికి జ్వరం**

**పసుపుగల్లు, మారెళ్లలోనూ బాధితులు**

**అద్దంకి రెండు ప్రైవేట్ ఆస్పత్రుల్లో మూలుగుతున్న జ్వరపీడితులు**

**వైద్యం కోసం వేల రూపాయలు ఖర్చు పెడుతున్న పేదలు**

**ప్రతి ఇంటిలో ఇద్దరి నుంచి ఆరుగురు..**

ముండ్లమూరు, మార్చి 13 : మండలంలోని నాయుడుపాలెంలో చికున్‌గున్యా వ్యాధి విజృంభించింది. వారం, పది రోజుల నుంచి జ్వరంతో గ్రామస్థులు మూలుగుతున్నారు. మరికొందరు రోగులు అద్దంకి, ఒంగోలు ప్రభుత్వ ఆస్పత్రులకు క్యూకట్టారు. ఆర్థిక స్తోమత లేని వారు ఇంటి వద్దే మంచం పట్టి ఆర్‌ఎంపీల వద్ద చికిత్స చేయించుకుంటున్నారు. కాళ్ల వాపు, ఒళ్లు నొప్పులతో అల్లాడిపోతున్నారు. ఒక్క నాయుడుపాలెంలోనే 300 మందికి పైగానే చికున్ గున్యా వ్యాధితో బాధపడుతున్నారు. గ్రామానికి చెందిన గొర్రె విజయలక్ష్మి, గొర్రె వెంకటేశ్వర్లు, అక్కమ్మ, గొర్రె శివమణి, యాదాల నాగేశ్వరరావు, అల్లూరమ్మ, వెంకటేశ్వర్లు, పోకల అల్లూరమ్మ, అమరనాథ్, కుర్రా రవి, శ్రీను, గాదెమ్మ, రజావలి, కాశమ్మ, ఎస్‌కే బాబ్జీ జాన్, అంజిబాబు, బద్రి అనీల్ కుమార్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ గొర్రె శ్రీదేవి, ఆమె భర్త రాముడుతో పాటు మరో 300 మంది వరకు మంచం పట్టారు. వీరిలో విద్యార్థులు, చిన్నారులు మొదలుకొని వృద్ధులు సైతం ఉన్నారు. ఏ ఇంట్లో చూసినా ఇద్దరి నుంచి ఆరుగురు వరకు జ్వర పీడితులే ఉన్నారు. ఇప్పటికే ఒక్కొక్కరికి రూ.10వేలు నుంచి రూ.15వేలు వరకు ఖర్చు చేశారు. చికున్‌గున్యా వ్యాధి బారినపడిన వారు కదల్లేక మంచంలోనే మూలుగుతున్నారు. వారి పనులు వారు కూడా చేసుకోలేక పోతున్నారు. తక్షణమే గ్రామంలో ప్రభుత్వ అధికారులు స్పందించి వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



చికిత్స పొందుతున్న భార్యాభర్తలు వెంకటేశ్వర్లు, అంకమ్మ





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విజయలక్ష్మి, విద్యార్థి అనిల్‌కుమార్‌రెడ్డి

**పసుపుగల్లు, మారెళ్లలోనూ చికున్‌గున్యా బాధితులే**

పసుపుగల్లు, మారెళ్ల గ్రామాల్లోనూ చికున్ గున్యా బాధితులు ఎక్కువగా ఉన్నారు. వారం రోజులుగా రెండు గ్రామాల్లో ఈ వ్యాధి విజృంభించింది. ప్రతి ఇంట్లో బాధితులు ఉన్నారు. దర్శి, ఒంగోలు పట్టణాలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు.

## ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిన బాలినేని



ప్రహరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని

కొత్తపట్నం(ఒంగోలునగరం), మార్చి 13: కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. పర్యటనలో భాగంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్ షెల్టర్‌ను ప్రారంభించారు. జగనన్న చేయూత కింద రూ.5.62 కోట్ల నిధుల చెక్కులను పంపిణీ చేశారు. రంగాయపాలెం పంచాయతీ పరిధిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్, ఆయుష్మాన్ భారత్ భవనాలను ఆయన ప్రారంభించారు. గ్రామంలో నూతనంగా నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. ముస్లింల కబరస్థాన్ ప్రహరీ గోడను ఆయన ప్రారంభించారు. పాదర్తిలో జరిగిన ఇళ్ళ పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్ళ పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ మోహనరావు, వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి, మండల అధ్యక్షులు రాఘవరావు, పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత శిక్షణ

అద్దంకిటౌన్, మార్చి 13: గ్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు బ్యూటిషన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ హనుమంతరావు తెలిపారు. దీనిపై బుధవారం అద్దంకిలో ఎస్‌జీహెచ్ మహిళలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం అద్దంకి, మేదరమెట్ల, ముప్పవరం గ్రామాలలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాబార్డ్ డీపీఎం జి.శరత్‌బాబు, షరీఫ్, మహిళలు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే పీడీసీసీ బ్యాంక్ లక్ష్యం

**తక్కువ శాతానికే రుణాలు**

**ఛైర్మన్ వైఎం.ప్రసాదరెడ్డి**



బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న ఛైర్మన్ ప్రసాదరెడ్డి

ముండ్లమూరు, మార్చి 13 : సహకార సమాఖ్యతో రైతుల ఇంటింటికీ సహకారం అందిస్తున్నట్లు పీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ వైఎం.ప్రసాదరెడ్డి చెప్పారు. బుధవారం ముండ్లమూరులో నూతనంగా ఏర్పాటు చేసిన పీడీసీసీ బ్యాంక్ శాఖను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది కొత్తగా మూడు శాఖలను ప్రారంభించామన్నారు. రైతులకు తక్కువ శాతానికే వ్యవసాయ రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. రైతు కుటుంబంలో చదువుకుంటున్న విద్యార్థులకు విదేశీ విద్య కోసం రూ.40 లక్షలు వరకు ఎటువంటి ష్యూరిటీ లేకుండా రుణసౌకర్యం అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో కోటిరెడ్డి, నాబార్డు డీజీఎం రమణ, మేనేజర్ శివపార్వతి, సొసైటీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరెడ్డి, మానం వెంకటరావు, కుమ్మెత వెంకటరెడ్డి, గాదె నాసరరెడ్డి, తన్నీరు శ్రీనివాసులు, చింతల కృష్ణారెడ్డి, దర్శి సొసైటీ అధ్యక్షులు చెన్నారెడ్డి, వెంకటేశ్వర్లు, సీఈవోలు ఎస్ వెంకటేశ్వర్లు, కే ఈశ్వర్, ఆర్ శంకర్, టీ రామాంజనేయులు, నరసయ్య, రిటైర్డు మేనేజర్ బోడపాటి చంద్రమౌళి, నారాయణరావు, వీరపనేని రాంబాబు, జిల్లెలమూడి శివయ్య పాల్గొన్నారు.

## గ్రానైట్ పరిశ్రమలపై సర్వే

బల్లికురవ. మార్చి 13 : గ్రానైట్ పరిశ్రమలపై జిల్లా పరిశ్రమల అధికారి ఉమాశంకర్ ఆధ్వర్యంలో బుధవారం సర్వే చేపట్టారు. బల్లికురవ మండలంలో ఉన్న అన్ని గ్రానైట్ ఫ్యాక్టరీల వివరాలను సేకరించేందుకు సచివాలయ అసిస్టెంట్ల సహకారంతో ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఫ్యాక్టరీ యజమాని కులం పేరు, పరిశ్రమ పేరు, ఎంత ఖర్చు చేశారు. ప్రభుత్వం సబ్సిడీ ఎంత ఇచ్చింది వంటి వివరాలను సేకరిస్తున్నారు. ఈ సర్వే ద్వారా జిల్లాలో పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి అన్న వివరాలు తెలిసే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు. ఈసర్వేపై కూడా గ్రానైట్ యజమానులలో తీవ్ర ఆందోళన మొదలైంది. గతంలోనే పరిశ్రమల వివరాలు అధికారుల వద్ద ఉన్నాయని, ఇప్పుడు సర్వే చేపట్టటం ఎమిటని వారు అంటున్నారు. మరో నాలుగు రోజుల పాటు అన్ని ఫ్యాక్టరీలలో సర్వే కార్యక్రమం జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## శింగరకొండ హుండీ ఆదాయం రూ. 21.66 లక్షలు



కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

అద్దంకి, మార్చి13: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం హుండీల కానుకల ద్వారా 21,66,561 రూపాయల ఆదాయం వచ్చింది. హుండీల కానుకల ను బుధవారం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర, పంగులూరు గ్రూపు దేవస్థానాల ఈవో శ్రీనివాసరావుల పర్యవేక్షణలో జరిగింది. డిసెంబరు 13 వ తేదీ నుంచి బుధవారం వరకు హుండీల ద్వారా వచ్చిన కానుకలను లెక్కించారు. విదేశీ కరెన్సీ యుఎస్‌ఏ డాలర్లు 15, ఇంగ్లాండ్ ఫౌండ్స్ 120 వచ్చినట్లు ఈవో సుభద్ర తెలిపారు.

**వంట సామగ్రి ఇచ్చేందుకు ఎస్‌బీఐ ముందుకు..**

శింగరకొండ దేవస్థానం అన్నదానం కిచెన్ ఐటమ్స్, బాయిలర్స్ ఇతర సామగ్రిని 10 లక్షల రూపాయలతో కొనుగోలు చేసి ఇచ్చేందుకు ఎస్‌బీఐ ముందుకు వచ్చివర్క్ ఆర్డర్ ఇచ్చినట్లు ఈవో సుభద్ర తెలిపారు.

## కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కనిగిరి, మార్చి 13 : కనిగిరి కేజీబీవీలో 6 నుంచి 11వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హసీనాబేగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, 7, 8 తరగతులలో మిగిలిన సీట్లను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తులు పంపవచ్చనిచ ఇంటర్ ఎంపీసీ గ్రూపులో మొదటి సంవత్సరం 40 సీట్లు ఉన్నాయని తెలిపారు.

## రేపు ఇంకొల్లు సర్పంచ్‌పై విచారణ

ఇంకొల్లు,మార్చి 13: ఇంకొల్లు సర్పంచ్ ఏజర్ల ప్రసన్నపై గతంలో వచ్చిన వివిధ అభియోగాలపై కలెక్టరు ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీన బాపట్ల జిల్లా గ్రామపంచాయతీ అధికారి ఆధ్వర్యంలో విచారణ చేపట్టనున్నట్లు ఈవోఆర్డీ శ్రీనివాసరావు తెలిపారు. పంచాయతీలో సర్పంచ్ ప్రసన్న సంతకాల ఫోర్జరీ చేయడం, ఉన్నతాధికారుల ఆదేశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం, సుమారు రూ. కోటి 70లక్షల నిధుల దుర్వినియోగంపై 3 నెలల పాటు చెక్‌పవర్ రద్దు చేయగా ఈ అంశాలపై వచ్చిన అభియోగాలపై తిరిగి విచారణ చేయనున్నట్లు తెలిపారు.ఈ విచారణలో జిల్లా గ్రామపంచాయతీ అధికారి రాంబాబు, చీరాల డివిజనల్ పంచాయతీ అధికారి పాల్గొంటారని, ఆ సమయంలో బాధ్యులైన అధికారులకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు.

## తపాలా సేవలను చేరువ చేయాలి

**• అసిస్టెంట్ డైరెక్టర్ శివనాగరాజు**

పొదిలి, మార్చి 13 : భారత తపాలాశాఖ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరువ చేయాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఇ.శివనాగరాజు కోరారు. బుధవారం పొదిలిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ ఇన్సూరెన్స్ కంపెనీ కూడా ఇవ్వలేనంత బోనస్‌ను తపాలా జీవిత బీమా పథకంలో పాలసీదారులకు అందిస్తున్నట్లు వివరించారు. తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్ నినాదంతో తపాలా జీవిత బీమా పాలసీలను తెచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రజల కోసం ఆర్‌పీఎల్‌ఐ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. మార్చి 13న మహా లాగిన్ డే సందర్భంగా మార్కాపురం డివిజన్‌లో ఒక్కరోజులో రూ.కోటి ప్రీమియం లక్ష్యాన్ని అధిగమించిన సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఒక్క పొదిలి సబ్ డివిజన్‌లోనే రూ.52 లక్షల ప్రీమియం వసూలు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తపాల సేవలు అందించడంతో చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మార్కాపురం ఎస్పీ కె.శ్రీనివాస్, ఐపీవోలు పి.వెంకటేశ్వర్లు, బి.నాగరాజు, ఎస్కే.మహమ్మద్‌ఆలి, ఎ.దివాకర్ కుమార్, హెడ్ పోస్ట్ మాస్టర్ కె.నాగేశ్వరరావు, ఎంవోలు ఎం.శ్రీనివాసులు, కె.శ్రీనివాసరావు, ఎస్‌పీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

## 82 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

చినగంజాం, మార్చి 13 : మోటుపల్లి గ్రామం నుంచి తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కడవకుదురు గ్రామ శివారులో సివిల్ సప్లయిస్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం మోటుపల్లి గ్రామం నుంచి తరలిస్తున్న 82 బస్తాలను(50కిలోలు) కడవకుదురు గ్రామ శివారులో అధికారులు పట్టుకున్న ట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. మోటుపల్లి చెందిన సుంకర వెంకటరావు ఆదేశాల మేరకు బియ్యాన్ని తీసుకొని వెళ్తున్నట్లు డ్రైవర్ షేక్ నాగుర్ తెలిపారు. సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ షేక్.నాగుర్, సుంకర వెంకటరావులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## పోలేరమ్మ గుడిలో చోరీ


మార్కాపురం రూరల్, మార్చి 13 : వేమలకోట గ్రామం పరిధిలోని మార్కాపురం - కంభం రోడ్డు పక్కన చెరువు కట్టపైపు గల పోలేర మ్మ గుడిలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. హుండీని పగులగొట్టి అందులోని నగదును అపహరించి అక్కడే పడేసి వెళ్లిపోయారు. సీసీ కెమెరా ఫుటేజీ హార్డ్ డిస్క్‌ను ధ్వంసం చేశారు. హుండీలో సుమారు రూ.15 వేల నగదు ఉన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ వెంకటేశ్వరనాయక్ సిబ్బందితో కలిసి పరిశీలించారు.



## బైక్ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

అద్దంకి, మార్చి13: మోటార్‌సైకిల్ ఢీ కొనటంతో వాకింగ్ చేస్తున్న వృద్ధుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని న్యూ ఎస్‌బీఐ కాలనీలో నివాసం ఉంటున్న వేలమూరిపాడుకు చెందిన తొట్టెంపూడి నాగేశ్వరరావు బుధవారం సాయంత్రం రామ్‌నగర్ సెంటర్ నుంచి నాగులపాడు రోడ్డు వైపు వాకింగ్ వెళ్తుండగా నాగులపాడు వైపు నుంచి వచ్చిన మోటార్‌సైకిల్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనం లో స్థానిక ప్రవేట్ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు. మోటార్‌సైకిల్‌పై ఉన్న యువకుడు శివయ్య మద్యం మత్తులో వేగంగా వచ్చి వృద్ధుడిని ఢీ కొట్టడంతో పాటు సమీపంలో నిలిపి ఉన్న మరో రెండు మోటార్‌సైకిళ్లనూ ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో శివయ్యకు కూడా గాయాలు కావటంతో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## కారంచేడులో కర్ణాటక మద్యం



తాగిపడేసిన ప్యాకెట్లు

కారంచేడు(పర్చూరు), మార్చి 13: కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం బ్రాండ్లు కారంచేడులో దర్శనమిస్తున్నాయి. కుప్పలు తెప్పలుగా తాగి పడేసిన బాటిళ్లు దర్శనమివ్వటంతో భారీగా కర్ణాటక మద్యం కారంచేడుకు చేరిందన్న చర్చ జోరుగా సాగుతుంది. బుధవారం కారంచేడు జగనన్న కాలనీలో తాగి పడేసిన ఆ రాష్ట్ర మద్యం బ్రాండ్ సిల్వర్ కప్ తాలూకు 90 ఎంఎల్ ప్యాకెట్‌లు మీడియా కంట పడ్డాయి. దీంతో కర్ణాటక మద్యాన్ని భారీగా కారంచేడు తెచ్చారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇలా ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం బ్రాండ్లు విచ్చలవిడిగా కంట పడటం సర్వత్రా చర్చగా మారింది. ఇప్పటికే గ్రామ గ్రామాన బెల్ట్ షాపులు జోరుగా సాగుతున్న తరుణంలో ఇతర రాష్ట్రాల నుంచి మద్యం వస్తున్నట్లు కనిపించటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జోరుగా అక్రమ మద్యం విక్రయాలు కుటీర పరిశ్రమలుగా సాగుతున్నా పట్టించుకోని సెబ్, పోలీసు అధికారులు ఇతర రాష్ట్రానికి చెందిన మద్యాన్ని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది.

# లక్ష్యం ఘనం.. సేవలు శూన్యం..!

» రైతులకు అందని ఏఎంసీ పాలన

» గోదాములు అందుబాటులో లేకపోవడంతో నష్టాలకు ఉత్పత్తుల అమ్మకాలు

పొదిలి, మార్చి 13 : లక్ష్యం ఘనం.. సేవలు శూన్యంలా మారింది పొదిలి ఏఎంసీ సేవలు. గత ఐదు సంవత్సరాలుగా పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఆదాయం లక్షల్లో వస్తోంది. అయినా అన్నదాతలకు అందించే సేవలు మాత్రం కనపడడం లేదు. అసలే అంతంతమాత్రంగా ఉన్న మార్కెట్ కమిటీకి రెండేళ్లుగా పాలకవర్గమూ లేదు. లక్ష్యానికి తగినట్లుగా రైతులకు పాలన అందడం లేదు. ఇప్పటి వరకు సొంత కార్యాలయం లేక అద్దె భవనంలోనే కార్యకలాపాలను సాగిస్తున్నారు. సుమారు నాలుగేళ్ల క్రితం ఒంగోలు - కర్నూలు ప్రధాన రహదారి వెంబడి ఐదెకరాలు స్థలంలో మార్కెట్ యార్డ్ కార్యాలయం, గోడౌన్‌లను ఏర్పాటు చేయాలని కేటాయించారు. రూ.40లక్షల వ్యయంతో మంజూరు కావడంతో చుట్టూ ప్రహరీగోడను నిర్మించి వదిలేశారు. ఆప్రాంతంతో పరిపాలనా విభాగం, గోదాములు, రైతులకు విశ్రాంతి గదులు, అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆ తరువాత ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో అధికారులు, నాయకులు చేతులెత్తేశారు. గత ప్రభుత్వాల హయాంలో ఏఎంసీ తరుపున పశువైద్య శిబిరాలు, రైతులకు అవగాహన సమావేశాలు, రుణ సౌకర్యం కూడా ఏర్పాటు చేసేవారని రైతులు చెప్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అలాంటి ఏమి లేకపోవడంతో అలాంటి వ్యవసాయ మార్కెట్ అవసరమా అనే విమర్శలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. 1976లో ఏర్పాటైన ఏఎంసీ 65 గ్రామ పంచాయతీల్లో 78 గ్రామాలకు, 35వేల మంది రైతులు, 2.5 లక్షల పశు సంపద కలిగి ఉంది. పొదిలి ప్రాంతంలో నాలుగు మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం నిల్వలు ఉంటాయని అందుకు అనుకూలమైన గోదాములు లేకపోవడంతో వచ్చిన పంటను వచ్చినట్లు నష్టాలకు అమ్ముకుంటున్నామని రైతులు వాపోతున్నారు. గోదాములు అందుబాటులో ఉంటే నిల్వ చేసుకొని, పంటకు గిట్టుబాటు ధర వచ్చిన తరువాత అమ్ముకొని లాభపడతామని అన్నదాతలు అంటున్నారు. ప్రతి ఏడాదీ శిస్తు వసూళ్లు ఘననీయంగా పెరుగుతున్నాయి. 2019-20 శిస్తు లక్ష్యం రూ.60 లక్షలు, వసూలు రూ.94.94 లక్షలు, 2020-21 లక్ష్యం రూ.95లక్షలు, వసూలు 35.85లక్షలు, 2021-22 లక్ష్యం రూ.కోటి20లక్షలు, వసూలు రూ.కోటి 25.86, 2022-23లో రూ.కోటి25లక్షలు, వసూలు రూ.కోటి 26.23లక్షలు 2023-24లో లక్ష్యం రూ.కోటి 40లక్షలు, ప్రస్తుతం వసూలు రూ.54.63 లక్షలుగా ఉంది. ఆదాయమున్నా రైతుకు ఎలాంటి సౌకర్యాలు కల్పించిన దాఖలాలు లేవు.



అద్దె భవనంలో కొనసాగుతున్న ఏఎంసీ కార్యాలయం
లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ప్రహరీ

**రెండేళ్లుగా పాలకవర్గం లేక**

అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని అనే విధంగా ఉంది పొదిలి ఏఎంసీ పరిస్థితి. 65 గ్రామ పంచాయతీలకు అనువుగా ఉన్న ఏఎంసీ సరైన పాలకవర్గం లేకపోవడంతో 44సంవత్సరాలుగా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా అతీగతి లేకుండా ఉంది. రెండు సంవత్సరాలకు ముందు బీసీ మహిళకు కేటాయించారు. అప్పుడు గుర్రపుశాల కోటేశ్వరి ఏఎంసీ చైర్మన్‌గా రెండు పర్యాయాలు పదవిలో ఉన్నారు. మార్కాపురం నియోజకవర్గ పరిధిలో బీసీకి కేటాయించిన ఏఎంసీని ఓసీకి ప్రతిపాదన చేశారని పలువురు అంటున్నారు. ఆక్రమంలో ఓసీకి జనరల్ రిజర్వు అయిన పొదిలిని ఎస్సీ మహిళకు మార్పు చేశారు. ఆ క్రమంలో పొదిలి మండలం నుంచి జడ్పీటీసీ మాజీ సభ్యుడు గూడూరి ఐజాక్ కోడలు, గూడూరి స్వప్న, మాజీ ఎంపీపీ కోవెలకుంట్ల నరసింహారావు, కంభాలపాడు గ్రామానికి చెందిన మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తెరపైకి వచ్చారు. గత జడ్పీటీసీ ఎన్నికల సమయంలో కొనకనమిట్ల నుంచి పోటీలో ఉన్న అభ్యర్థిని ఏఎంసీ ఇప్పిస్తానని బరిలో నుంచి తప్పించారని, కనుక మాకు కేటాయించాలని మంచికల కోటేశ్వరరావు పట్టుబట్టారు. దీంతో పోటీ పెరగడంతో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, ఇటు మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి తేల్చకపోవడంతో పాలకవర్గం ఏర్పాటు ఆగిపోయింది. మరో ఏడాది బీసీ మహిళకు రిజర్వు అయింది. పోటీ ఎక్కువగా ఉండడంతో తిరిగి బీసీ ముస్లిం మైనారిటీ మహిళకు కేటాయించారు. రేసులో వైసీపీ పట్టణ అధ్యక్షులు షేక్ నూరజహాన్ పేరు దాదాపు ఖరారు అయినట్లేనని అందరు అనుకున్నారు. కానీ ఇప్పటి వరకు పాలకవర్గం ఏర్పాటు ఏమైందో ఎవరికీ తెలియకుండా పోయింది. పాలకవర్గం ఏర్పాటు లేకపోగా.. అన్నదాతలకు మేలు జరిగేదీ లేదని రైతులు విమర్శిస్తున్నారు.

## ఇక విజయం మనదే

» టీడీపీ ఇన్‌చార్జి అశోక్‌రెడ్డి

» 250 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరిక

గిద్దలూరు టౌన్, మార్చి 13: గిద్దలూరులో టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని, ఇక విజయం మనదేనని మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. బుధవారం గిద్దలూరు మండలం పొదలకొండపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ ఆవుల వెంకటసుబ్బమ్మ, గ్రామానికి చెందిన వైసీపీ కీలక నాయకులు చేరెడ్డి జయరామిరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ ఆవుల రాజగోపాల్, వార్డుమెంబర్లు పందనబోయిన లక్ష్మీ, పిక్కిలి రంగయ్యతో సహా 250 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరికీ అశోక్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారినుద్దేశించి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌రెడ్డి నిరంకుశ పాలనతో ప్రజలు, అన్నివర్గాల వారు అష్టకష్టాలకు గురయ్యారన్నారు. పేదల సంక్షేమం కోసం టీడీపీ అనేక పథకాలు ప్రవేశపెట్టడమే కాకుండా కొత్త పథకాలకు రూపకల్పన చేసిందని, సూపర్‌సిక్స్ పథకాలతో పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న అశోక్‌రెడ్డి గెలుపునకు కృషిచేస్తామని, పొదలకొండపల్లి పంచాయతీలో పార్టీకి అత్యధిక మెజారిటీ తీసుకు వస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో చేరెడ్డి వెంకటరామిరెడ్డి, ఎంబాడి కావేరి, ముత్యాల మల్లికార్జున, కాలువ భాస్కర్, ముత్యాల పాపయ్య, దండు రంగయ్య, ముత్యాల లక్ష్మయ్య, ఆగెపోగు మాదయ్య, కొండెపోగు ప్ర సంగి, అంగసముద్రం క్రిష్ణ, కొమ్మునూరి చంటి, కాలువ దావీద్, దండు రంగస్వామి, గుర్రం జగన్, తిరుపతిరెడ్డి, షేక్‌బాషా, చేరెడ్డి బయ్యపురెడ్డి, చేరెడ్డి ప్రతాపరెడ్డి, నంద్యాల ఖాశిం, కటారు పోలయ్య కటారు బాలనరసింహులు ఉన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్ పాల్గొన్నారు.

## మిరప నాణ్యతపై రైతులకు అవగాహన

మార్కాపురం రూరల్, మార్చి 13: పట్టణంలోని ఎస్సీ బీసీ కాలనీలోని ద్వారా బజారులో మిరప పంట నాణ్యతపై రైతులకు బుధవారం ఉద్యాన శాఖ అధికారి రమేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన మిరప నాణ్యతను పరిశీలించుకునేందుకు ఒక పరికరాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆ పరికరం ద్వారా రైతు పండించిన మిరప నాణ్యతపై సర్టిఫికెట్‌ను పొంది అమ్ముకుంటే దళారుల వద్ద మోసపోకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిజిటల్ గ్రీన్ సంస్థకు చెందిన డిజిటల్ ఆపరేటర్ చంద్రశేఖర్, డిజిటల్ టెస్టింగ్ ఆపరేటర్ పావని, రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఈఈ వైఖరిపై నిరసన

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 13 : విద్యుత్ శాఖ కార్యాలయంలో వైఎస్ఆర్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో విద్యుత్ ఈఈ వైఖరికి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మాట్లాడుతూ ఈఈ నియంతృత్వ ధోరణి, పక్షపాత ధోరణి నిరసిస్తూ గతంలో మూడు రోజులు భోజన విరామ సమయంలో నిరసన తెలిపినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఈఈ యూనియన్ నాయకులను పిలిచి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి 14 రోజులు గడిచినా ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చినా ఈఈ మొండి వైఖరితో ఉన్నారన్నారు. అందుకనే బుధవారం నుంచి సామూహిక క్యాజ్‌వల్ లీవ్‌లు 127 మంది సభ్యులు పెట్టామన్నారు. అంతేగాక 2రోజుల వ్యవధిలో సమస్యలు పరిష్కరించకపోతే ఆమరణ దీక్షలు చేస్తామని డివిజన్ నాయకులు రమణారెడ్డి తెలిపారు.

## కూటమి అభ్యర్థుల విజయానికి కృషి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 13: బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పీవీ కృష్ణారావు అన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి విజయం సాధిస్తే ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీ నాయకులు చంద్రశేఖర్, సుబ్బారావు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## రైతు భరోసా కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కంభం (అర్ధవీడు), మార్చి 13 : రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఇన్స్యూరెన్స్ ద్వారా లబ్ధి పొందుతుండడం సంతోషించదగ్గ విషయమని ఎమ్మెల్యే కె.నాగార్జునరెడ్డి తెలిపారు. అర్ధవీడు మండలం రంగాపురం గ్రామం లో 23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. అలాగే రూ.25 కోట్లతో నిర్మించనున్న రంగా పురం- అర్ధవీడు రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమం లో కంభం మాజీ ఎమ్మెల్యే యూ శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ డీఈ చేరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ వెంకటరావు, జడ్పీటీసీ సభ్యుడు చెన్ను విజయ, సర్పంచ్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

**సచివాలయ భవనం ప్రారంభం**

గిద్దలూరు, మార్చి 13 : మండలంలోని ముండ్లపాడు గ్రామంలో రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే కె.నాగార్జునరెడ్డి ప్రారంభించారు. సచివాలయాల వలన ప్రజలు స్థానికంగానే ప్రభుత్వ సేవలు పొం దే అవకాశముంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నోవెల్, మాజీ ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి, వైసీపీ నాయకులు కలువా సుబ్బారావు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

కంభం, మార్చి 13 : దీర్ఘకాలిక సమస్యలను వైసీపీ ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కంభం మండల మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకుడు అన్వర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్మికులు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం ఎంఈవో మాల్యాద్రికి వినతిపత్రం అందజేశారు.

## మొల్లకు నివాళి

గిద్దలూరు, మార్చి 13 : పట్టణంలోని శాఖాగ్రంథాలయంలో తొలి తెలుగు రచయిత్రి మొల్ల జయంతిని నిర్వహించారు. మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథ పాలకురాలు ప్రసన్నకుమారి, పాఠకులు పాల్గొన్నారు.

# చంద్రబాబును ముఖ్యమంత్రిని చేద్దాం

» టీడీపీ విజయానికి అందరూ కలిసి శ్రమించండి

» మాజీ ఎమ్మెల్యే కందుల



కార్యకర్తలతో మాట్లాడుతున్న కందుల

కొనకనమిట్ల, మార్చి 13 : వచ్చే ఎన్నికలలో టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేద్దామని మాజీ ఎమ్మెల్యే పార్టీ ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెలిగండ్ల, మునగపాడు, కొనకనమిట్ల గ్రామాల్లో పర్యటించి భూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలిగొండ నీళ్ల ప్రజలకు, రైతులకు అందాలన్నా, మార్కాపురం జిల్లాగా మారాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అధోగతిపాలైన ఆంధ్రప్రదేశ్‌ను గాడిలో పెట్టే సత్తా టీడీపీకే ఉందన్నారు. ఎన్నికల్లో కార్యకర్తలు, భూత్ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండి పార్టీ విజయానికి శ్రమించాలని సూచించారు. వైసీపీ ఎత్తులు, కుట్రలను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి తిప్పికొట్టాలని కందుల అన్నారు. అనంతరం బసాపురం గ్రామానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ మాజీ సభ్యుడు సత్యమయ్య ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మోరబోయిన బాబూరావు, పొదిలి ఏఎంసీ మాజీ చైర్మన్ చప్పిడి రామలింగయ్య, మాజీ మండల అధ్యక్షుడు కనకం నరసింహారావు, తాతిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, బీసీ, ఎస్సీ సెల్ నాయకులు అంకాల రోశయ్య, శ్రీశైలం డేవిడ్, వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ దేవిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, భూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పథకాలపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

## అభివృద్ధి కోసం స్థానికుడిని గెలిపించండి

కొమరోలు, మార్చి 13 : గిద్దలూరు నియోజకవర్గంలో అభివృద్ధిని కాంక్షించే స్థానికునిడి గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని రెడ్డిచర్ల, బాదినేనిపల్లి, బాలిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం అక్కపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని గిద్దలూరు టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్థానికుడైన అశోక్‌రెడ్డిని గెలిపించుకొని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ ప్రకటించిన చంద్రబాబు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందుతారన్నారు. ఐదేళ్లుగా జగన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డిని గద్దె దింపాలని విజ్ఞప్తి చేశారు. మీరు వేసే ఓటుతోనే రాష్ట్ర భవిష్యత్ ఆధారపడి ఉందని, పిల్లల బంగారు భవిష్యత్ కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగిన దాఖలాలు లేవన్నారు. గతంలో ఎమ్మెల్యేగా అశోక్‌రెడ్డి ఉన్నప్పుడు గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని గుర్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముత్తుముల సంజీవరెడ్డి, మండల ప్రధానకార్యదర్శి బిజ్జాల తిరుమలరెడ్డి, నాయకులు అనపా వీరశేఖర్, దూదేకుల రంతూ, జనసేన పార్టీ నాయకుడు సారె ఓబులేసు, మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి,, బందం వెంకటసుబ్బయ్య, దొనపాటి పెద్ద అంకయ్య, భూమా లక్ష్మయ్య, మలికె ఈశ్వరయ్య, కాంట్రాక్టర్ క్రిష్ణమోహన్‌రెడ్డి, గోపాలక్రిష్ణయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుట్టు శిక్షణతో చెంచు మహిళలకు ఉపాధి

ఎర్రగొండపాలెం, మార్చి 13 : కుట్టుమిషన్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన చెంచు గిరిజన మహిళలు, జనరల్ ఎస్టీ మహిళలకు ఉపాధి దొరుకు తుందని ఎంపీడీవో వై నాగేశ్వరప్రసాద్ అన్నారు. ఎర్రగొండపాలెంలో బుధవారం కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీవో వై.నాగేశ్వరప్రసాద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రకాశం, పల్నాడు, కర్నూలు జిల్లాల పరిధిలోని చెంచు మహిళలు, జనరల్ ఎస్టీ మహిళలు ఇక్కడ శిక్షణకు అర్హులని అన్నారు. రెండు నెలలు శిక్షణ అనంతరం కుట్టు మిషన్లను అందజేస్తామని చెప్పారు. శిక్షణ కాలంలో ఉచితంగా భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. కుట్టు మిషన్ శిక్షణతో పాటు అసిస్టెంటు ఫ్యాషన్ డిజైనర్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అబి టెక్నాలజీస్ వారు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ట్రైనర్లు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో మస్తాన్‌వలి

## సచివాలయాల తనిఖీ

కంభం, మార్చి 13 : కంభం ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి బుధవారం మండలంలోని పలు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాల సిబ్బందికి సూచనలు చేశారు. మండలంలోని కంభం-1, రావిపాడు, తురిమెళ్ల గ్రామాల సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులకు, వలంటీర్లతో ప్ర స్తుతం జరుగుతున్న కార్యక్రమాలపై సమీక్ష చేశారు. ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేసి ఈకేవైసీ చేయించాలని తెలిపారు.

## తపాలా సేవలను చేరువ చేయాలి




మాట్లాడుతున్న ఏడీ

పొదిలి, మార్చి 13 : భారత తపాలాశాఖ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరువ చేయాలని తపాలాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఈ శివనాగరాజు కోరారు. బుధవారం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ ఇన్స్యూరెన్స్ కంపెనీ కూడా ఇవ్వలేనంత బోనస్‌ను తపాలా జీవిత బీమా పథకంలో పాలసీదారులకు అందిస్తున్నట్లు వివరించారు. తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్ నినాదంతో తపాలా జీవిత బీమా పాలసీలను తెచ్చినట్లు చెప్పారు. గ్రామీణ ప్రజల కోసం ఆర్‌పీఎల్ఐ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. మార్చి 13న మహా లాగిన్ డే సందర్భంగా మార్కాపురం డివిజన్‌లో ఒక్కరోజులో రూ.కోటి ప్రీమియం లక్ష్యాన్ని అధికమించిన సిబ్బందిని ఆయన అభి నందించారు. ఒక్క పొదిలి సబ్ డివిజన్‌లోనే రూ.52 లక్షల ప్రీమియం వసూలు చేయడంపై గ్రామీణ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మార్కాపురం ఎస్పీ కే శ్రీనివాస్, ఐపీవోలు పీ వెంకటేశ్వర్లు, బీ నాగరా జు, ఎస్కే మహమ్మద్‌అలీ, ఏ దివాకర్ కుమార్, హెడ్ పోస్ట్ మాస్టర్ కే నాగేశ్వరరావు, ఎంవోలు ఎం.శ్రీనివాసులు, కే శ్రీనివాసరావు, ఎస్‌పీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసం టీడీపీని గెలిపించండి

» ఎమ్మెల్యే అభ్యర్థి ఎరిక్షన్‌బాబు

» పాతఅన్నసముద్రంలో బాబు ష్యూరిటీ..భవిష్యత్‌కు గ్యారెంటీ



ఎరిక్షన్‌బాబుకు హారతులు ఇస్తున్న మహిళలు

త్రిపురాంతకం, మార్చి 13 : అభివృద్ధి కోసం టీడీపీని గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు ప్రజలకు విజ్ఞప్తి చేశా రు. మండలంలోని పాత అన్నసముద్రంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎరిక్షన్‌బాబు ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే అమలు చేసే పథకాలను వివరించారు. గ్యారెంటీ బాండ్లు, కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, ప్రస్తుత వైసీపీ అభివృద్ధిని ప్రజలు చూడాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా అభివృద్ధి పనులు జరగలేదన్నారు. కనీసం రోడ్లను మరమ్మతు కూడా చేయలేని దౌర్భాగ్య పాలన సాగించారన్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అవినీతి, అక్రమాలు, విధ్వంసాలు చోటుచేసుకున్నాయని ఎరిక్షన్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ఆస్తులను వైసీపీ నాయకులు కొల్లగొట్టారన్నారు. అభివృద్ధి లేక, సంతోషం కరువైన ప్రజలకు మళ్లీ టీడీపీతోనే సాధ్యమన్నారు. వచ్చే ఎ న్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు వస్తే మార్కాపురం జిల్లా అవుతుందని, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి అవుతుందని చెప్పారు. పోలవరం, రాజధాని అమరావతి నిర్మాణాలు పూర్త యి రాష్ట్రం సస్యశ్యామలమవుతుందన్నారు. పరిశ్రమల రాకతో యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఎరిక్షన్ బాబు వివరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ వైపాలెం ఇన్‌చార్జి పి.గౌతంరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.వలరాజు, మాజీ అధ్యక్షుడు మోటకట్ల శ్రీనివాసరెడ్డి, నా యకులు దేవినేని చలమయ్య, వంకాయలపాటి అంజనేయులు, మల్లెల అల్లూరిరెడ్డి, కె.ఏడుకొండలు, వి.వెంకటనారాయణ, వి.వెంకటేశ్వర్లు, పి.సుబ్బారావు, తిరుపతయ్య, టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.



జగదాంబ సమేత మార్కండేశ్వరుని రథోత్సవం

## రమణీయం.. మహాశివుని రథోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 13: మార్కాపురం పట్టణంలో వెలిసిన శ్రీ జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మహాశివునికి రథోత్సవం బుధవారం రాత్రి రమణీయంగా నిర్వహించారు. అర్చకులు జగదాంబ సమేత మార్కండేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించి రథంపై ఆశీనులను చేశారు. శంభో శంకర హరహర మహాదేవా అంటూ భక్తుల నినాదాల నడుమ రథోత్సవం సాగింది.

## వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం



గరుడ ధ్వజం ఎగురవేస్తున్న అర్చకులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 13: మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలో వెలిసిన శ్రీ ఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అర్చకులు బుధవారం గరుడ ధ్వజాన్ని ఎగురవేశారు. అనంతరం లక్ష్మీనారాయణస్వామి కల్యాణం త్రిదండి దేవనాథస్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బీవీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలెం చెంచయ్య, కోశాధికారి వై.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

## నిత్యవసర వస్తువుల అందజేత



అనాథాశ్రమానికి సరుకులు అందజేస్తున్న దాతలు

గిద్దలూరు, మార్చి 13 : పట్టణంలోని పీఆర్ కాలనీలోని సంజీవని అనాథాశ్రమానికి టి.రమేష్ అనే దాత నిత్యవసర వస్తువులను అందచేశారు. కార్యక్రమంలో మేమున్నాం సేవా సమితి అధ్యక్షుడు చల్లా అశోక్‌రెడ్డి, క్రికెట్ కోచ్ కేశవరెడ్డి, ఆశ్రమం నిర్వాహకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

## అనధికార కొళాయిల తొలగింపు

గిద్దలూరు, మార్చి 13 : పట్టణంలోని నల్లబండ బజారులో అనధికార కొళాయి కనెక్షన్లను, చాలాకాలంగా కొళాయి పన్ను కట్టని కనెక్షన్లను మున్సిపల్ అధికారులు తొలగించారు. నల్లబండ బజారులో ఇంటింటి సర్వే నిర్వహించి చాలాకాలంగా పన్ను చెల్లించని కొళాయిలను, మున్సిపాలిటీకి డిపాజిట్ చెల్లించకుండా అనధికారికంగా వేసుకున్న కొళాయిలను తొలగించారు. సచివాలయ అడ్మిన్ వెంకటయ్య మున్సిపల్ సిబ్బంది సుందర్‌రావు, ప్రసాద్, బలరామ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

గిద్దలూరు, మార్చి 13 : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వినియోగదారుల హక్కులు, విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. పాఠశాలల్లో కన్స్యూమర్ క్లబ్‌ల ఏర్పాటు, నిర్వహణపై చర్చించారు. వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు వీ వీరారెడ్డి, కార్యదర్శి టీ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. హక్కులు, విధులకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## 10లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎర్రగొండపాలెం, మార్చి 13: పది పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎంఈవో పీ ఆంజనేయులు అన్నారు. ఎర్రగొండపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన వార్షికోత్సవం సభలో ఎంఈవో మాట్లాడారు. మండలంలో ప్రథమ ర్యాంక్ సాధించి గుర్తింపు తేవాలన్నారు. శ్రద్ధతో చదువుకొని నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పిచ్చిరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యా సామగ్రి అందజేత

గిద్దలూరు, మార్చి 13 : రాచర్ల మండలం అనుమలవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పూర్వ విద్యార్థి వనితా క్లబ్ కోశాధికారి గర్రె సాహితి పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిళ్లను అందచేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ మాగులూరి శ్రీకాంత్, హెచ్‌ఎం బాలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ గుడిలో చోరీ

» హుండీలో నగదు మాయం » సీసీ కెమెరా హార్డ్ డిస్క్ ధ్వంసం

మార్కాపురం రూరల్, మార్చి 13 : మండలంలోని వేమలకోట గ్రామం పరిధిలోని మార్కాపురం - కంభం రోడ్డు పక్కన చెరువు కట్టవైపు గల పోలేరమ్మ గుడిలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. హుండీని పగులగొట్టి అందులోని నగదును అపహరించి అక్కడే పడేసి వెళ్లిపోయారు. అలాగే సీసీ కెమెరా ఫుటేజీ హార్డ్ డిస్క్‌ను కూడా ధ్వంసం చేసి అపహరించారు. హుండీలో సుమారు రూ.15వేల నగదు ఉన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఫి ర్యాదులో తెలిపినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర నాయక్ తన సిబ్బందితో కలిసి పరిశీలించారు.

## చట్ట ప్రకారమే ఏబీఎం స్థలాల కొనుగోలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 13: మార్కాపురం పట్టణంలోని ఏబీఎం ఆస్తులను చట్ట ప్రకారమే కొనుగోలు చేశానని ఎస్ఎస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వ్యాపారవేత్త నాదెళ్ల సుబ్రహ్మణ్యం బుధవారం ప్రకటనలో తెలిపారు. ఏబీఎం ఆస్తులను 1996-97 సంవత్సరంలో కావలికి చెందిన పీఏ బీసీ ద్వారా కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. ఏబీఎం ఆస్తులపై ఇటీవల జరుగుతున్న తప్పుడు ప్రచారం ఆందోళనల నేపథ్యంలో తాను స్పందించి వివరాలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఇటీవల కొందరు తన వద్దకు వచ్చి డబ్బులు అడిగారని ఇవ్వకపోవడంతో బ్లాక్ మెయిల్ చేస్తున్నారని వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎస్ఎస్ నగర్‌లో ప్రభుత్వ అనుమతి లేకుండా భవనాలు కట్టుకున్న వారికి మాత్రమే నోటీసులు ఇవ్వాలని హైకోర్టు పేర్కొన్నట్లు, అందరికీ నోటీసులు ఇవ్వనట్లు ప్రచారం చేయడంలో వాస్తవం లేదన్నారు. ప్రశాంతంగా ఉన్న ఎస్ఎస్ నగర్‌లోని ప్రజల్లో భయాందోళనలు కలిగించేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు.

# విజృంభించిన చికున్‌గున్యా

నాయుడుపాలెంలో 300 మందికి జ్వరం

పసుపుగల్లు, మారెళ్లలోనూ బాధితులు

అద్దంకి రెండు ప్రైవేట్ ఆస్పత్రుల్లో మూలుగుతున్న జ్వరపీడితులు

వైద్యం కోసం వేల రూపాయలు ఖర్చు పెడుతున్న పేదలు

ప్రతి ఇంటిలో ఇద్దరి నుంచి ఆరుగురు వరకు జ్వర పీడితులే



చికిత్స పొందుతున్న భార్యాభర్తలు వెంకటేశ్వర్లు, అంకమ్మ





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విజయలక్ష్మి, విద్యార్థి అనిల్ కుమార్‌రెడ్డి

ముండ్లమూరు, మార్చి 13 : మండలంలోని నాయుడుపాలెంలో చికున్ గున్యా వ్యాధి విజృంభించింది. వారం, పది రోజుల నుంచి జ్వరంతో గ్రామస్థులు మూలుగుతున్నారు. మరికొందరు రోగులు అద్దంకి, ఒంగోలు ప్రభుత్వ ఆస్పత్రులకు క్యూకట్టారు. ఆర్థిక స్తోమత లేని వారు ఇంటి వద్దే మంచం పట్టి ఆర్‌ఎంపీల వద్ద చికిత్స చేయించుకుంటున్నారు. కాళ్ల వాపు, ఒళ్లు నొప్పులతో అల్లాడిపోతున్నారు. ఒక్క నాయుడుపాలెంలోనే 300 మందికి పైగానే చికున్ గున్యా వ్యాధితో బాధపడుతున్నారు. గ్రామానికి చెందిన గొర్రె విజయలక్ష్మి, గొర్రె వెంకటేశ్వర్లు, అక్కమ్మ, గొర్రె శివమణి, యాదాల నాగేశ్వరరావు, అల్లూరమ్మ, వెంకటేశ్వర్లు, పోకల అల్లూరమ్మ, అమరనాథ్, కుర్రా రవి, శ్రీను, గాదెమ్మ, రజావలి, కాశమ్మ, ఎస్‌కే బాబ్జీ జాన్, అంజిబాబు, బద్రి అనీల్ కుమార్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ గొర్రె శ్రీదేవి, ఆమె భర్త రాముడుతో పాటు మరో 300 మంది వరకు మంచం పట్టారు. వీరిలో విద్యార్థులు, చిన్నారులు మొదలుకొని వృద్ధులు సైతం ఉన్నారు. ఏ ఇంట్లో చూసినా ఇద్దరి నుంచి ఆరుగురు వరకు జ్వర పీడితులే ఉన్నారు. ఇప్పటికే ఒక్కొక్కరికి రూ.10వేలు నుంచి రూ.15వేలు వరకు ఖర్చు చేశారు. చికున్‌గున్యా వ్యాధి బారినపడిన వారు కదల్లేక మంచంలోనే మూలుగుతున్నారు. వారి పనులు వారు కూడా చేసుకోలేక పోతున్నారు. తక్షణమే గ్రామంలో ప్రభుత్వ అధికారులు స్పందించి వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**పసుపుగల్లు, మారెళ్లలోనూ జ్వర పీడితులే**

పసుపుగల్లు, మారెళ్ల గ్రామాల్లోనూ చికున్ గున్యా బాధితులు ఎక్కువగా ఉన్నారు. వారం రోజులుగా రెండు గ్రామాల్లో ఈ వ్యాధి విజృంభించింది. ప్రతి ఇంట్లో బాధితులు ఉన్నారు. దర్శి, ఒంగోలు పట్టణాలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు.

## నువ్వులో యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



నువ్వును పరిశీలిస్తున్న శాస్త్రవేత్త వెంకటేశ్వరరెడ్డి, ఏడీఏ బాలాజీనాయక్

తాళ్లూరు, మార్చి 13 : వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున నువ్వు పంటలో సమగ్రయాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని దర్శి డివిజన్ వ్యసాయ సంచాలకులు కె.బాలాజీ నాయక్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వెంకటేశ్వరరెడ్డి చెప్పారు. మండలంలోని శివరాంపురంలో యాజమాన్య పద్ధతులతో చేపట్టిన నువ్వు పంటను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నువ్వుల్లో పూతకాయ, అభివృద్ధి గురించి వివరించారు. గింజ కట్టుదశల్లో తడులు ఇవ్వాలని సూచించారు. విత్తునాటిన నాటినుంచి 65-70రోజులు వరకు నీటి ఎద్దడి లేకుండా చూడాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు మాట్లాడుతూ విచక్షణారహితంగా పురుగు మందులు వాడరాదని, బెట్ట వాతావరణ పరిస్థితులు ఉన్నందున సిఫార్సు చేసిన మోతాదులోనే మందులు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నాగరాజు, వీపీఏ ఎం రాజశేఖర్‌రెడ్డి, వెంకట్రావు పాల్గొన్నారు.

## కష్టపడితే పది పరీక్షల్లో విజయం మీదే..!

జేవీవీ జాతీయ కార్యదర్శి గయాజ్



మాట్లాడుతున్న జేవీవీ జాతీయ కార్యదర్శి గయాజ్

కనిగిరి, మార్చి 13 : కష్టపడితే పది పరీక్షల్లో మంచి ఫలితాలతో విజయం సాధిస్తారని జేవీవీ జాతీయకార్యదర్శి గయాజ్ చెప్పారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థినులకు పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు చేయాల్సిన కృషి, సాధనపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పాఠ్యాంశాల పఠనం చేయాల్సిన విధానాన్ని వివరించారు. కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హసీనాబేగం, ఉపాధ్యాయినులు జీ లీలావతి, హిందీ సీఆర్‌టీ విశ్రాంతమ్మ, వీ పద్మ పాల్గొన్నారు.

## డివిజన్లో పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

పామూరు, మార్చి 13 : పదో తరగతి పరీక్షలకు మార్కాపురం డివిజన్‌లో పరిధిలోని 21 మండలాల్లో కేటాయించిన కేంద్రాలను సర్వం సిద్ధం చేసినట్లు మార్కాపురం ఉప విద్యాశాఖాధికారి ఏ చంద్రమౌళీశ్వర్ చెప్పారు. మండలంలోని వీరభద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమం అనంతరం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. డివిజన్ పరిధిలో 90 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 14,600 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పామూరులో 4 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి



ఓటువేసే విధానాన్ని వివరిస్తున్న ఏఈఆర్వో పద్మావతి

పీసీపల్లి, మార్చి 13 : ఓటు కలిగిన ప్రతిఒక్కరూ వచ్చే ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని పీసీపల్లి ఏఈఆర్వో పద్మావతి చెప్పారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లను సమావేశపరిచి ఈవీఎంలు, వీవీప్యాట్‌ల పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ అధికారులు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాన్ని ప్రారంభించిన జడ్పీ చైర్‌పర్సన్

తాళ్లూరు, మార్చి 13 : మండలంలోని తురకపాలెంలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని బుధవారం జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రారంభించారు. అనంతరం గ్రామంలో మన ఊరు-మన శివన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో శివప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, మండల వైసీపీ కన్వీనర్ టి.వి.సుబ్బారెడ్డి, వైస్‌ఎంపీపీలు ఐ.వెంకటేశ్వరరెడ్డి, ప్రియాంక నాగార్జునరెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదన్‌రెడ్డి, మోషే, రామిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కె.జయరామిరెడ్డి, మాజీ అధ్యక్షులు నాగిరెడ్డి, కుమ్మిత తిరుపతిరెడ్డి, బచ్చుసుబ్బారెడ్డి, కుమ్మిత శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో యుగకీర్తి పాల్గొన్నారు.

## ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్) మార్చి 13: ఎన్నికల కమిషన్ సూచనలను పాటించి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ పరమేశ్వరరెడ్డితో కలిసి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఆర్వోలు, డీఎస్పీలు, ఏఆర్వోలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, ఈడీటీలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఏ క్షణమైనా వచ్చే అవకాశం ఉన్నందున నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు సన్నంద్ధంగా ఉండాలన్నారు. నియోజకవర్గ పరిధిలో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. నోటిఫికేషన్ జారీ నుంచి పోలింగ్ వరకు చేపట్టాల్సిన రోజు వారి విధులపై చెక్ లిస్ట్‌తో పాటు కార్యచరణ ప్రణాళికను రూపొందించుకొని ఏర్పాట్లు పూర్తి చేయాలని చెప్పారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అధికారులు, పోలీసు అధికారుల మధ్య సమన్వయం అత్యంత కీలకమన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ, మార్కాపురం, సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, అడిషినల్ ఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్వో శ్రీలత, జడ్పీసీఈవో జాలిరెడ్డి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# సైకో పాలనకు చరమగీతం పాడుదాం



బాబు ష్యూరిటీ పత్రాలను పంపిణీ చేస్తున్న పువ్వాడి

పామూరు, మార్చి 13 : జగన్‌రెడ్డి సైకో పాలనకు రాష్ట్ర ప్రజలు త్వరలో చరమగీతం పాడాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక విరువూరు రోడ్‌లో బాబుష్యూరిటీ- భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతు సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ పత్రాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సయ్యద్ అమీర్ బాబు, ఆర్‌ఆర్ రఫి, పట్టణ గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాజా రహంతుల్లా, పట్టణ ఎన్నికల కమిటి చైర్మన్, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు షేక్ గౌస్‌బాషా, ఇర్రి కోటిరెడ్డి, ముబినా మౌలాలి, బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌లు చినహజరత్, ఫత్తు మస్తాన్, మాచర్ల రహిమాన్, రసూల్ పాల్గొన్నారు.

**టీడీపీ చేరిక కార్యక్రమాలను విజయవంతం చేయాలి**

పామూరు, మార్చి 13 : వైసీపీ నాయకుల తీరు, పాలనతో విసుగుచెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఆ పార్టీని వీడి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో పార్టీలో చేరే కార్యక్రమాలను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు చెప్పారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో బుధవారం ముఖ్య నాయకులతో జరిగిన సమావేశానికి పాలపర్తి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. వైసీపీకి చెందిన పామూరు 2 ఎంపీటీసీ సభ్యులు ఆకుపాటి వెంకటేష్ గురువారం టీడీపీలో చేరనున్న సందర్భంగా నిర్వహించనున్న బైక్ ర్యాలీని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సంయుక్తంగా విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టీడీపీ నేతలు గంగరాజుయాదవ్, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, కే సుభాషిణి, సయ్యద్ అమీర్‌బాబు, వై ప్రసాద్‌రెడ్డి, ఆర్‌ఆర్ రఫి, హుసేన్‌రావు, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, షేక్ ఖాజారహంతుల్లా పాల్గొన్నారు.

**టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి**

పీసీపల్లి, మార్చి 13 : అన్ని రంగాల్లో గ్రామాలు అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంటేనే సాధ్యమని టీడీపీ నాయకులు చెప్పారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు పీసీపల్లిలో బుధవారం రాత్రి టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేరేడుపల్లి సర్పంచ్ కనపర్తి శ్యాంసన్, నేతలు ములకా నాగేశ్వరరావు, ఏనుగంటి వెంకయ్య, వీరపనేని పెద్దన్న, గుంటగాని జోసెఫ్, వీరాస్వామి, నారపురెడ్డి మాలకొండయ్య, వేమూరి చినమాలకొండయ్య, ఉండేల పిచ్చిరెడ్డి, శ్రీను, మూలె వెంకటేశ్వరరెడ్డి, గుర్రం మాల్యాద్రి, ముప్పవరపు మాచర్లు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన జీవితం విద్యతో సాధ్యం



సర్పంచ్ జయమ్మను సన్మానిస్తున్న డిప్యూటీ డీఈవో చంద్రమౌళి

పామూరు, మార్చి 13 : విలువలతో కూడిన జీవనం విద్యతోనే సాధ్యం అవుతుందని మార్కాపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎ చంద్రమౌళీశ్వర్ చెప్పారు. మండలంలోని వీరభద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం హెచ్‌ఎం కోటిరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ ఏటా మాదిరి ఈ ఏడాది కూడా పది పరీక్షల్లో ప్రథమ ర్యాంకుతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థికి గ్రామానికి చెందిన ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు ఏలూరి వెంకటేశ్వర్లు రూ.5 వేల నగదు బహుమతి అందిస్తారన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ పువ్వాడి జయమ్మ, టీడీడీ మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఈవో చంద్రమౌళిని ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కోటిరెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం గోవిందయ్య, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు పూనాటి వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, ఉపాధ్యాయులు వై రామచంద్రారెడ్డి, బాష, ఎం సుబ్బరాజు, అనంతనాగలక్ష్మీ, పద్మ కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే పీడీసీసీ బ్యాంక్ లక్ష్యం

తక్కువ శాతానికే రైతులకు రుణాలు

చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి



బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న చైర్మన్ ప్రసాదరెడ్డి

ముండ్లమూరు, మార్చి 13 : సహకార సమాఖ్యతో రైతుల ఇంటింటికీ సహకారం అందిస్తున్నట్లు పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి చెప్పారు. బుధవారం ముండ్లమూరులో నూతనంగా ఏర్పాటు చేసిన పీడీసీసీ బ్యాంక్ శాఖను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది కొత్తగా మూడు శాఖలను ప్రారంభించామన్నారు. రైతులకు తక్కువ శాతానికే వ్యవసాయ రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. రైతు కుటుంబంలో చదువుకుంటున్న విద్యార్థులకు విదేశీ విద్య కోసం రూ.40 లక్షలు వరకు ఎటువంటి ష్యూరిటీ లేకుండా రుణసౌకర్యం అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో కోటిరెడ్డి, నాబార్డు డీజీఎం రమణ, మేనేజర్ శివపార్వతి, సొసైటీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరెడ్డి, మానం వెంకటరావు, కుమ్మెత వెంకటరెడ్డి, గాదె నాసరరెడ్డి, తన్నీరు శ్రీనివాసులు, చింతల కృష్ణారెడ్డి, దర్శి సొసైటీ అధ్యక్షులు చెన్నారెడ్డి, వెంకటేశ్వర్లు, సీఈవోలు ఎస్ వెంకటేశ్వర్లు, కే ఈశ్వర్, ఆర్ శంకర్, టీ రామాంజనేయులు, నరసయ్య, రిటైర్డు మేనేజర్ బోడపాటి చంద్రమౌళి, నారాయణరావు, వీరపనేని రాంబాబు, జిల్లెలమూడి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి నైపుణ్య పరీక్ష మళ్లీ ప్రారంభం

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన



పేర్లు నమోదు చేసుకొంటున్న అధికారులు

పామూరు, మార్చి 13 : మండలంలోని మోపాడు రిజర్వాయర్ నుచ్చుపొద జాలర్ల సహకార సంఘంలో నూతనంగా సభ్యత్వం నమోదు కోసం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరం బుధవారం తిరిగి ప్రారంభమైంది. మత్స్యశాఖ ఆధ్వర్యంలో రిజర్వాయర్ వద్ద జరుగుతున్న వృత్తి నైపుణ్య పరీక్షలు కొన్ని రాజకీయ కారణాల వలన మంగళవారం అధికారులు పాల్గొనకుండా దుమ్ము కొట్టారని ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన వార్తకు మత్స్యశాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. అధికారుల ఆదేశాల మేరకు బుధవారం తిరిగి ప్రారంభించడంతో మత్స్యకారులు తమ పేర్లను నమోదు చేసుకొన్నారు. బుధవారం నిర్వహించిన స్కిల్ టెస్ట్ కార్యక్రమంలో 233 మంది దరఖాస్తు చేసుకోగా, 137 మందికి స్కిల్‌టెస్ట్ కార్యక్రమం నిర్వహించినట్లు ఏడీ, కమిటీ కన్వీనర్ ఉషాకిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి మత్స్యశాఖ ఏడీ, అబ్దుర్ ఎస్ శ్రీనివాసస్, డివిజనల్ కోఆపరేటివ్ అధికారి కరుణాకర్, ఇన్‌స్పెక్టర్ రాము, ఫీల్డ్‌మెన్ శ్రీనివాస్, పొట్టయ్య, జిల్లా విజిలెన్స్ ఎస్టీ, ఎస్సీ పొట్లూరి లక్ష్మయ్య, బెస్త సంక్షేమసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓగూరి ఏడుకొండలు, నరసింహారావు, చింతకుంట రమేష్, సంఘం సభ్యులు చేవూరు కొండయ్య, నవరం రాజేష్, లక్కనబోయిన ప్రసాద్ పాల్గొన్నారు.

## కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

కనిగిరి, మార్చి 13 : కస్తూర్బాగాంధీ పాఠశాలలో 6 నుంచి 11వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హసీనాబేగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కస్తూర్బా స్కూలులో 6వ తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. 7, 8 తరగతులలో మిగిలిన సీట్లను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 12 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తులు పంపవచ్చని పేర్కొన్నారు. ఇంటర్ ఎంపీసీ గ్రూపులో మొదటి సంవత్సరం 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. వివరాలకు 76618 33448 నంబర్‌ను సంప్రదించాలాని పేర్కొన్నారు. లేకుంటే స్కూలులో నేరుగా కలసి తెలుసుకోవాలని సూచించారు.





# వలంటీర్లకు వాయినాలోయ్..!

రూ. 5వేలు నగదు, డిన్నర్ సెట్, కూలింగ్‌బాటిల్ పంపిణీ

'కనిగిరి'లో పూర్తిస్థాయిలో పంచలేదంటూ గగ్గోలు



డిన్నర్‌సెట్, వాటర్‌బాటిల్‌ను తీసుకుని బండిపై వెళ్తున్న వలంటీర్



డిన్నర్ సెట్ సంచి

కనిగిరి, మార్చి 13 : ఇస్తినమ్మ వాయినం.. పుచ్చుకుంటినమ్మా వాయినం అనే నానుడి చందంగా ఉంది వైసీపీ నేతలు, వలంటీర్ల తీరు. ఎన్నికలు సమీపిస్తుండటంతో వైసీపీ అధిష్ఠానం రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లను ప్రచారకర్తలుగా, ఓట్లకు ఎర వేసే నోట్ల పంపిణీ ఏజెంట్లుగా మార్చుకునేందుకు సరికొత్త వ్యూహానికి తెర లేపింది. అందులో భాగంగా వలంటీర్లకు నగదు, ఆకర్షణీయమైన బహుమతులు పంచుతున్నారు. దీంతో బుధవారం కనిగిరిలోని ఆరు మండలాల్లో వలంటీర్లకు రూ.5వేలు నగదు, డిన్నర్‌సెట్, కూలింగ్ వాటర్ బాటిల్‌లను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో మాత్రం పూర్తిస్థాయిలో వలంటీర్లకు అందలేదంటూ గగ్గోలు మొదలైంది. జిల్లా వైసీపీ పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కనుసన్నల్లోనే నడిపిస్తున్నారని సమాచారం. మరోపక్క కనిగిరి పార్టీ 'ఆ నలుగురు' చెప్పుచేతల్లోనే నడుస్తోందని మిగిలిన నేతలు రగిలిపోతున్నారు. ఆ క్రమంలోనే వలంటీర్లకు తాయిలాలు మొక్కుబడిగా పంపిణీ చేసినట్లు సమాచారం.



సభా ప్రాంగణం మ్యాప్‌ను పరిశీలిస్తున్న లోకేశ్, అచ్చెన్నాయుడు పుల్లారావు తదితరులు.




- అధికారపార్టీ ప్రచార పిచ్చికి ఉద్యోగులు బలి
- స్వామి కార్యంతోపాటు స్వకార్యానికీ తప్పని ఈకేవైసీ
- ప్రతి పథకానికి ఈ కేవైసీ కావాలంటూ ఆదేశాలు
- 'ఇంటింటికీ సంక్షేమం' పేరుతో లబ్ధిదారులకు లేఖలు
- దానికీ ఈ కేవైసీ తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- ఛీ.. పొమ్మంటున్న లబ్ధిదారులు
- పలుచోట్ల వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులపై దాడులు

# అడ్డగోలు వాడకం!




గుంటూరు, మార్చి13(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోని ఒక వలంటీర్ ఆన్‌లైన్ ఆధార్ ఈ కేవైసీ కోసం ఒకరి ఫోనుకు ఓటీపీ పంపింది. ఆ ఓటీపీ చెప్పాలని ఆ నెంబరుకు కాల్ చేసింది. కాల్ లిఫ్ట్ చేసిన ఆ ఇంటి మహిళ తన భర్తకు పదేపదే ఎందుకు ఫోన్ చేస్తున్నావంటూ వలంటీర్‌తో గొడవకు దిగింది. వివాహేతర సంబంధం వుందంటూ ఆరోపణలు చేసింది. దీనిపై పంచాయతీ కార్యదర్శికి వలంటీర్ ఫిర్యాదు చేసింది. అతడు పట్టించుకోకపోవడంతో ఆ వలంటీర్ పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమయింది. ఇలాంటి ఘటనలు జిల్లాలో అనేకం జరుగుతున్నాయి. ఈ కేవైసీల కోసం పదేపదే ఫోన్లు చేయడం, వేలిముద్రల కోసం పదేపదే ఇళ్లకు వెళ్లడం వంటి కారణాలతో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లాలో నిత్యం ఏదో ఒక మూల ఇలాంటి ఘటనలు జరుగుతూనే వున్నాయి.

### అవమానాల పాలవుతున్న ఉద్యోగులు, వలంటీర్లు

అధికార వైసీపీ ప్రచార పిచ్చి సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు లేనిపోని తిప్పలు తెస్తోంది. ఉద్యోగం, ఉపాధి మాట ఎలా వున్నా సమాజం లో వారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారుతోంది. ప్రభుత్వ అడ్డగోలు వాడకం కారణంగా వారికి అవ మానాలే మిగులు తున్నాయి. సమాజంలో అనేక చీత్కారాలకు గురవుతున్నారు. వారి వ్యక్తిగత జీవితంపైనే ముద్ర వేయించుకునే పరిస్థితి వస్తోంది. సంక్షేమ పథకాలతోపాటు సొంత ప్రచారానికి కూడా వారిని వాడేస్తుండడంతో ప్రజల్లో వలంటీర్లు, సచివాల య ఉద్యోగులంటే చీత్కార భావం కలు గుతోంది.

### స్వకార్యానికి కూడా ఈ- కేవైసీ

సంక్షేమ పథకాల పేరుతో పదుల సంఖ్యలో ఈ- కేవైసీ చేయిస్తున్న ప్రభుత్వం అవి చాలవన్నట్లు సొంత ప్రచారానికి కూడా ఈ కేవైసీ చేయించాలని డిమాండ్ చేస్తోంది. 'ఇంటింటికీ సంక్షేమం' పేరుతో ముఖ్యమంత్రి పేరుతో వచ్చిన లేఖను లబ్ధిదారుల ఇంటికి చేర్చి వారితో ఈ కేవైసీ చేయించాలని ఆదేశాలు జారీచేసింది. దీనిపై లబ్ధిదారుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. లబ్ధిదారులు పొందిన సంక్షేమ ఫలాలతో ఎలాంటి సంబంధం లేని తప్పుడు లెక్కలతో ఈ లేఖలు ఉండడంతో లబ్ధిదారులు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ఛీ.. పొమ్మంటున్నారు. దీంతో వారు తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో అధికారులతోపాటు, అధికార వైసీపీ నేతలు కూడా వలంటీర్లు, ఉద్యోగులపై ఒత్తిడి పెంచుతున్నారు. ఈ ఒత్తిడి భరించలేని ఉద్యోగులు లబ్ధిదారులను అదేస్థాయిలో ఒత్తిడి పెడుతున్నారు. దీంతో లబ్ధిదారులు వారికి ఎదురు తిరిగుతున్నారు. పలుచోట్ల దాడులకు కూడా దిగుతున్నారని వలంటీర్లు వాపోతున్నారు. ఇదిలా వుండగా, రేపు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత తమ పరిస్థితి ఏమిటా.. అని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు.

### ప్రతి పథకానికి ఈ- కేవైసీ

ప్రభుత్వం తాను అమలు చేస్తున్నానన్న ప్రతి పథకానికి ఈ కేవైసీని తప్పనిసరి చేసింది. ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసినందుకు, ఆరోగ్యశ్రీ కార్డు పంపిణీ చేసినందుకు, ఇళ్ల పట్టాలు పంపిణీకి, పాలవెల్లువ సర్వేకు, క్యాస్ట్ సర్వేకు.. ఇలా ప్రతిదానికీ ఈ కేవైసీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇది క్షేత్రస్థాయిలో పనిచేసే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు అనేక సమస్యలు తెచ్చిపెడుతోంది. ఈ కేవైసీ వేలిముద్రల కోసం వలంటీర్లు ఇళ్లకు వెళుతుండడంపై గృహిణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఓటీపీ ద్వారా ఆన్‌లైన్ ఈ కేవైసీ కోసం వలంటీర్లు సంబంధిత మొబైల్ నెంబర్లకు ఓటీపీలు పంపుతున్నారు. అవి తెలుసుకోవడానికి పదే పదే ఫోన్లు చేస్తున్నారు. దీంతో లబ్ధిదారుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. పదే పదే ఇళ్లకు వెళ్లడం, ఫోన్లు చేయడంపై వారిలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారేమీ పట్టించుకోవడం లేదు. మాకు అవన్నీ అనవసరం ఈ కేవైసీ కావాల్సిందేనని పట్టు పడుతున్నారు. దీంతో వారు ఇరువైపులా నలిగిపోతున్నారు.

## ఇవ్వని పథకాలు ఇచ్చినట్లుగా..

### వలంటీర్లపై మండిపడుతున్న ప్రజలు




గడప గడపకు సంక్షేమం పేరుతో స్థలం ఇవ్వకుండానే ఇచ్చినట్లు ఇచ్చిన తప్పుడు పత్రం

ప్రత్తిపాడు: మా ఐదేళ్ల పాలనలో మీ కుటుంబానికి వచ్చిన లబ్ధి ఇది అంటూ ఇస్తున్న పత్రాలను చూసి ప్రజలు విస్తుపోతున్నారు. రెండు రోజులుగా వలంటీర్లు ఇంటింటికి వచ్చి లబ్ధి వివరాలతో కూడిన పత్రాలను కుటుంబ యజమానులకు అందజేసి వారి నుంచి వేలిముద్రలు సేకరిస్తున్నారు. అయితే ఆయా పత్రాలు చూసుకున్న చాలామంది తమకు ఆ పథకాల లబ్ధి అందలేదని వలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల స్థలాలు ఇవ్వకుండానే స్థలాలు ఇచ్చినట్లు, అమ్మఒడి ఒక్కసారి పడితే రెండు సార్లు అందుకున్నట్లు, రైతు భరోసా పడకుండానే పడినట్లు, సున్నా వడ్డీలో తప్పులు, వైద్యశాలకు వెళ్లకుండానే ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకున్నట్లు.. ఇలా పలు తప్పుడు లెక్కలు, లబ్ధిలో హెచ్చులు కనిపిస్తుండటంతో లబ్ధిదారులు విస్తుపోతున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో వలంటీర్లు పంపిణీ చేసిన గడప గడపకు సంక్షేమం పత్రాలలో ఇలాంటి తప్పులు కో కొల్లలుగా వెలుగుచూస్తున్నాయి. ఈ తప్పుల విషయంలో అధికారులు నోరు మెదపడంలేదు. ప్రత్తిపాడులో చెర్లోపల్లి బుల్లెమ్మాయికి రూ.2 లక్షల విలువైన ఇంటి స్థలం వచ్చినట్లుగా పత్రం అందజేశారు. అయితే ఆమెకు స్థలం ఇవ్వలేదని రెవెన్యూ అధికారులు కూడా ధృవీకరిస్తున్నారు. దీంతో ఆమె కుటుంబసభ్యులు తమకు స్థలం ఇవ్వకపోయినా ఇచ్చినట్లుగా పత్రంలో నమోదు చేయడం ఏమిటని మండిపడుతున్నారు. పెదనందిపాడుకు చెందిన ఎం శ్రీనివాసరావు అనే వ్యక్తికి ఆరోగ్య శ్రీ ద్వారా రూ.60 వేలు లబ్ధి పొందినట్లు పత్రం ఇచ్చారు. అయితే తాము ఇంతవరకు వైద్యశాలకు వెళ్లలేదని, ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స చేయించుకోలేదని, అలాంటప్పుడు రూ.60 వేలు ఎటు వెళ్లాయని వారు ప్రశ్నిస్తున్నారు. అలాగే మరో బాలికకు ఒక్క సారి మాత్రమే అమ్మఒడి అందగా వలంటీర్లు ఇచ్చిన పత్రంలో రెండు సార్లు అందుకున్నట్లు ఉండటంతో వారు విస్తుపోతున్నారు. లబ్ధి అందుకోకపోయినా తప్పుడు పత్రాలతో వేలిముద్రలు వేయించుకోవడం ఏమిటని పలువురు వలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# సమరానికి సై

- బొప్పూడి వద్ద భారీ బహిరంగ సభకు భారీగా ఏర్పాట్లు
- సభా ప్రాంగణం నిర్మాణానికి భూమి పూజ చేసిన కూటమి నేతలు
- ఏర్పాట్లు పరిశీలించిన నారా లోకేశ్ కూటమి నేతలు

చిలకలూరిపేట, మార్చి13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్ సర్కార్ అరాచక పాలనపై సమరం ప్రకటించి, చేతులు కలిపిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ తొలి ఉమ్మడి బహిరంగ సభ చిలకలూరిపేట మండలం బొప్పూడి వద్ద భారీగా ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. సభా ప్రాంగణం నిర్మాణానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బీజేపీ, జనసేన నేతలతో కలసి బుధవారం ఉదయం 9.32 గంటలకు భూమిపూజ చేశారు. జాతీయ రహదారి పక్కనే బొప్పుడి వద్ద 17న భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, తెలుగుదేశం అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ హాజరు కానున్నారు. సభకు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న 200 ఎకరాల్లో ఏర్పాట్లు చేపట్టారు. ఈ ప్రాంతంలో రైతులు తమ భూములను స్వచ్ఛందంగా ఇచ్చారు. ఈ భూముల్లో ఉన్న పొగాకు తదితర పంటలకు సంబంధించి తెలుగుదేశం పార్టీ రైతులకు నష్టపరిహారం చెల్లిస్తుంది. రాష్ట్రంలోనే ఉమ్మడి తొలి సభ కావడంతో రాష్ట్ర నలుమూల నుంచి లక్షలాది మంది సభకు హాజరయ్యేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకు సంబంధించిన బాధ్యతలను ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లను అప్పగించారు. మరో మూడు రోజుల వ్యవధి మాత్రమే ఉండడంతో ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తీసుకున్న మూడు పార్టీలు సుమారు 15 లక్షల మంది జనసమీకరణకు ప్రణాళికలు రచించారు. ఈ బహిరంగ సభ వేదికగా దేశానికి ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఒక సందేశం ఇవ్వబోతున్నారని కూటమి నేతలు పేర్కొన్నారు. దుర్మార్గపు ప్రభుత్వాన్ని సాగనంపడానికి, ప్రజలను కష్టాల నుంచి బయటపడటానికి, రైతులు సంతోషం, ఆడబిడ్డలు క్షేమం, యువతకు భవిష్యత్తు ఇవ్వడానికి ఈ బహిరంగ సభ దిక్సూచిలా ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనందబాబు, జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, బీజేపీ నేతలు పాతూరి నాగభూషణం, డేగల ప్రభాకర్, కనపర్తి శ్రీనివాసరావు, యడ్లపాటి రఘునాథ్ బాబు, వల్లూరి జయప్రకాష్, లంకా దినకర్, శ్రీమన్నారాయణ, జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ విభాగం కన్వీనర్ కళ్యాణం శివ శ్రీనివాస్, ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ, గాదె వెంకటేశ్వరరావు, షేక్ రియాజ్, టీడీపీ ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, మంతెన రామరాజు, పార్టీ సీనియర్ నేతలు జీవీ ఆంజనేయులు, పెందుర్తి వెంకటేష్, సత్య నారాయణరాజు, మూడు పార్టీల ముఖ్య నేతలు పాల్గొన్నారు.

### నవ శకానికి దిక్సూచిలా సభ: మాజీ మంత్రి ప్రత్తిపాటి

బొప్పూడి వద్ద జరగబోయే సభతో చరిత్ర సృష్టిస్తామని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ సభ వైపు దేశమంతా ఆసక్తిగా ఎదురు చూస్తోందన్నారు. ఎన్డీఏలో చేరిన తర్వాత తెలుగుదేశం- జనసేన- బీజేపీ ఆధ్వర్యంలో జరగబోతున్న తొలి ఉమ్మడి మేనిఫెస్టో సభ నభూతో నభవిష్యత్ అన్నట్టుగా ఉంటుందన్నారు. ఐదు కోట్ల ప్రజల ఆకాంక్షల మేరకే తెలుగుదేశం తిరిగి ఎన్డీఏలో భాగస్వామ్యమైందన్నారు. మూడు పార్టీలు కూటమిగా పోటీచేయడం రాష్ట్రాభివృద్ధికి కొత్తబాటలు వేస్తాయన్నారు. కేంద్ర సహకారం లేనిదే రాష్ట్రాభివృద్ధి సాధ్యం కాదని, రాష్ట్ర పునర్నిర్మాణం చేయాలంటే తెలుగుదేశం- జనసేన- బీజేపీ పార్టీలు కలవాల్సిన అవసరాన్ని ప్రజలు గుర్తించారని పుల్లారావు తెలిపారు. బీజేపీ సీనియర్ నేత పాతూరి నాగభూషణం మాట్లాడుతూ ఎటువంటి అభివృద్ధి చేయకుండా లక్షల కోట్ల అప్పులు చేసిన జగన్ ప్రభుత్వాన్ని గద్దెదింపడమే లక్ష్యంగా కూటమి పనిచేస్తుందన్నారు. జనసేన రాష్ట్రకార్యదర్శి కూడపాటి శివధర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ రియల్ ఎస్టేట్ బ్రోకర్ అవతారమెత్తి యధేచ్ఛగా దోపిడీగా పాల్పడుతున్నారు.



సభా వేదిక ఏర్పాటుకు సిద్ధం చేస్తున్న గడ్డర్లు



సభా ప్రాంగణంలో హెలిప్యాడ్ నిర్మాణం



తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు అప్రమత్తమయ్యాయి.

### ఏర్పాట్లపై లోకేశ్ సమీక్ష

రాష్ట్ర చరిత్రలో ఈ సభ నిలిచిపోయేలా నిర్వహిస్తామని కూటమి నేతలు తెలిపారు. మూడు పార్టీల ముఖ్యనేతలతో ఏర్పాట్లపై లోకేష్ చర్చించారు. సభా ప్రాంగణానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. సభా వేదిక, గ్యాలరీలు, హెలిప్యాడ్‌లు తదితర ఏర్పాట్లపై లోకేశ్ నేతలతో చర్చించారు. లక్షలాదిగా ప్రజలు రానున్న సందర్భంగా వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచన చేశారు. సభా ప్రాంగణం వద్ద ప్రారంభమైన పనుల ను వేగంగా పూర్తిచేయాలని సూచించారు. బీజేపీ పొత్తు కుదిరిన తర్వాత నిర్వహిస్తున్న మొదటి సభను ప్రతిష్టాత్మకంగా

# 18న ఎయిర్‌క్రాఫ్ట్ ల్యాండింగ్ ట్రయల్ రన్

### ముందస్తు చర్యలపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

బాపట్ల, మార్చి 13: జిల్లా పరిధిలోని కొరిశపాడు మండలం పిచికల గుడిపాడు వద్ద జాతీయ రహదారిపై ఎయిర్‌క్రాఫ్ట్ ల్యాండింగ్ ట్రయల్ రన్ ఈ నెల 18న నిర్వహించేందుకు అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఎయిర్‌క్రాఫ్ట్ ల్యాండింగ్ ట్రయల్‌రన్ విషయమై బాపట్ల ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ కమాండర్ జేపీయాదవ్, ఎస్పీ వకుల్‌జిందాల్, జేసీ శ్రీధర్, నేషనల్ హైవే అథారటీ అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎయిర్‌క్రాఫ్ట్ ల్యాండింగ్ ట్రయల్ రన్ విషయంలో భాగస్వామ్యమయ్యే శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. మొబైల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. బాపట్ల ఎయిర్‌ఫోర్స్ అధికారులు కోరినట్లుగా 400 మంది సౌకర్యంగా కుర్చునేవిధంగా వీఐపీ గ్యాలరీ ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపకశాఖ, విద్యుత్, వైద్య, ఆరోగ్యశాఖలు తమకు కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎయిర్‌ఫోర్స్ అధికారి విజయ్‌మీనాన్, నేషనల్ హైవే అథారటీ పీడీ విద్యాసాగర్, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, జేసీ శ్రీధర్

# ఇసుక.. దోపిడీ

- తవ్వకాలు ఇక్కడా.. అనుమతులు ఎక్కడో..
- భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు
- గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన నిషేధాజ్ఞలు భేఖాతర్
- ముడుపుల మత్తులో మైనింగ్, సెబ్, పోలీసు, రెవెన్యూ శాఖలు

కొల్లూరు, మార్చి 13: ఇసుక తవ్వకాలకు అనుమతులు ఎక్కడో ఇస్తే గుత్తేదారు మాత్రం అనుమతులు లేని నిషేధిత పట్టా భూముల్లో యధేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. అధికారపార్టీ నేతలతో పాటు భారీగా ముడుపులు అందడంతో యంత్రాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకునేందుకు అధికారులు ముందుకు రావడం లేదు. బాపట్ల జిల్లా, కొల్లూరు మండలం, గాజుల్లంక వద్ద కృష్ణానది సర్వే నెం.180లో 4.950 హెక్టార్ల విస్తీర్ణంలో ఇసుక తవ్వకాలు చేసుకునేందుకు అనుమతులు ఇచ్చినట్లుగా మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్ గ్రీన్ ట్రిబ్యునల్ నివేదికలు అందించారు. గత నెల 7వ తేదీ నుంచి ఇసుక తవ్వకాలకు భారీ యంత్రాలను సంవత్సరం పాటు నిషేధిస్తూ కూలీలతో మాత్రమే తవ్వకాలు చేయాలంటూ కలెక్టర్‌కు చెన్నైలోని గ్రీన్ ట్రిబ్యునల్ సౌత్ జోన్ బెంచ్ ఆదేశాలు ఇచ్చింది. అయినా కొల్లూరు మండలంలో మైనింగ్ అధికారులు సూచించిన దాఖలాలు లేవు. పైగా అనుమతులు గాజుల్లంక పరిధిలో ఉంటే ఇసుక తవ్వకాలు మాత్రం పెదల్లంక పరిధిలోని పట్టా భూముల్లో వేసిన ఇసుక మేటలను భారీ యంత్రాలతో తొలగిస్తూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. పెదల్లంక వద్ద కృష్ణానదిలో ఇసుక మేటలు తవ్వుకునేందుకు తమ గ్రామానికి సంబంధించిన ఆలయ పూజాది కైంకర్యాలకు వారానికి రూ.లక్షన్నర ముట్ట చెబుతూ నిబంధనలకు విరుద్ధంగా దాదాపు పది అడుగులకు పైగా ఇసుకను తవ్వేసుకుంటున్నారు.



భారీ వాహనాలకు ఇసుక లోడ్ చేస్తున్న యంత్రాలు

### కన్నెత్తి చూడని యంత్రాంగం

ఇంత భారీ స్థాయిలో ఇసుక దందా జరుగుతున్న అధికార యంత్రాంగం కన్నెత్తి కూడా చూడటం లేదు. పైగా అసలు ప్రభుత్వం జీసీకేసీ సంస్థకు నదిలో ఎక్కడ ఇసుక ఉంటే అక్కడ తవ్వుకునే విధంగా అనుమతులు ఇచ్చిందని, ఫలనా చోటే తవ్వకాలు చేసుకోవాలనే నిబంధన ఎక్కడా పత్రాల్లో ఇవ్వలేదంటూ మైనింగ్ ఏడీ స్వయంగా చెబుతున్నారు. కానీ, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు మాత్రం గాజుల్లంక పరిధిలోని కృష్ణానదిలో సర్వే నెం.180లో తవ్వకాలు చేసుకునేందుకు అనుమతులు ఇచ్చినట్లుగా ఆయనే నివేదికలో పేర్కొన్నట్లు గ్రీన్ ట్రిబ్యునల్ విడుదల చేసిన ఆదేశాల్లో తేటతెల్లమైనా అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవడం లేదు. ఇందుకు ఆయనకు భారీగా ముడుపులు అందుతున్నాయని, ఆయనతో పాటు సెబ్, పోలీస్, రెవెన్యూ శాఖలకు కూడా ముడుపులు చేరుతుండటంతో అక్రమ ఇసుక తవ్వకాల గురించి తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరైనా అక్రమ ఇసుక తవ్వకాలపై ఫిర్యాదులు చేస్తే వారిని మైనింగ్ ఏడీ, సెబ్ అధికారులు మభ్యపెట్టి ఫిర్యాదుపై చర్యలు తీసుకున్నట్లుగా మసిపూసి మారేడుకాయ చేస్తున్నారు. ఫిర్యాదుపై అక్రమ ఇసుక తవ్వకాల వద్దకు వచ్చి హడావుడి చేయడం, యంత్రాలను స్వాధీనం చేసుకున్నట్లుగా చెబుతూ ఫిర్యాదుదారులను తప్పుదారి పట్టిస్తున్నారు. వారు అక్కడ నుంచి వెళ్లిన తరువాత వారు తీసుకున్న చర్యలపై ఆరా తీస్తే యంత్రాల స్వాధీనాలు లేవని, ఒకటి రెండు ట్రాక్టర్లను అప్పగించి వాటిని కూడా సేఫ్ కస్టడీలో మాత్రమే ఉంచాలని నివేదిక ఇచ్చి వెళుతున్నట్లుగా పోలీసులు చెబుతున్నారు. కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో ఇచ్చిన ఫిర్యాదులు సైతం మైనింగ్, సెబ్ అధికారులు మమ అనిపిస్తూ తిరిగి నివేదికలు ఇస్తున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నట్లు పలువురు వాపోతున్నారు.

### అడుగంటిన భూగర్భ జలాలు

ఇసుక అక్రమ తవ్వకాలతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. వేసవి ప్రవేశించక ముందే లంక గ్రామాల్లో భూగర్భ జలాలు ఇంకిపోయాయి. ఇందుకు ప్రధాన కారణం నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలేనని రైతులు ఆరోపిస్తున్నారు. పంట పొలాలతో పాటు గృహాల్లో ఉన్న బోర్లు సైతం నీరు రాక మొరాయిస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

### అరవింద వారధికి పొంచి వున్న ముప్పు..

పది లంక గ్రామాలకు ప్రధాన మార్గంగా ఉన్న అరవింద వారధికి సైతం ముప్పు పొంచి ఉంది. పెదల్లంక గ్రామ పరిధిలో కృష్ణా నదిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలు వారధికి అత్యంత సమీపంలో జరుగుతుండటంతో ఎగువ లంక గ్రామాల ప్రజలు వారధికి ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక తవ్వకాల కారణంగా అరవింద వారధితో పాటు కొన్ని లంక గ్రామాలు వరదల సమయంలో పొలాలు కోతకు గురై వరద నీరు గ్రామాలపై వచ్చి అవకాశాలు ఉన్నాయని, రైతులు, లంక గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇక్కడ జరుగుతున్న ఇసుక తవ్వకాలు జిల్లా కలెక్టర్ స్వయంగా వచ్చి పరిశీలిస్తే అసలు విషయం బయట పడుతుందని చెబుతున్నారు.

- నీరు బయట పడే వరకు జరిగిన ఇసుక తవ్వకాలు



### రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.23(గురువారం)

సహేరీ (ఉదయం) 5.00 (శుక్రవారం)

## ఎమర్జెన్సీ రన్‌వే ప్రారంభానికి సన్నాహాలు

పలుమార్లు విమానం చెక్కర్లు



మేదరమెట్ల పరిసర ప్రాంతాల్లో చక్కెర్లు కొడుతున్న రన్‌వే విమానం

మేదరమెట్ల , మార్చి 13: జాతీయ రహదారిలో బాపట్ల జిల్లా కొరిశపాడు- రేణంగివరం మధ్య నిర్మించిన ఎమర్జెన్సీ రన్‌వేను ప్రారంభించడానికి ఎయిర్‌ఫోర్స్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగానే మంగళ, బుధవారాల్లో రవాణా విమానం రన్‌వే చుట్టూ పలుమార్లు చెక్కర్లు కొట్టింది. ఈనెల 18, 19 తేదీల్లో రన్‌వేపై విమానాలు దించి ప్రారంభోత్సవం చేయనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలిసి ఎయిర్‌పోర్స్ అధికారులు చేపట్టారు. 18వతేదీ వరకు విమానాలతో పరిసరాలను పరిశీలిస్తారని తెలిసింది. రన్‌వేకి రెండు వైపులా అప్రోచ్ రోడ్డులను పటిష్టం చేయడంతోపాటు భారీ గేట్‌ల నిర్మాణం చేపట్టబోతున్నారు.

## ధనచక్రవర్తిని పరామర్శించిన గొట్టిపాటి



వైసీపీ మూకల దాడిలో గాయపడిన ధనచక్రవర్తిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

పంగులూరు, మార్చి 13 : సిద్ధం సభకు రానన్నందుకే వైసీపీ వారు తనపై దాడిచేశారని రామకూరు గ్రామవాసి తలారి ధనచక్రవర్తి అన్నారు. మండలంలోని రామకూరు గ్రామంలో ఈ నెల 10న వైసీపీ మూకల దాడిలో గాయపడి చికిత్స పొంది ఇంటికి చేరుకున్న ధనచక్రవర్తిని బుధవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. దాడికి దారితీసిన పరిస్థితులను రవికుమార్ ధనచక్రవర్తిని అడిగి తెలుసుకున్నారు. జరిగిన ఘటనను గొట్టిపాటి ఖండించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్‌లు మానం సుబ్బారావు, తొట్టెంపూడి చంద్రశేఖర్, కేవీ సుబ్బారావు, గ్రామ ఉపసర్పంచ్ పెదవల్లి అశోక్, కుక్కపల్లి ఏడుకొండలు, గుర్రం ఆదిశేఖర్, కాజా పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

### నేడు టీడీపీ శ్రేణులతో గొట్టిపాటి సమావేశం

మండలంలోని ముప్పవరం గ్రామ టీడీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం 4 గంటలకు పార్టీ నేతలతో జరిగే సమావేశంలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పాల్గొంటారని క్యాంపు కార్యాలయ ప్రతినిధి తెలిపారు. ఈ నెల 17వ తేదీ బొప్పూడి కేంద్రంగా జరగనున్న టీడీపీ, జనసేన, బీజేపీ బహిరంగ సభ ఏర్పాట్ల గురించి సమాశేశంలో చర్చిస్తారన్నారు. ఈ సమవేశానికి మండల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అన్ని గ్రామాలకు చెందిన బూత్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జులతో పాటు పేజీ నేస్తం సారథులు తప్పక హాజరు కావాలని కోరారు.


## కృషి సఖిలకు ప్రత్యేక అవగాహన



పైర్ల ఏటీఎం మోడల్‌ను వివరిస్తున్న ఏవో కాశీవిశ్వనాథ్

వేటపాలెం(చీరాల),మార్చి 13 : రైతులు ప్రధానంగా కిచెన్ గార్డెన్స్‌ను ఎలా సాగుచేయాలి. వాటి ఉపయోగాలపై బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన, అవగాహన కార్యక్రమంలో వేటపాలెంకు చెందిన రైతు పి. వెంకట్ అనే రైతు పొలంలో కూరగాయల సాగును కృషిసఖీలకు వివరించారు. ఈ సందర్భంగా ఏవో కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలోని కృషిసఖిలకు 5 రోజుల శిక్షణలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కూరగాయలు, ఆకుకూరల సాగుపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసరావు, ఏపీసీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ భారతి, యూనిట్ ఇన్‌చార్జులు, ఐసీఆర్‌పీలు, కృషి సఖీలు పాల్గొన్నారు.

## టీడీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు




మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నేతలు

పర్చూరు, మార్చి 13: వేసవి సందర్భంగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచనల మేరకు తెలుగుదేశం పార్టీ బీసీసెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టణపార్టీ అధ్యక్షులు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు కోరారు. స్థానిక బొమ్మల సెంటర్ సమీపంలో టీడీపీ బీసీసెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని బుధవారం బీసీనేతలు కొండ్రగంటి శివనాగేశ్వరరావు, వెంకటకృష్ణారావు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో బీసీసెల్ నాయకులు అన్నవరపు శ్రీనివాసులు(వాసు), కొమ్మాలపాటి శ్రీనివాసరావు, కూరపాటి జగన్, ఉప్పుటూరి నరేంద్ర, కూరపాటి అప్పారావు, స్థానిక నేతలు మక్కెన శేఖర్‌బాబు, గడ్డిపాటి శ్రీనివాసరావు, లక్కిపోగు సుమన్, కొండ్రగంటి శివనాగేశ్వరావు, చెరుకూరి చింపయ్య, షేక్.బాబు, గోరంట్ల రామకృష్ణ పఠాన్ బాజీ, నూతలపాటి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

### పేద ఖైదీల విడుదలకు ఆదేశాలు

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 13:సామాజికంగా వెనుకబడిన, పేద వర్గాలకు చెందిన ఖైదీలను పేద ఖైదీలకు మద్దతు పథకం కింద విడుదల చేయటానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. ఆయన అధ్యక్షతన బుధవారం జిల్లాస్థాయి సాధికార కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప కారాగారాలలో విచారణ, శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు బెయిల్ పూచీకత్తు లేదా జరిమానా మొత్తాన్ని చెల్లించడానికి ఆర్థిక స్తోమత లేని వారిని గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంమంత్రిత్వశాఖ రాష్ట్రాలకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇందుకోసం జిల్లాలో సాధికార కమిటీని ఏర్పాటుచేసి తొలి సమావేశం నిర్వహించామన్నారు. సమావేశంలో సభ్యులుగా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యామ్‌బాబు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.సత్యకుమారి, ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి, కన్వీనర్‌గా జిల్లా జిల్లా కారాగార అధికారి పి.వరుణారెడ్డి పాల్గొన్నారు.

### కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

కనిగిరి, మార్చి 13 : కస్తూర్బాగాంధీ పాఠశాలలో 6 నుంచి 11వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హసీనాబేగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కస్తూర్బా స్కూలులో 6వ తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. 7, 8 తరగతులలో మిగిలిన సీట్లను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 12 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తులు పంపవచ్చని పేర్కొన్నారు. ఇంటర్ ఎంపీసీ గ్రూపులో మొదటి సంవత్సరం 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. వివరాలకు 76618 33448 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. లేకుంటే స్కూలులో నేరుగా కలసి తెలుసుకోవాలని సూచించారు.

# ఎస్ బాస్!

అధికారంవైపు పోలీసు అడుగులు

స్పెషల్ బ్రాంచ్‌పైన వైసీపీ నేతల స్వారీ

పెత్తనం చెలాయిస్తున్న కొంతమంది పోలీసులు

అధికారపార్టీ నాయకుల మాదిరిగా వ్యవహారం

హోంగార్డులకు ఇళ్లస్థలాలంటూ తాయిలం



ఒంగోలు(క్రైం), మార్చి 13 : కొంతమంది పోలీసులు అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులు వొత్తుతున్నారు. బహిరంగంగానే ఆ పార్టీకి సహకరించాలంటూ తాయిలాలతో సిద్ధమైపోయారు. స్వయంగా గ్రూపులలో మెసేజ్‌లు పెట్టడంతోపాటు బెదిరింపులకు దిగుతున్నారు. వివరాల్లోకి వెళితే.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాప్రతినిధుల సిఫార్సు లేకుండా కనీసం కానిస్టేబుల్ బదిలీ కూడా కావడం లేదు. అయితే ఇటీవల హడావుడిగా స్పెషల్ బ్రాంచ్‌లో ఓ హెడ్ కానిస్టేబుల్ ఆకస్మిక బదిలీ పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. సిబ్బంది బదిలీ విషయంలో ఒంగోలులో కొంతమంది పోలీసులు(అధికారపార్టీ సానుభూతిపరులుగా ముద్రపడిన వారు) జట్టుకట్టి తమ కనుసన్నల్లో జరుపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పోలీసు శాఖలో ఏలాంటి పని కావాలన్నా వారి దగ్గరకు వెళ్లి ప్రసన్నం చేసుకుంటే చాలు అనేది అందరికీ తెలిసిన విషయమే. అందుకు ఓ పోలీసు సంఘం మాజీ నేత కేంద్రబిందువుగా వ్యహరిస్తున్నాడు, ఈ విషయం పోలీసు వర్గాల్లో దుమారం రేపుతోంది. గత నెలరోజులుగా పోలీసు స్టేషన్లలో కేసుల దర్యాప్తు గాలికి వదిలి ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేయడం కొందరు అధికారుల పనిగా మారింది. జిల్లాలో పరిస్థితి చూస్తే ఓ మాజీ మంత్రి, ఆయనకు ఇరుపక్కల ఉన్న నియోజకవర్గాల్లో ఇన్‌చార్జులుగా ఉన్న మంత్రుల చుట్టూ ఆశావహులు ప్రదక్షణలు చేస్తున్నారు. దీంతో పెండింగ్‌లో ఉన్న కేసులు దర్యాప్తు ముందుకు సాగడం లేదు. పోలీసు అధికారులు స్టేషన్లు వదిలి ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకోవడం తోనే సరిపోతుంది. పైగా వారి ఆంతరంగిక సేవలోనూ తరిస్తున్నారు. ఇందుకు పొన్నలూరు ఎస్సై రాజేష్ వ్యవహారమే ఒక నిదర్శనం. అధికార పార్టీలో చేరకపోతే రౌడీషీటు తెరుస్తామని టీడీపీ నేతను బెదిరించిన విషయం తెలిసిందే.

### స్పెషల్ బ్రాంచ్‌పై అధికార పార్టీ స్వారీ

స్పెషల్ బ్రాంచ్ అంటే పోలీసు శాఖకు కళ్లు, చెవులు వంటిది. అలాంటి ఎస్‌బీలో పనిచేయాలన్నా కూడా ప్రజాప్రతినిధుల సిఫార్సు కావాల్సి వస్తోంది. ఎన్నికల సమయం ఆసన్నమైన వేళ తాలూకా పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌ను బదిలీ చేయడం వెనుక నేతల వత్తిడులకు తలవొగ్గారనే ప్రచారం జరుగుతోంది. తిరిగి అక్కడ మరొకరిని నియమించడం కోసం కూడా మల్లగుల్లాలు పడుతున్నారు. అక్కడ పోస్టింగ్ విషయంలో అనేక మంది పోటీ పడుతున్నారు. నిబంధనల ప్రకారం స్పెషల్ బ్రాంచ్‌లో నియామకం జరగాలంటే వారి పై ఇంటెలిజెన్స్ క్లియరెన్స్ ఉండాలి. అలాంటి వారి జాబితాను సిద్ధంగా ఉంచుకొని అవకాశం ఉన్న సమయంలో వారికి పోస్టింగ్ ఇవ్వాలి. కాని ఇప్పుడు ఎన్ని అభియోగాలు ఉన్నా ప్రజాప్రతినిధులు సిఫార్సు ఉంటే ఎస్‌బీలో పోస్టింగ్ ఇవ్వడం పరిపాటిగా మారింది. దీంతో తాలూకా ఎస్‌బీ పోస్టింగ్‌కు డిమాండ్ పెరిగింది.

### హోంగార్డులకు ఇళ్ల స్థలాలంటూ ఆశలు

ఎన్నికల వేళ రాజకీయ నాయకులు తాయిలాలు ఇవ్వడం పరిపాటి. అదేక్రమంలో ఒంగోలులో హోంగార్డులకు ఇళ్లస్థలాలు అంటూ హోంగార్డుల సంఘం ఓ మాజీ నేత ఏకంగా గ్రూపులలో మెసేజ్ పెట్టడం దుమారం రేపుతోంది. నేరుగా ఇలా చెప్పడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అధికారులే దీనిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శాఖ పరువు తీస్తున్నారంటూ మండిపడుతున్నారు. ఎన్నికల వేళ ఇలా ప్రకటనలు చేయడం ఏమిటి అని చర్చ ప్రారంభమైంది. హోంగార్డులకు నివేశన స్థలాలు ఇవ్వడం సబబే అయినప్పటికి, ఎన్నికల ముందు మాయ చేయడం, అదీ పోలీసు శాఖలో అనుబంధంగా పనిచేసే హోంగార్డులు కావడంతో విమర్శలకు తావిస్తోంది.

-ఒంగోలులో హోంగార్డులకు ఇళ్లస్థలాలు అంటూ ఓ మాజీ హోంగార్డుల నేత ఏకంగా గ్రూపులలో మెసేజ్ పెట్టడం దుమారం రేపుతోంది. ఇళ్లస్థలాలు కావాల్సిన వారు రేషన్, ఆధారు, ఓటరు కార్డుతో పాటుగా ఇంటి స్థలం కోసం దరఖాస్తు తీసుకొని రండి అంటూ మెసేజ్‌లు చేయడంతోపాటుగా నేరుగా హోంగార్డులకు ఇలా చెప్పడంతో ఎన్నికల వేళ ఇలా తాయిలాలు ఏమిటన్న చర్చ ప్రారంభమైంది.

-ఇటీవల అధికారపార్టీలో చేరకపోతే రౌడీషీటు తెరుస్తామని ఓ టీడీపీ నాయకుడిని పొన్నలూరు ఎస్ఐ రాజేష్ బెదిరించిన విషయం చర్చనీయాంశమైంది. ఈ మేరకు కొండపి ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామి ఎన్నికల కమిషన్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

-ఇదీ జిల్లాలో పోలీసు శాఖ పరిస్థితి. కొందరు పోలీసు అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అధికార పార్టీ నాయకుల ప్రాపకం కోసం వారికి తొత్తుల్లా పని చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి అదేక్రమంలో పోలీసు బాస్ నేర సమీక్ష సమావేశంలో ఇచ్చిన సూచనలు కూడా పెడచెవిన పెట్టడం గమనార్హం. సినిమా పోలీసులం కాదు అంటూ అందరి బాధ్యతను ఆయన హెచ్చరించినప్పటికీ కిందిస్థాయి అధికారుల వ్యవహారశైలి అందుకు భిన్నంగా ఉంటుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇలాంటి అధికారులపై కాస్త కన్నేసి ఉండాల్సిన అవసరం ఉందని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

### పెత్తనం చెలాయిస్తున్న కొంతమంది పోలీసులు

ఇద్దరు ముగ్గురు పోలీసులు జట్టుగా ఏర్పడి అధికారపార్టీ తరఫున ఒంగోలులో చక్రం తిప్పుతున్నారు. వారు ఏ విధులు నిర్వహిస్తున్నారు అనేది కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. పోలీసు శాఖలో బదిలీ వ్యవహారాలు చూడటంతోపాటుగా ఏ అధికారి ఎక్కడికి రావాలనే అంశాలు కూడా వారు ప్రజాప్రతినిధులకు సలహాలు ఇవ్వడం చూస్తుంటే వారు పోలీసు శాఖలో పనిచేస్తున్నారా? లేక అధికారపార్టీకి సేవ చేస్తున్నారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక కానిస్టేబుల్ బదిలీ విషయంలో ఎస్పీ ఆదేశాలు ఇచ్చినప్పటికి మనోడు కాదు అంటూ పట్టుబట్టి నిలిపివేయించిన ఉదంతాలు ఉన్నాయి. ఇప్పటికి పోలీసు శాఖలో పనిచేసే సిబ్బంది వారిని ప్రసన్న చేసుకోక తప్పడం లేదు.

# అందరి చూపు టీడీపీ వైపే

16న సైకిలెక్కనున్న ఎంపీ మాగుంట,

రాఘవరెడ్డి, భారీగా అనుచరులు

అదే రోజు మాజీ ఎమ్మెల్యే గరటయ్య,

చైతన్య వారి అనుచరగణం

మరికొందరు ప్రముఖులు సైతం..


జిల్లాలో ఒక్క రోజులో భారీగా చేరికలు

ఒంగోలులో ఆర్యవైశ్య సామాజిక నేత, యువకులు

గిద్దలూరు, పర్చూరులో రెడ్డి సామాజికవర్గం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో తెలుగుదేశం పార్టీలోకి ఓటు బ్యాంకులైన నాయకులు పోలోమని పోతున్నారు. టీడీపీ, జనసేనలతోపాటు బీజేపీ కూడా ఆ పార్టీలతో జతకట్టిన నేపథ్యంలో చేరికల్లో మరింత ఊపు పెరగడం విశేషం. ఈనెల 17న జిల్లాకు సమీపంలో కూటమి బహిరంగ సభ జరుగుతుండటంతో అందులో బాబు, పవన్‌తోపాటు ప్రధాని మోదీ కూడా పాల్గొంటున్న విషయం తెలిసిందే.



ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన చినగంజాం మండలం కొత్తపాలెం వైసీపీ నేతలు

ఈ నేపథ్యంలో కొన్ని స్థాయిల్లోని వైసీపీ శ్రేణులు, నాయకులు ఇప్పటివరకు రాష్ట్రప్రభుత్వ కక్షసాధింపు చర్యలపై ఉన్న భయాన్ని వీడి పోలోమని టీడీపీలో చేరుతున్నారు. ముందు నుంచి అనుకున్న ప్రకారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఆయన కుమారుడు రాఘవరెడ్డి, వారి అనుచరులు 16న చంద్రబాబు సమక్షంలో సైకిల్ ఎక్కుతున్నారు. సాయంత్రం 4గంటలకు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో వీరి చేరిక కార్యక్రమం జరుగనుంది. వీరితోపాటు వైసీపీలో ఉన్న మాగుంట అనుచరగణం టీడీపీలో చేరబోతున్నారు. వారిలో కొందరు ఎంపీపీలు, జడ్పీటీసీలు, సింగిల్ విండోఅధ్యక్షులు, కొన్ని కార్పొరేషన్ల డైరెక్టర్లు కూడా ఉన్నారు.

### అదే రోజు బాచిన

మరోవైపు వైసీపీలో దగాపడ్డ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాచిన చెంచుగరటయ్య, ఆయన కుమారుడైన అద్దంకి వైసీపీ మాజీ ఇన్‌చార్జి కృష్ణచైతన్య టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఎమ్మెల్యే రవికుమార్, సాంబశివరావు ఇచ్చిన సమాచారంతో చంద్రబాబు వీరి చేరికకు సమయాన్ని కేటాయించారు. వీరితోపాటు ప్రధానంగా నియోజకవర్గంలోని వారి అనుచరులు భారీగా చేరనున్నారు. ఇంకోవైపు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పేరు ప్రచారంలో ఉండగా, తాజాగా కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు కూడా టీడీపీలో చేరే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

### ఒంగోలు, గిద్దలూరు, పర్చూరులో భారీ చేరికలు

కాగా బుధవారం జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో వైసీపీ నుంచి, వివిధ ప్రజాసంఘాల నుంచి టీడీపీలో చేరే వారి సంఖ్య భారీగా కనిపించింది. ప్రధానంగా ఒంగోలు, గిద్దలూరు, పర్చూరులో ఆయా సామాజిక వర్గాల్లోనూ, వైసీపీలోనూ కీలక భూమిక పోషిస్తున్న పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఒంగోలులో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమక్షంలో ఆర్యవైశ్య సామాజికవర్గం నుంచి భారీగా టీడీపీలో చేరడం విశేషం. ప్రధానంగా వైసీపీకి గుడ్‌బై చెప్పి వారంతా టీడీపీలోకి వచ్చారు. ఒకప్పుడు ఎమ్మెల్యే బాలినేనికి అత్యంత సన్నిహితునిగా మెలిగిన నల్లమల్లి బాలుతోపాటు ఆ సామాజికవర్గంలోని యువకులు టీడీపీలో చేరడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇక గిద్దలూరు, పర్చూరు నియోజకవర్గాల్లో రెడ్డి సామాజికవర్గం, బలహీనవర్గాలకు చెందిన వారు పెద్దసంఖ్యలో టీడీపీలో చేరారు. గిద్దలూరు మండలంలోని పొదలకొండపల్లి పంచాయతీ, సమీప గ్రామాల్లో పట్టు ఉన్న వైసీపీ నేత జయరామిరెడ్డి పెద్దసంఖ్యలో అనుచరులతో టీడీపీలో చేరారు. టీడీపీ నేత ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో జయరామిరెడ్డితోపాటు గ్రామసర్పంచ్, ఐదుగురు వార్డుసభ్యులు, గ్రామంలో ఆయా వర్గాల ప్రజలపై ప్రభావం చూపే కీలక వ్యక్తులు 250మంది టీడీపీలో చేరారు. పర్చూరు నియోజకవర్గంలో అయితే గ్రామాలకు గ్రామాల ప్రజలే తరలివచ్చి ఎమ్మెల్యే సాంబశివరావు సమక్షంలో టీడీపీలో చేరారు. ప్రధానంగా చినగంజాం మండలంలోని కొత్తపాలెం, మున్నవారిపల్లె, రాజుబంగారుపాలెం గ్రామాల నుంచి భారీగా వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరారు. రెడ్డి సామాజికవర్గం, బలహీనవర్గాల నాయకులు, ప్రజలు టీడీపీలో చేరారు. తమకు పట్టున్న మండలంగా వైసీపీ నాయకులు భావిస్తున్న చినగంజాం మండలం నుంచి పూర్తిస్థాయి వైసీపీ శ్రేణులు పచ్చ కండువాలు కప్పుకున్నారు. మూలగారివారిపాలెం నుంచి ఎ.చెన్నారెడ్డి, బి.వెంకటేశ్వర్‌రెడ్డితోపాటు 50 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. మున్నంగివారిపాలెం నుంచి నరేంద్రరెడ్డి, బాలిరెడ్డి, కోటిరెడ్డిలతోపాటు పలు కుటుంబాల వారు చేరారు. రాజుబంగారుపాలెం నుంచి ఎ.చిన్ననరసింహారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, 40 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.యద్దనపూడి మండలం నుంచి కూడా కొన్ని గ్రామాల వారు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు.

### 250 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరిక

గిద్దలూరు టౌన్, మార్చి 13: గిద్దలూరులో టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని, ఇక విజయం మనదేనని మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. బుధవారం గిద్దలూరు మండలం పొదలకొండపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ ఆవుల వెంకటసుబ్బమ్మ, గ్రామానికి చెందిన వైసీపీ కీలక నాయకులు చేరెడ్డి జయరామిరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ ఆవుల రాజగోపాల్, వార్డుమెంబర్లు పందనబోయిన లక్ష్మీ, పిక్కిలి రంగయ్యతో సహా 250 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరికీ అశోక్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారినుద్దేశించి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌రెడ్డి నిరంకుశ పాలనతో ప్రజలు, అన్నివర్గాల వారు అష్టకష్టాలకు గురయ్యారన్నారు. పేదల సంక్షేమం కోసం టీడీపీ అనేక పథకాలు ప్రవేశపెట్టడమే కాకుండా కొత్త పథకాలకు రూపకల్పన చేసిందని, సూపర్‌సిక్స్ పథకాలతో పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న అశోక్‌రెడ్డి గెలుపునకు కృషిచేస్తామని, పొదలకొండపల్లి పంచాయతీలో పార్టీకి అత్యధిక మెజారిటీ తీసుకు వస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో చేరెడ్డి వెంకటరామిరెడ్డి, ఎంబాడి కావేరి, ముత్యాల మల్లికార్జున, కాలువ భాస్కర్, ముత్యాల పాపయ్య, దండు రంగయ్య, ముత్యాల లక్ష్మయ్య, ఆగెపోగు మాదయ్య, కొండెపోగు ప్రసంగి, అంగసముద్రం క్రిష్ణ, కొమ్మునూరి చంటి, కాలువ దావీద్, దండు రంగస్వామి, గుర్రం జగన్, తిరుపతిరెడ్డి, షేక్‌బాషా, చేరెడ్డి బయ్యపురెడ్డి, చేరెడ్డి ప్రతాపరెడ్డి, నంద్యాల ఖాశిం, కటారు పోలయ్య, కటారు బాలనరసింహులు ఉన్నారు. మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# ఎన్నికల వేళ కరువు గుర్తుకొచ్చింది

-నివేదికలు కోరిన ప్రభుత్వం,

కసరత్తు చేస్తున్న యంత్రాంగం

-రబీలో 44 శాతం లోటు వర్షపాతం,

36 శాతం తగ్గిన పంటల సాగు

ఒంగోలు మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలకొన్న తీవ్ర కరువు, పంటల పరిస్థితిపై ప్రభుత్వానికి ఇప్పటికి గుర్తు వచ్చింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ రైతులను మభ్యపెట్టేందుకు కరువుపై జిల్లా యంత్రాంగాన్ని నివేదికలు పంపాలని కోరింది. పంటల సీజన్ పూర్తయి వచ్చిన అరకొర పంట ఉత్పత్తులు అమ్మకాలు చేసే తరుణంలో నివేదికలు కోరడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది అటు ఖరీఫ్, ఇటు రబీ రెండు సీజన్‌లలోను కరువు వెంటాడింది. ఏ ఒక్క నెలలోను సరైన వర్షాపాతం కురిసిన దాఖలాలు లేక పంటలు సజావుగా సాగలేదు. సాగైనవి కూడా చాలాచోట్ల ఎండిపోగా ఉన్న వాటిని కాపాడుకొనేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డారు. నీటి తడులు కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చింది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 366.3 మి.మీ సాధారణ వర్షపాతం కాగా 18.5 శాతం జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో లోటుతో 298.6 మి.మి కురిసినట్లు అధికారిక లెక్కలు బట్టి తెలుస్తున్నది. అందులో పంటలు సాగుకు ఉపకరించే సమయంలో వర్షాలు లేక సాగు ముందుకు సాగలేదు. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 5.36 లక్షలు ఎకరాలు కాగా 3.54 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగయింది. అంటే 66 శాతం మాత్రమే పంటలు సాగు కాగా మూడవ వంతు విస్తీర్ణంలో విత్తనం పడలేదు. సరైన పంటలు కూడా వర్షాలు సరిలేక దిగుబడులు రాక నష్టపోగా ఆ సీజన్‌లో కరువు గురించి ప్రభుత్వం పట్టించుకోన్నపాపాన పోలేదు. ఇక రబీ సీజన్ చూస్తే ఈ సీజన్‌లో జిల్లాలో 384.80 మి.మి సాధారణ వర్షపాతం కాగా కేవలం 214.10 మి.మి నమోదు అయింది. అంటే దాదాపు 44 శాతం లోటుఆ ఉంది. ఆ ప్రభావం పంటలు సాగుపై తీవ్రంగా పడింది. ఈ సీజన్‌లో జిల్లాలో 4.27 లక్షల ఎకరాలలో వివిధ పంటలు సాగు కావాల్సి ఉండగా 2.77 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. అంటే రబీలో 44 శాతం వర్షపాతం తగ్గగా, 36 శాతం విస్తీర్ణంలో విత్తనం పడలేదు. కీలకమైన శనగ, వరి, మొక్కజొన్న, మిర్చి వంటి పంటల సాగు గణనీయంగా తగ్గిపోగా పొగాకు మాత్రం కాస్తంత పెరిగింది. అయితే వర్షాలు లేక పొగాకు రైతులు కోట్లాది రూపాయలు వెచ్చించి నీటి తడులు ఇచ్చి పంటను కాపాడుకోగా ఇతర పంటలు దిగుబడులు తగ్గిపోయాయి.

అంతేకాక పంటసాగు డిసెంబర్ నాటికి పూర్తయి ప్రస్తుతం అన్ని రకాల పంటలు ఇళ్లకు చేరి అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో ప్రభుత్వానికి కరువు గుర్తుకు వచ్చింది. నిజంగా కరువు బారిన పడ్డ రైతులు ను ఆదుకోనే ఆలోచన ప్రభుత్వానికి ఉంటే డిసెంబర్ ఆఖరులోనే ఆ వైపు దృష్టి సారించి ప్రత్యామ్నయ చర్యలు చేపట్టాలి. అయితే ఖరీఫ్‌లో కరువును అసలు వదిలేసి,ఎన్నికలు సమీపిస్తున్న వేళ రబీ కరువుపై నివేదికలు కోరడం విమర్శలకు తావిస్తున్నది. అయితే ప్రభుత్వ ఆదేశాలతో కరువుపై సమగ్ర నివేదిక పంపేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

## వైసీపీ నాయకులను అరెస్టు చేయాలి

మాజీ ఎమ్మెల్యే కందుల డిమాండ్



బాధితుడిని పరామర్శిస్తున్న కందుల

మార్కాపురం రూరల్, మార్చి 13: టీడీపీ కార్యకర్త ఆత్మహత్యాత్నానికి కారణమైన వైసీపీ నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా వైద్యశాలలో తర్లుపాడు మండలం కందుల్లపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బ్రహ్మతేజ్ కుమార్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కందుల ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. పార్టీ తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని బాధితుడికి ధైర్యం చెప్పారు. అనంతరం కందుల విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నాయకుల దౌర్జన్యాలు, వేధింపులు గ్రామాల్లో ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రహ్మతేజ్‌కుమార్‌పై వేధింపులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అరాచకాలకు పాల్పడిన వైసీపీ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దౌర్జన్యంగా ప్రజల భూములను, ఆస్తులను వైసీపీ నాయకులు ఫోర్జరీ సంతకాలతో కబ్జా చేస్తున్నారని కందుల ఆరోపించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు నియోజకవర్గ పోల్ మేనేజిమెంట్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి, తర్లుపాడు మండల అధ్యక్షుడు చిన్నపరెడ్డి, చిట్యాల శేఖర్ రెడ్డి, బాధితుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# చేరికలతో తెలుగుదేశం పార్టీలో జోష్

**కొత్తపాలెం, మున్నంవారిపాలెం, రాజు బంగారు పాలెం నుంచి భారీగా వలసలు**

**పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే ఏలూరి**

పర్చూరు, మార్చి 13: తెలుగుదేశం పార్టీలోకి వలసల పర్వం జోరందుకుంది. రోజు రోజుకు పార్టీలోకి చేరికలు కొనసాగుతుండటంతో పార్టీలో జోష్ నెలకొంది. బుధవారం ఇసుకదర్శి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో చిన్నగంజాం మండల పరిధిలోని కొత్తపాలెం, మున్నంవారిపాలెం, రాజు బంగారు పాలెం గ్రామాల నుంచి 100 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి చేరాయి. వారికి పార్టీ కండువా కప్పి ఏలూరి సాదరంగా అహ్వానించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోకి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలోకి చేరారు. కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని మూలగానివారిపాలెం గ్రామానికి చెందిన అక్కల చెన్నారెడ్డి, బక్క వెంకటేశ్వర్‌రెడ్డిలతో పాటు 50 కుంటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. అదేవిధంగా మున్నంవారి పాలెం గ్రామానికి చెందిన బక్క నరేందర్ రెడ్డి, బాగిరెడ్డి, కోటిరెడ్డిలతోపాటు 10 కుంటుంబాలు పార్టీలోకి చేరారు. రాజు బంగారుపాలెంకు చెందిన అట్ల చిన్న నర్సింహారెడ్డి అట్ల వెంకటేశ్వర్‌రెడ్డి అంకిరెడ్డి ఆధ్వర్యంలో 40 కుంటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు.



తెలుగుదేశం పార్టీలోకి చేరిన చిన్నగంజాం మండల వాసులతో ఎమ్మెల్యే ఏలూరి

**నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యం**

**ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**

పర్చూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే నా లక్ష్యమని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అదక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు నియోజకవర్గంలో 50 ఏళ్లలో జరగని అభివృద్ధిని 5 ఏళ్లలో చేసి చూపించానన్నారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా చిన్నగంజాం ఉందన్నారు. సరైన మౌలిక వసతులు లేక అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రహదారులు, మంచినీరు, డ్రైన్లు, ఇళ్లులేక చదువుకున్న యువతకు ఉపాధి ఉద్యోగం లేక తీవ్ర వెనుకబాటుకు గురైందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి చేసి చూపించి మళ్లీ ఓటు అడిగానని గుర్తు చేశారు. 2014-19 మధ్య కాలంలో జరిగిన అభివృద్ధి మినహా తరువాత ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. చినగంజాం మండల ప్రజల దశాబ్దాల కల ఎన్టీఆర్ వారధిని నిర్మించి ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చారని ఏలూరి అన్నారు. రానున్న కాలంలో మండలంలో ఉన్న సమస్యలను అన్నింటిని పరిష్కరించేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. వైఎస్ జగన్ పాలనలో అరాచక విధ్వంస దోపిడీ పాలనకు విసిగి వేసారి అయన సామాజిక వర్గానికి చెందిన 100 కుంటుంబాలు తనపై నమ్మకంతో తెలుగుదేశం పార్టీలో చేరటం రాష్ట్ర చరిత్రలో నూతన అధ్యాయం అన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ సరైన నిర్ణయం తీసుకొని రాష్ట్రానికి బాటలు వేసే చంద్రబాబు వైపు అడుగులు వేయాలన్నారు. ప్రజల కల నెరవేర్చడమే తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి లక్ష్యం అన్నారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు పొద వీరయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మి, అసోది సుబ్బారెడ్డి, జాలి రామిరెడ్డి, వాటుపల్లి కొండలు, నక్కల రాఘవ, బత్తుల శ్రీనివాసరావు, కొండ్రగుంట శ్రీహరి, రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

**- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్**

అద్దంకి, మార్చి13: పరిపాలన అంటే సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా ఉండాలని, వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం అని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలోని క్లస్టర్ 8 పరిధిలో 152, 153,155, 161, 162,163, 164, 165, 166, 167, 171, 172, 173, 174, 175, 176 బూత్‌ల పరిధిలోని టీడీపీ నేతలు, కౌన్సిలర్‌లు, కార్యకర్తలతో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ బూత్‌ల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో టీడీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఓటును పోలింగ్ బూత్ వరకు తీసుకురావాలసిన బాధ్యత ఉందని అన్నారు. మన బిడ్డల, రాష్ట్ర భవిష్యత్ కోసం బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి కలయిక అన్నారు. రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సీ కార్పొరేషన్ ను నిర్వీర్యం చేశారన్నారు. 28,147 కోట్ల రూపాయల నిధులను దారి మళ్లించి దళితులకు తీరని అన్యాయం చేశారన్నారు. ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నించే దళితులను ఊచకోత కోస్తూ రాక్షసానందం పొందుతున్నారన్నారు. 6 వేల మంది దళితులపై అక్రమ కేసులు పెట్టి 21 మందిని హత్య చేసిన జగన్ ప్రభుత్వంపై జుడిషియల్ విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని చంద్రబాబునాయుడు స్పష్టం చేశారని రవికుమార్ చెప్పారు. వైసీపీ తప్పులను ప్రశ్నించినందుకు మహాసేన రాజేష్‌ని వేధింపులకు గురిచేశారన్నారు. వైసీపీని గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ హయాంలో దళితుల అభివృద్ధి జరిగిందని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వేలాది మంది యువతకు స్వయం ఉపాధి కల్పించటం జరిగిందని అన్నారు. అంబేద్కర్ విదేశీ విద్య పేరు మార్చి జగన్ తన పేరు పెట్టుకోవటానికి సిగ్గులేదా అని ఎమ్మెల్యే రవికుమార్ ప్రశ్నించారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు గౌరవంగా బతకాలంటే చంద్రబాబునాయుడు సీఎం కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ సర్కారు రద్దు చేసిన 27 ఎస్సీ సంక్షేమ పథకాలను పునరుద్ధస్తామని ఆయన వివరించారు. మద్యం రాబడిని ఆదాయంగా చూపించుకొని అప్పులు తెచ్చుకోవటమే మద్యపాన నిషేధమా అని ప్రశ్నించారు. రెండు దశాబ్దాల తన రాజకీయ చరిత్రలో ఎక్కడా కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదని, భవిష్యత్‌లో కూడా పాల్పడనని రవికుమార్ అన్నారు. టీడీపీ హయాంలో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున పింఛన్‌లు, సీఎం సహాయ నిధి, జలసిరి బోర్లు మంజూరు జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రయివేట్ కళాశాలలలో చదివే పీజీ విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబెర్స్‌మెంట్ వర్తింపచేయకపోవటం జగన్‌రెడ్డికి పేదలపై చూపుతున్న కపట ప్రేమకు నిదర్శనం అన్నారు. టీడీపీ అధికారం లోకి వచ్చిన వెంటనే ఆంక్షలు లేకుండా అన్ని కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వర్తింప జేస్తామన్నారు. ఈ సమీక్షలో టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జి కుందారపు రామారావు, కౌన్సిలర్ లు కంపా రజని, విజయలక్ష్మి, జహీరా, అత్తులూరి రమేష్, లహరి, మన్నెం ఏడుకొండలు, భోజనపల్లి సత్యనారాయణ, గుంజి శ్రీనివాసరావు, యర్రాకుల రామాంజనేయులు, బిశ్రపాటి రామాంజనేయులు, గట్టుపల్లి రామారావు, కమ్మిశెట్టి శ్రీధర్, వడిగినేని వీరయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



అద్దంకి పట్టణ వార్డు కౌన్సిలర్‌లు, నేతలతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్



ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన అనమనమూరు వైసీపీ నేతలు

## టీడీపీలో చేరిన అనమనమూరు వైసీపీ నేతలు

మేదరమెట్ల , మార్చి 13: కొరిశపాడు మండలం అనమనమూరుకు చెందిన పలువురు వైసీపీ నేతలు అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. బుధవారం వల్లెపు శ్రీను(డాన్‌శ్రీను) ఆధ్వర్యంలో వల్లెపు వెంకట్రావు, కుంచాల శ్రీను, వల్లెపు అనిల్, వల్లెపు శ్రీనివాసరావు, తమ్మిశెట్టి శ్రీను, రమేష్, కొండలుతో పాటు పలువురు జన్నతాళిలోని ఎమ్మెల్యే రవికుమార్ క్యాంప్ ఆఫీస్‌లో ఆయను కలిసి టీడీపీలో చేరారు. ఇటీవల మండలంలోని పలువురు వైసీపీ నేతలు ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు.అద్దంకి వైసీపీ ఇచ్‌చార్జి బాచిన కృష్ణచైతన్యను వైసీపీ ఇన్‌చార్జిగా బాధ్యతల నుంచి తప్పించడంతో ఆయన అనుచరులు అందరూ తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. వీరందరిని రవికుమార్ సాదరంగా ఆహ్వానిస్తున్నారు.

# చీరాల నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

**- ఎమ్మెల్యే బలరాం**

చీరాల,మార్చి 13 : నియోజకవర్గంలో అన్ని అన్ని వర్గాల అభ్యున్నతి, మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే కరణం బలరాం, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు అన్నారు. నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలలో వారు పాల్గొన్నారు. మసీదు సెంటర్లో రూ.90 లక్షల వ్యయంతో ట్రాన్స్‌ఫార్మర్, శ్లాబ్ కల్వర్టు, డ్రెయిన్లు వంటి అభివృద్ధి పనులను బుధవారం వారు ప్రారంభించారు. ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్(బస్సులు డిపోలోకి వెళ్లేదారి) అప్రోచ్ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయా సందర్భాల్లో వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులుగా ప్రజల మనస్సులు తెలుసుకుని, అందుకు అనుగుణంగా వారికి సేవలు అందించాలని చెప్పారు. అదే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు.ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌ఛైర్మన్ బొనిగల జైసన్‌బాబు, డాక్టర్ వరికూటి అమృతపాణి, మల్లెల లలితరాజశేఖర్, యాతం మేరీ బాబు, శిఖా సురేష్, చీమకుర్తి బాలకృష్ణ, సల్లూరి అనిల్, కోఆప్షన్ సభ్యులు షేక్ హుమాయూన్ కబీర్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల శిలాఫలకాల ఆవిష్కరణలో ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్ తదితరులు

**రూ.11.99 కోట్లతో అభివృద్ధి పనులు**

గడిచిన ఐదేళ్ల కాలంలో కొత్తపేట పంచాయతీ పరిధిలో రూ.11.99 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజవకర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్‌లు అన్నారు. అందులో భాగంగా బుధవారం తాజాగా రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన పార్కును, రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని ప్రారంభించారు. అలాగే చీరాల మండలం రామకృష్ణాపురంలో రూ.9లక్షల వ్యయంతో నిర్మించిన పంచాయతీ భవనం పై అంతస్తును ప్రారంభించారు. రూ.1.96 కోట్ల వ్యయంతో పూర్తిచేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ హైమా సుబ్బారావు(గుంటుపల్లి సుబ్బారావు), దివి జయరాం, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నియోజవకర్గ ఇన్‌చార్జి ఎం.ఎం కొండయ్య

## రాష్ట్ర పురోగమనం చంద్రబాబుతోనే సాధ్యం

**- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండయ్య**

వేటపాలెం(చీరాల),మార్చి13 : తిరోగమనంలో ఉన్న రాష్ట్రాన్ని, పురోగమనంలోకి అడుగులు వేయించి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన చారిత్రిక అవసరం ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.ఎం కొండయ్య పిలుపునిచ్చారు. రామన్నపేట పంచాయతీ దంతంవారి కల్యాణ మండపంలో బుధవారం రాత్రి జయహో బీసీ క్లస్టర్ 10 యూనిట్స్, బూత్ ఇన్‌చార్జులు, కుటుంబ సాధికారుల శిక్షణ సమావేశం జరిగింది. సమావేశానికి కొండయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన సంక్షేమ పథకాలను అమలుపరుస్తారన్నారు. వాటికి సంబంధించిన ప్రయోజనాలను వివరించారు. శ్రేణుల సందేహాలను నివృత్తి చేశారు. భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో బొగ్గుల పార్థసారథి, నాసిక వీరభద్రయ్య, షేక్ సుభాని, కౌతవరపు జనార్దనరావు, గుత్తి వీరప్రసాదరావు, చింతా రామకృష్ణారావు, ఉమ్మిటి శంకరరావు, జాగాబత్తుని పోతురాజు, పింజల రేణుకేశ్వరరావు,షేక్ అజీమ్, యర్రా శివనాగమల్లేశ్వరి, బిట్ర చైతన్యకుమార్, ఉసురుపాటి సురేష్, గంజి పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రానైట్ ఫ్యాక్టరీలలో సచివాలయ, ఇంజనీరింగ్ సిబ్బందితో సర్వే చేస్తున్న జిల్లా పరిశ్రమల అధికారి

## గ్రానైట్ పరిశ్రమలపై సర్వే

బల్లికురవ. మార్చి 13 : గ్రానైట్ పరిశ్రమలపై జిల్లా పరిశ్రమల అధికారి ఉమాశంకర్ ఆధ్వర్యంలో బుధవారం సర్వే చేపట్టారు. బల్లికురవ మండలంలో ఉన్న అన్ని గ్రానైట్ ఫ్యాక్టరీల వివరాలను సేకరించేందుకు సచివాలయ అసిస్టెంట్ల సహకారంతో ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఫ్యాక్టరీ యజమాని కులం పేరు, పరిశ్రమ పేరు, ఎంత ఖర్చు చేశారు. ప్రభుత్వం సబ్సిడీ ఎంత ఇచ్చింది వంటి వివరాలను సేకరిస్తున్నారు. ఈ సర్వే ద్వారా జిల్లాలో పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి అన్న వివరాలు తెలిసే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు. ఈసర్వేపై కూడా గ్రానైట్ యజమానులలో తీవ్ర ఆందోళన మెదలైంది. గతంలోనే పరిశ్రమల వివరాలు అధికారుల వద్ద ఉన్నాయని, ఇప్పుడు సర్వే చేపట్టటం ఎమిటని వారు అంటున్నారు. మరో నాలుగు రోజుల పాటు అన్ని ఫ్యాక్టరీలలలో సర్వే కార్యక్రమం జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## మహిళలకు బ్యూటిషన్‌పై ఉచిత శిక్షణ

అద్దంకిటౌన్, మార్చి 13: గ్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు బ్యూటిషన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ హనుమంతరావు తెలిపారు. దీనిపై బుధవారం అద్దంకిలో ఎస్‌జీహెచ్ మహిళలకు అవగాహన కల్పించారు. 15 రోజుల ఉచిత శిక్షణకు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి, పదో తరగతి పాస్ అయి ఉండాలని తెలిపారు. ప్రస్తుతం అద్దంకి, మేదరమెట్ల, ముప్పవరం గ్రామాలలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీపీఎం జి. శరత్‌బాబు, షరీఫ్, మహిళలు పాల్గొన్నారు.



## శింగరకొండ హుండీ ఆదాయం రూ. 21.66 లక్షలు

అద్దంకి, మార్చి13: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం హుండీల కానుకల ద్వారా 21,66,561 రూపాయల ఆదాయం వచ్చింది. హుండీల కానుకల ను బుధవారం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర, పంగులూరు గ్రూపు దేవస్థానాల ఈవో శ్రీనివాసరావుల పర్యవేక్షణలో జరిగింది. డిసెంబరు 13 వ తేదీ నుంచి బుధవారం వరకు హుండీల ద్వారా వచ్చిన కానుకలను లెక్కించారు. విదేశీ కరెన్సీ యుఎస్‌ఏ డాలర్లు 15, ఇంగ్లాండ్ పౌండ్స్ 120 వచ్చినట్లు ఈవో సుభద్ర తెలిపారు.



ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో హుండీల కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

**వంట సామగ్రి ఇచ్చేందుకు ఎస్‌బీఐ ముందుకు..**

శింగరకొండ దేవస్థానం అన్నదానం కిచెన్ ఐటమ్స్, బాయిలర్స్ ఇతర సామా గ్రిని 10 లక్షల రూపాయలతో కొనుగోలు చేసి ఇచ్చేందుకు ఎస్‌బీఐ అధికారులు ముందుకు వచ్చివర్క్ ఆర్డర్ ఇచ్చినట్లు ఈవో సుభద్ర తెలిపారు.

## ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ

ఇంకొల్లు,మార్చి 13: రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునేందుకు పోలీసులు తమ వంతు సహకారం ఉంటుందని ఇంకొల్లు ఎస్సై మల్లిఖార్జునరావు అన్నారు.బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు బుధవారం ఇంకొల్లు ప్రధాన వీధుల్లో బీఎస్‌ఎఫ్, స్థానిక పోలీసు సిబ్బందితో అవగాహనా ర్యాలీ నిర్వహించారు.ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తమవంతు సహకారం ఉంటుందన్నారు.ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు.ఈ ర్యాలీలో ఇంకొల్లు ఎస్సై మల్లికార్జునరావుతో పాటు ఇంకొల్లు పోలీసులు పాల్గొన్నారు.



ఇంకొల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

## కవయిత్రి మొల్లమాంబ జయంతి

అద్దంకిటౌన్, మార్చి 13: శింగరకొండలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ సమీపంలోని శాలివాహన కుమ్మర్ల అన్నదాన సత్రంలో బుధవారం శాలివాహన తొలి అడపడుచు, తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ 585వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అన్నదాన సత్రంలోని ఆమె విగ్రహానికి సత్రం కమిటీ సభ్యులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సత్రం కమిటీ అధ్యక్షుడు కొడిమెల వెంకటేశ్వర్లు, పారెళ్ల బ్రహ్మయ్య, కోశాధికారి కొరపాటి ఏడుకొండలు, గురునాథం, వీరాస్వామి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



మొల్లమాంబ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

### ఆర్థిక సహాయం అందజేత

ఇంకొల్లు,మార్చి 13: ఇంకొల్లు స్టాలిన్‌పేటకు చెందిన పల్లపాటి సురేష్ కుమారుడు ఆశిష్‌కు స్పైనల్ ఆపరేషన్‌కు మండల తెలుగుదేశంపార్టీ నాయకులు,ఇంకొల్లు మాజీ సర్పంచ్ డాక్టరు బోడాల శ్యాంసుందర్ సహకారంతో నాయకులు ఎడ్లూరి దాసు ఆ కుటుంబసభ్యులకు బుధవారం రూ.10వేలు ఆర్థికసహాయం అందజేశారు. .ఈ కార్యక్రమంలో పి.రామారావు,పి.ఇమ్మానుయేల్, వి.బూను,వి.విజయరాజు,మహిళా నాయకులు వి.మమతా,పి.సుధీర్, స్థానిక తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేత**

చినగంజాం, మార్చి 13 : కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన సూరగాని గోపినాథ్ జ్ఞాపకార్థం ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను ఆయన సోదరుడు రామకృష్ణ, స్నేహితులు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి ఎ.హరిబాబు, ఆర్.కే.నాయుడు, తోట అశోకచక్రవర్తి, యశ్వంత్, వై.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు వాసవి క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

చీరాల,మార్చి 13 : వాసవి క్లబ్, వనిత చీరాల నూతన కార్యకర్త ప్రమాణ స్వీకారం గురువారం సాయంత్ర 6.30 గంటలకు ముంతావారి సెంటర్లోని ఎస్‌వీఎస్ అండ్ ఎస్‌జెఆర్ కల్యాణ మండపంలో జరుగుతుందని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లబ్ ప్రతినిధులు, సభ్యులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## 82 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

చినగంజాం, మార్చి 13 : మండలంలోని మోటుపల్లి గ్రామం నుంచి ఎన్.హెచ్.16కు తరలిస్తున్న రేషన్ బియాన్ని కడవకుదురు గ్రామ శివారులో సివిల్ సప్లయ్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం మోటుపల్లి గ్రామం నుంచి ఎన్.హెచ్.16కు తరలిస్తున్న 82 బస్తాలను(50కిలోలలు) కడవకుదురు గ్రామ శివారులో అధికారులు పట్టుకున్నట్లు తెలిపారు. మినీ టాటా ఏసీ వాహనంలో తరలిస్తున్న పీ.డీ.ఎస్. బియాన్ని పట్టుకొని, వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. మోటుపల్లి చెందిన సుంకర వెంకటరావు ఆదేశాల మేరకు మోటుపల్లి నుంచి ఎన్.హెచ్.16 ప్రాంతానికి పీడీఎస్ బియాన్ని తీసుకొని వెళ్తున్నట్లు వాహనం డ్రైవర్ షేక్ నాగుర్ తెలిపారు. సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టాటా ఏసీ మినీలారీ డ్రైవర్ షేక్.నాగుర్, సుంకర వెంకటరావులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## రేపు ఇంకొల్లు సర్పంచ్‌పై విచారణ

ఇంకొల్లు,మార్చి 13: ఇంకొల్లు సర్పంచ్ ఏజర్ల ప్రసన్నపై గతంలో వచ్చిన వివిధ అభియోగాలపై కలెక్టరు ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీన బాపట్ల జిల్లా గ్రామపంచాయతీ అధికారి ఆధ్వర్యంలో విచారణ చేపట్టనున్నట్లు ఈవోఆర్డీ శ్రీనివాసరావు తెలిపారు. పంచాయతీలో సర్పంచ్ ప్రసన్న సంతకాల ఫోర్జరీ చేయడం,ఉన్నతాధికారుల ఆదేశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం,సుమారు రూ. కోటి 70లక్షల నిధుల దుర్వినియోగంపై 3 నెలల పాటు చెక్‌పవర్ రద్దు చేయగా ఈ అంశాలపై వచ్చిన అభియోగాలపై తిరిగి విచారణ చేయనున్నట్లు తెలిపారు.ఈ విచారణలో జిల్లా గ్రామపంచాయతీ అధికారి రాంబాబు, చీరాల డివిజనల్ పంచాయతీ అధికారి పాల్గొంటారని, ఆ సమయంలో బాధ్యులైన అధికారులకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు.

## రైతులకు నాణ్యమైన విద్యుత్తు

చినగంజాం, మార్చి 13 : ప్రభుత్వం వ్యవసాయ రైతులకు తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ని అందిస్తుందని ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అన్నారు. మండలంలోని పెదగంజాం 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం ఆవరణలో విద్యుత్ శాఖ ఏఈఈ పి.గణనారాయణ అధ్యక్షతన బుధవారం జరిగిన సబ్ స్టేషన్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని ఎంపీపీ అన్నారు. రైతుల విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి భాస్కరరావు, సొసైటీ అధ్యక్షులు ఆసోది వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ వై.తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

## గర్భిణులు మంచి పోషకాహారం తీసుకోవాలి

తోటవారిపాలెం(చీరాలటౌన్), మార్చి 13 : గర్భిణులు పోషకాహారంతో మంచి ఆరోగ్యంగా జీవించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ నాదెండ్ల కోటేశ్వరరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తోటవారిపాలెంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులు విశేషంగా హాజరై ఆరోగ్య సూత్రాలను తెలుసుకున్నారు. అంతేకాకుండా త్రుణధాన్యాలతో చేసిన వంటకాలతో ఎగ్జిబిషన్ నిర్వహించారు.



కారంచేడు జగనన్న కాలనీలో తాగిపడేసిన కర్ణాటక మద్యం బ్రాండ్ల కవర్లు (ఇన్‌సెట్లో) ఇన్‌సెట్‌లో కర్ణాటక మద్యం సీసా

## కారంచేడులో కర్ణాటక మద్యం

● **భారీగా చేరిందని ప్రజల్లో జోరుగా చర్చ**

కారంచేడు(పర్చూరు), మార్చి 13: కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం బ్రాండ్లు కారంచేడులో దర్శనమిస్తున్నాయి. కుప్పలు తెప్పలుగా తాగి పడేసిన బాటిళ్లు దర్శనమివ్వటంతో భారీగా కర్ణాటక మద్యం కారంచేడుకు చేరిందన్న చర్చ జోరుగా సాగుతుంది. బుధవారం కారంచేడు జగనన్న కాలనీలో తాగి పడేసిన ఆ రాష్ట్ర మద్యం బ్రాండ్ సిల్వర్ కప్ తాలూకు 90 ఎంఎల్ ప్యాకెట్‌లు మీడియా కంటపడ్డాయి. దీంతో కర్ణాటక మద్యాన్ని భారీగా కారంచేడు తెచ్చారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇలా ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం బ్రాండ్లు విచ్చలవిడిగా కంట పడటం సర్వత్రా చర్చగా మారింది. ఇప్పటికే గ్రామ గ్రామాన బెల్ట్ షాపులు జోరుగా సాగుతున్న తరుణంలో ఇలా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం కూడా వస్తున్నట్లు కనిపించటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జోరుగా అక్రమ మద్యం విక్రయాలు కుటీర పరిశ్రమలుగా సాగుతున్నా పట్టించుకోని సెబ్, పోలీసు అధికారులు ఇతర రాష్ట్రానికి చెందిన మద్యాన్ని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది.

## మోటార్‌సైకిల్ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

అద్దంకి, మార్చి13: మోటార్‌సైకిల్ ఢీ కొనటంతో వాకింగ్ చేస్తున్న వృద్ధుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని న్యూ ఎస్‌బీఐ కాలనీలో నివాసం ఉంటున్న వేలమూరిపాడుకు చెందిన తొట్టెంపూడి నాగేశ్వరరావు బుధవారం సాయంత్రం రామ్‌నగర్ సెంటర్ నుంచి నాగులపాడు రోడ్డు వైపు వాకింగ్ వెళ్తుండగా నాగులపాడు వైపు నుంచి వచ్చిన మోటార్‌సైకిల్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనం లో స్థానిక ప్రవేట్ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు. మోటార్‌సైకిల్‌పై ఉన్న యువకుడు శివయ్య మద్యం మత్తులో వేగంగా వచ్చి వృద్ధుడిని ఢీ కొట్టడంతో పాటు సమీపంలో నిలిపి ఉన్న మరో రెండు మోటార్‌సైకిళ్లనూ ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో శివయ్యకు కూడా గాయాలు కావటంతో 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, మార్చి13: అద్దంకి పట్టణంలో చేపడుతున్న విద్యుత్‌లైన్‌ల అభివృద్ధి పనులలో భాగంగా గురువారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు దక్షిణ అద్దంకి పరిధిలోని వాసవినగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఏఈ శివ ప్రసాద్ తెలిపారు.


### నేడు జనసేనపార్టీ ఆవిర్భావ వేడుకలు


వేటపాలెం(చీరాల),మార్చి 13 : మండలంలోని దేశాయిపేట జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు ఆ పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనసేనతో పాటు, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.



## సోమశిలలో 13.182 టీఎంసీల నిల్వ

**అనంతసాగరం :** సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా బుధవారం నాటికి జలాశయంలో 13.182 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1600, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.





# డబ్బులిస్తే ఎక్కడికైనా..!

### దొడ్డిదారిలో ఉపాధ్యాయ బదిలీలు

సీల్డు కవర్‌లో ఉత్తర్వులు

జిల్లాలో ఇప్పటికి 49 మందికి సిఫార్సు లేఖలు

బ్లాక్ చేసిన ఖాళీలు.. పదోన్నతుల్లో పోస్టింగులు

గుట్టుచప్పుడు కాకుండా ఆదేశాలు

**మీరు ప్రభుత్వ టీచరా!? కోరుకున్న చోటకు బదిలీ కావాలనుకుంటున్నారా !? ఇంకెందుకు ఆలస్యం.. మీ దగ్గర డబ్బు, ఓ ప్రజాప్రతినిధి సిఫారసు లేఖ ఉంటే చాలు. వెంటనే పనైపోతుంది. అదెలాగంటారా..!?**

దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవడం అంటే ఇదేనేమో! అతిత్వరలో ఎన్నికల కోడ్ వస్తున్న నేపథ్యంలో ఈలోపు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు దొడ్డిదారిన టీచర్ల బదిలీలకు తెరలేపారు. పలుకుబడి ఉన్నవారికి, సిఫార్సు లేఖలతో అభ్యర్థించిన వారికి, నగదు సమర్పించుకున్న వారికి కోరుకున్న చోటకు రెగ్యులర్ బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు సమాచారం. జిల్లాలో ఇప్పటివరకు రెండు విడతలుగా 49 మంది వరకు సిఫార్సు బదిలీలకు సిద్ధమవడంతో తొలుత వీటిని జిల్లా విద్యా శాఖ అధికారులు తిరస్కరించినా, రాజకీయ, అధికార ఒత్తిళ్లతో తలొగ్గాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో బ్లాక్ చేసిన ఖాళీలు, పదోన్నతుల్లో ఏర్పడిన ఖాళీల్లో పోస్టింగ్‌ల ఉత్తర్వులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఇలా ఎన్నికల కోడ్ వచ్చే వరకు ప్రతిరోజూ ఉత్తర్వులు వస్తాయని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. పైగా ఈ ఉత్తర్వుల్లో ఏప్రిల్ 30వతేదీ వరకు ప్రస్తుత పాఠశాలల్లో పనిచేసి మే 1న కొత్త పాఠశాలల్లో చేరాలని ఉండటం గమనార్హం.

**నెల్లూరు (విద్య), మార్చి 13 :** జిల్లాలో గత ఏడాది జూన్‌లో జరిగిన సాధారణ బదిలీల్లో దాదాపు 4వేల మంది ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగింది. జీఓ నెం.117 ఉత్తర్వులు, పాఠశాలల విలీనం, రేషనలైజేషన్ తదితర కారణాలతో పలువురు టీచర్లు సుమారు 100 నుంచి 200 కి.మీ దూరంలోని పాఠశాలలకు బదిలీ కావాల్సి వచ్చింది. ఈ నిబంధనలను సవరించాలని దూరప్రాంతాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని వేడుకున్నా పట్టించుకోలేదు. దీనికి భిన్నంగా గతంలో కొన్ని దొడ్డిదారి బదిలీలు చేపట్టగా ఉపాధ్యాయ సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. అయినా కొన్ని జరిగిపోగా తాత్కాలికంగా మరికొన్నింటికి బ్రేక్ వేశారు. తాజాగా ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో ఇదే అదునుగా దొడ్డిదారిన బదిలీలను చేపడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం నుంచి బదిలీ ఆర్డర్లను తెచ్చుకున్న వారంతా పలుకుబడి, అధికారపక్షం అండదండలున్న వారేనని, బ్లాక్‌చేసిన వ్యాకెన్సీలు, పదోన్నతుల కారణంగా ఏర్పడిన ఖాళీల్లో వీరిని నియమించేందుకు రహస్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఉపాధ్యాయ వర్గాలు భగ్గుమంటున్నాయి.

**● ఆపకుంటే ఆందోళనలే : యూటీఎఫ్**

ఉపాధ్యాయుల సిఫార్సు బదిలీలను నిలిపి వేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వివి.శేషులు, జీవీ.చలపతిశర్మ డిమాండ్ చేశారు. ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసి సాధించుకున్న బదిలీల కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ ప్రభుత్వమే తమ విధానాలకు తిలోదకాలిస్తోందన్నారు. ఓ వైపు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఖాళీ పోస్టులను ప్రకటించారని, మరోవైపు ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్న సమయంలో హడావుడిగా పైరవీలతో బదిలీలు చేపట్టడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ బదిలీల్లో లక్షల రూపాయలు చేతులు మారాయన్న సమాచారం తమ వద్ద ఉందన్నారు. కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడిచే నగదు బదిలీలను వెంటనే నిలిపివేయాలని, లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

**● టీచర్ల గగ్గోలు**

బదిలీలు కోరుకున్న వారంతా స్థానికంగా ప్రజా ప్రతినిధుల నుంచి లేఖలు తీసుకుని రాష్ట్ర కార్యాలయం వద్దకు వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన అనధికార కౌంటర్‌లో నగదు చెల్లించాలి. అక్కడ నుంచి ఉత్తర్వులు జిల్లాకు వచ్చిన అనంతరం ఇక్కడ కూడా కొంత ముట్టచెప్పి కోరుకున్న స్థానానికి బదిలీ చేయించుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకేస్థానంలో ఎక్కువ కాలం పని చేస్తున్నవారు, గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న వారు ఈ అక్రమ బదిలీలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగర, పట్టణ ప్రాంతాల్లోని పోస్టులన్నీ ఇలా అడ్డదారిన భర్తీ చేస్తుంటే సాధారణ బదిలీ ప్రక్రియ జరిగే సమయంలో తమకు పూర్తిగా అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్య సమస్యలు, ప్రత్యేక కారణాలతో అసాధారణ పరిస్థితుల్లో ఉపయోగించుకోవాల్సిన ప్రభుత్వ ఉత్తర్వుల బదిలీలను ఏకంగా కౌంటర్ తెరిచి అడ్డగోలుగా చేపడుతుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై విద్యాశాఖాధికారులు కూడా స్పష్టతనిచ్చారు. బదిలీ జీఓలు జిల్లాకు వచ్చిన మాట వాస్తవమేనని, అయితే అన్ని ఉత్తర్వులు సీల్డ్ కవర్స్‌లో తమకు అందాయని, వాటిలో ఎస్‌జీటీల ఉత్తర్వులను సంబంధిత ఎంఈఓలకు, స్కూల్ అసిస్టెంట్ ఉత్తర్వులను సంబంధిత డిప్యూటీ ఈఓలకు అందచేశామన్నారు. వీటిని ఆయా డిప్యూటీ ఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు పరిశీలించుకుని వారికి ఉత్తర్వులు అందచేస్తారని తెలిపారు.

## నామినేషన్ల వరకు ఓటరుగా నమోదు..

### రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్

**నెల్లూరు (హరనాథపురం) :** ఎన్నికల నామినేషన్ల వరకు ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ హరి నారాయణన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. జిల్లాలో ఇప్పటివరకు 19,22,669 మంది ఓటర్లు ఉన్నారని, జనవరి 22వ తేదీ నాటికి ఓట్ల తొలగింపులు, చేర్పుల కోసం 79,690 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. వీటిలో 68,291 అర్జీలను అంగీకరించగా, 10958 అర్జీలను తిరస్కరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో టి.బాపిరెడ్డి, టీడీపీ ప్రతినిధి రసూల్, హరికృష్ణ, సురేంద్రబాబు, బీజేపీ ప్రతినిధి బి.శ్రీనివాసులు, వైసీపీ ప్రతినిధి జి.నారాయణ, బీఎస్పీ నుంచి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఏఏ చట్టం వద్దే వద్దు!

**నెల్లూరు (వైద్యం) :** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) ను వ్యతిరేకిస్తూ నెల్లూరులో బుధవారం వామపక్షాలు నిరసన ప్రదర్శన నిర్వహించాయి. ఆత్మకూరు బస్టాండ్ నుంచి గాంధీబొమ్మ వరకు ఈ ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రైతు చట్టాలను, నిరుద్యోగులకు ఉపాధి వంటి హామీలు నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ప్రజలను పక్కదోవ పట్టించేందుకు ఇలాంటి చట్టాలు తీసుకు వస్తున్నారని మండిపడ్డారు. సీఏఏ వంటి చట్టాన్ని అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ నిరసనలో వామపక్ష పార్టీల నాయకులు దామా అంకయ్య, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, ప్రసాద్, శ్రీనివాసులు రెడ్డి, షేక్ రషీద్, పౌరహక్కుల జిల్లా కార్యదర్శి ఎల్లంకి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




నిరసన ప్రదర్శనలో పాల్గొన్న వామపక్ష నాయకులు

# గవర్నర్ పర్యటన ప్రశాంతం

- వర్చువల్‌గా 'పీఎం సూరజ్' ప్రారంభం
- అబ్దుల్ నజీర్‌తోపాటు పాల్గొన్న ప్రముఖులు
- లబ్ధిదారులతో కలిసి ప్రధాని ప్రసంగం వీక్షణ



లబ్ధిదారులకు స్త్రీ నిధి పత్రాలు అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

**నెల్లూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా ప్రారంభించిన పీఎం సూరజ్ పోర్టల్ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఇందుకు నెల్లూరులోని శ్రీవెంకటేశ్వర కస్తూరిబా కళాక్షేత్రం వేదికైంది. బుధవారం ఢిల్లీ నుంచి ప్రధాని మోదీ పీఎం సూరజ్ పోర్టల్‌ను ప్రారంభించి, దేశవ్యాప్తంగా పలు పథకాల లబ్ధిదారులతో ముచ్చటించగా, ఆ కార్యక్రమంలో నెల్లూరు నుంచి గవర్నర్‌పాల్గొన్నారు. ఈయనతోపాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఎం హరినారాయణన్, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయ కృష్ణన్ కూడా పాల్గొన్నారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో కలిసి గవర్నర్, ప్రధానమంత్రి ప్రసంగాన్ని వీక్షించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన గవర్నర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్త్రీ నిధి, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ లబ్ధిదారులకు చెక్కులను గవర్నర్ పంపిణీ చేశారు. అలానే సఫాయి కార్మికులకు పీపీఈ కిట్లు, అర్హులకు ఆయుష్మాన్ భారత్ కార్డులను కూడా అందజేశారు. చివరగా గవర్నర్ నజీర్‌కు జిల్లా తరఫున మంత్రి, జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్‌లు ప్రత్యేక బహుమతిని బహూకరించారు. అంతకముందు గవర్నర్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించారు. చేతివృత్తులదారులతో ఆయన ముచ్చటించారు. కాగా బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు విజయవాడ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో నెల్లూరు పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్న గవర్నర్ దంపతులకు జిల్లా అధికార యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. మంత్రి కాకాణి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆనం అరుణమ్మ, పొట్లూరి స్రవంతి, కలెక్టర్, ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. సాయంత్రం ఐదు గంటలకు తిరిగి విజయవాడకు గవర్నర్ పయనమయ్యారు. కాగా, గవర్నర్ సతీమణి సమీరా నజీర్ అదానీ కృష్ణపట్నం పోర్టును సందర్శించారు.



**● పటిష్ఠ బందోబస్తు**

**నెల్లూరు (క్రైం) :** పటిష్ఠ బందోబస్తు నడుమ బుధవారం నెల్లూరులో గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటన సాగింది. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పర్యవేక్షణలో నగరంలో గవర్నర్ పర్యటించే ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకొని డాగ్‌స్క్వాడ్, బాంబ్‌స్క్వాడ్‌లు తనిఖీలు చేపట్టాయి. కస్తూర్బా కళాక్షేత్రం వద్ద పోలీసు అధికారుల నుంచి గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు.

## 'తెలుగు గంగ'లో వాటర్ వార్!

- రాధాకృష్ణకు ఎఫ్ఏసీ బాధ్యతల తొలగింపు
- టీజీపీ ఎస్ఈగా సోమశిల ఈఈ రమణారెడ్డి

**నెల్లూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) :** ప్రాజెక్టుల్లో నీటి కొరత ఇరిగేషన్ అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అధికారిక ఆయకట్టుకు నీరిచ్చాక, తాగునీటిని దృష్టిలో పెట్టుకోవాలని అధికారులు సూచిస్తుంటే.. లేదు లేదు అనధికార ఆయకట్టుకు కూడా నీరివ్వాలంటూ వైసీపీ నేతలు పట్టుబడుతున్నారు. దీంతో ఒక్కసారిగా పరిస్థితులు వేడెక్కుతున్నాయి. ఒక నియోజకవర్గంలో అనధికార ఆయకట్టుకు ఇస్తే, మరో నియోజకవర్గ నేతలు కూడా తమకూ ఇవ్వాలంటూ ఒత్తిడి తెస్తుండటంతో తెలుగుగంగ ప్రాజెక్టులో వాటర్ వార్ జరుగుతోంది. దీని ఫలితంగానే ఇన్‌చార్జ్ ఎస్ఈగా ఉన్న రాధాకృష్ణమూర్తిని నెల రోజులు తిరగకముందే ఆ బాధ్యతల నుంచి తప్పించినట్లు ఆ శాఖలో చర్చించుకుంటున్నారు. కొత్తగా టీజీపీ ఎస్ఈ బాధ్యతలను సోమశిల ప్రాజెక్ట్ ఆత్మకూరు ఈఈ రమణారెడ్డికి అప్పగించారు. రాధాకృష్ణమూర్తి బుధవారం రిలీవ్ అవ్వగా రమణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. తెలుగుగంగ ప్రాజెక్టులో సుదీర్ఘంగా పనిచేసి ప్రస్తుతం అదే సర్కిల్‌లో వెంకటగిరి ఈఈగా పనిచేస్తున్న రాధాకృష్ణమూర్తినే నీటి యాజమాన్యం చేయలేక పోయారంటే, ఇక ఆ ప్రాజెక్టుతో సంబంధం లేని రమణారెడ్డి ఎలా చేస్తారంటూ ఆ శాఖ ఉద్యోగులు చర్చించుకోవడం గమనార్హం. కండలేరులో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకు దగ్గరగా ఉన్నాయి. ఆ ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం మనుబోలు సిస్టం చెరువులకు అధికారిక ఆయకట్టు కింద నీరు ఇస్తున్నారు. అలానే గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ మార్గమధ్యలో అనధికార ఆయకట్టుకు నీటిని తోడేస్తున్నారు. దీంతో అధికారిక ఆయకట్టు సాగు చివరి దశకు చేరుకుంటుండడంతో కొన్ని ప్రాంతాల్లో నీరు అందడం లేదు. ఆ ప్రాంత రైతుల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. అలానే తాగునీరు కూడా చివరకు వరకు సరిపడా చేరడం లేదు. దీంతో నీటి విడుదల పెంచాలంటూ టీజీపీ అధికారులపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. కానీ ప్రస్తుతం కండలేరులో ఉన్న నీరు అధికారిక ఆయకట్టు పోను తాగునీటికి ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఉన్న నీటిని సాగుకు ఇచ్చేస్తే రేపు వేసవిలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందంటున్నారు. కానీ వచ్చే నెలలో ఎన్నికలు ఉండడంతో ముందు సాగుకు నీరిచ్చేయండి.. తాగునీటికి ఆ తర్వాత చూసుకుందాం.. అంటూ అధికారులపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. ఇలా చేస్తే రేపు తాము బోనులో నిలబడాల్సి ఉంటుందని అధికారులు భయపడుతున్నారు. ఈ కారణంగానే రాధాకృష్ణమూర్తిని ఇన్‌చార్జి ఎస్ఈ బాధ్యతల నుంచి తొలగించినట్లు ఇరిగేషన్ శాఖలో ప్రచారం జరుగుతోంది.

### రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం) : 6.27
సహరి (శుక్రవారం) : 4.53

## బర్డ్ ఫ్లూ: అప్రమత్తంగా ఉండండి

**● కేంద్ర నిపుణుల బృందం సభ్యులు**

**నెల్లూరు (వ్యవసాయం), మార్చి 13 :** బర్డ్ ఫ్లూ వైరస్‌పై అప్రమత్తంగా ఉండాలని కేంద్ర నిపుణుల కమిటీ బృందం సభ్యులు పశుసంవర్ధక శాఖ జాయింట్ కమిషనర్ డాక్టర్ విజయ కుమార్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ మనోజ్‌కుమార్‌లు పశువైద్యులకు సూచించారు. జిల్లాలో బర్డ్ ఫ్లూ కేసులు నమోదైన నేపథ్యంలో బుధవారం రాత్రి నెల్లూరు రైల్వేఫీడర్సు రోడ్డులోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో పశువైద్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వైరస్ లక్షణాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు. అనుమానం వస్తే వెంటనే నమూనాలు సేకరించాలని, ఆయా గ్రామాలతోపాటు చుట్టుపక్కల గ్రామాలను సైతం అప్రమత్తం చేయాలని చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఆర్‌డీడీఎల్ సైంటిస్ట్ (బెంగళూరు) డాక్టర్ శంకర్, పశుసంవర్ధక శాఖ జేడీ మహేశ్వరుడు, డీడీలు నాగమణి, కోటేశ్వర రావు, పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ చైతన్యకిషోర్, పశువైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బృందం సభ్యులను శాలువాతో సత్కరించారు. కాగా, బర్డ్ ఫ్లూ వైరస్ నమోదైన పొదలకూరు మండలం చాటగుట్ల, బిరుదవోలు, కోవూరు మండలం గుమ్మలదిబ్బ ప్రాంతాల్లో కేంద్ర నిపుణుల బృందం పర్యటించింది. బర్డ్ ఫ్లూ నివారణకు తీసుకున్న చర్యలను పరిశీలించి, నమూనాలు సేకరించారు.



బిరదవోలులో శాంపిళ్లను సేకరిస్తున్న మనోజ్‌కుమార్

## పొదుపు మహిళలకు చీరల తాయిలాలు

**నెల్లూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) :** సాధారణంగా పోలింగ్‌కు ఒకటి రెండు రోజులకు ముందు ఓటర్లకు తాయిలాలు పంచడం చూశాం. అయితే వైసీపీ ఆవిర్భావం తరువాత తాయిలాల పంపిణీ విధానంలో కూడా అడ్వాన్స్ మెథడ్ అనుసరిస్తోంది. ఎన్నికల సమయంలో తాయిలాలు పంపిణీ చేయాలంటే చాలా అడ్డంకులు ఉంటాయి. ప్రభుత్వ సిబ్బందిని ఆ పనికి వినియోగించుకోవాలంటే చాలా కష్టం. ఈ క్రమంలో నోటిఫికేషన్‌కు ముందే వారిని వాడేసుకోవాలని అధికార పార్టీ అనుకుందేమో పని మొదలు పెట్టేసింది. ప్రజలకు దగ్గరగా ఉండే, ప్రజలతో నిత్యం టచ్‌లో ఉండే వలంటీర్లను, మెప్మా సిబ్బందిని ఇందుకు వినియోగించుకొంటోంది.

**అనుమానించినట్లే జరుగుతోంది. వలంటీర్ల వ్యవస్థను, మెప్మా సిబ్బందిని అధికార పార్టీ ఎన్నికల ప్రలోభాల పర్వాలకు వాడుకుంటుందని ప్రతిపక్షాలు ఆరోపించినట్లే జరుగుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందే తెలుగుదేశం పార్టీకి పట్టున్న ప్రాంతాల్లో మహిళలను ప్రసన్నం చేసుకోవడానికి మెప్మా, వలంటీర్ల ద్వారా తాయిలాలు పంచి పెడుతున్నారు. మహిళలు అత్యంత ప్రీతి పాత్రంగా భావించే చీరలతో తాయిలాల పర్వాన్ని మొదలు పెట్టారు. మెప్మా రిసోర్స్‌పర్సన్స్ (ఆర్పీ), వలంటీర్ల ద్వారా పొదుపు సంఘ మహిళలకు అందజేస్తున్నారు. నెల్లూరుతోపాటు జిల్లా వ్యాప్తంగా ఈ తరహా చీరల పంపిణీ మొదలైనట్లు సమాచారం.**

**● చైన్ లింకులా..**

అధికార పార్టీ అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టే పనిలో భాగంగా కొత్త విధానం ఎంచుకున్నారు. అధికార పార్టీ నాయకులు తమ నిధులతో చీరలు కొనుగోలు చేస్తారు. అవి మెప్మాకు చేరుతాయి. ఆ శాఖ అధికారుల పర్యవేక్షణలో రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ)లకు చేరుతాయి. వారు ఆ చీరలను తమ పరిధిలోని వలంటీర్లను వెంట బెట్టుకొని డ్వాక్రా సంఘ లీడర్ ఇంటికి చేరుస్తారు. ఆ లీడరు తన గ్రూప్ పరిధిలోని సభ్యులకు చీరలను పంపిణీ చేస్తుంది. ఇదీ పంపకాల చైన్. నెల్లూరులో గత వారం రోజులుగా చీరల పంపిణీ జోరుగా సాగుతోంది. చీరల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకరరెడ్డి స్వయంగా ప్రారంభించడం విశేషం.



నెల్లూరులో పొదుపు మహిళలకు చీరలు అందజేస్తున్న ఎంపీ ఆదాల (ఫైల్)

**● జిల్లావ్యాప్తంగా ఇదే తంతు**

ఎన్నికల కోడ్‌కు ముందే ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమం జిల్లావ్యాప్తంగా అన్ని పట్టణాల్లో మొదలైనట్లు సమాచారం. మెప్మా పరిధిలో 14,200 పొదుపు సంఘాలు ఉండగా, 1.30లక్షల మంది సభ్యులు ఉన్నారు. తొలుత నెల్లూరులో ప్రారంభమైన ఈ వ్యవహారం క్రమక్రమంగా అన్ని మున్సిపాలిటీల్లో మొదలు పెట్టినట్లు సమాచారం. ఆ తరువాత డీఆర్‌డీఏ పరిధిలోని గ్రామీణ ప్రాంత డ్వాక్రా సంఘ సభ్యులకు కూడా ఇదే తరహాలో చీరల తాయిలాలు అందించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల కోడ్ ఇంకా రాలేదు కాబట్టి ఈలోగా నిర్భయంగా, నిరాటంకంగా ఈ తొలి విడత తాయిలాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వ విధుల్లో ఉన్న సిబ్బంది ద్వారా నిర్విఘ్నంగా పూర్తి చేయించడానికి అధికార పార్టీ తొందరపడుతోందని తెలిసింది.

# మరుగుదొడ్లు లేక ఇక్కట్లు

● ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే మహిళల అగచాట్లు

**ఉదయగిరి, మార్చి 13:** పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రజలకు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మహిళల బాధలు వర్ణనాతీతం. పట్టణంలో తహసీల్దారు కార్యాలయంతో పాటు అదే ప్రాంగణంలో సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ, బీఎస్ఎన్ఎల్, ఇండేన్ గ్యాస్, పోలీస్‌స్టేషన్ తదితర కార్యాలయాలు ఉన్నాయి. వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు మరుగుదొడ్లు లేక అగచాట్లు పడుతున్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంతోపాటు పొదుపు, హౌసింగ్, విద్యాశాఖ, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉపాధి, కొట్టాలపల్లి సొసైటీ, ఇరిగేషన్ తదితర శాఖల కార్యాలయాలు ఉన్నాయి. అక్కడికి వచ్చే ప్రజలు సైతం మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు. కొన్నేళ్లుగా మరుగుదొడ్లు లేక ప్రజలు పాడుపడి నిరుపయోగంగా ఉన్న భవనాలు, ఖాళీ ప్రదేశాలను వాడుకుంటున్నారు. మహిళలైతే ఖాళీ ప్రదేశంలోని కంపచెట్లను ఆశ్రయించక తప్పడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయాలకు వచ్చే ప్రజల కోసం మరుగుదొడ్లు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.


మరుగుదొడ్డిగా ప్రజలు వాడుకుంటున్న పాత భవనాలు

## మొల్లమాంబ జయంతి


మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

**ఉదయగిరి, మార్చి 13:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రముఖ కవయిత్రి మొల్ల మాంబ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఎంపీడీవో ఈశ్వరమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి, ఏపీవో శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాగరంలో భద్రతా బలగాల కవాతు


అనంతసాగరంలో కవాతు నిర్వహిస్తున్న బలగాలు

**అనంతసాగరం, మార్చి 13:** మండలంలోని ఇస్కపల్లి, రేవూరు, మినగల్లు, అనంతసాగరంలో బుధవారం కేంద్ర భద్రతా బలగాలు కవాతు నిర్వహించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న క్రమంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈకార్యక్రమం నిర్వహించినట్లు అనంతసాగరం ఎస్ఐ సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు.

## పౌష్టికాహారంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సీడీపీవో లావణ్య

**ఉదయగిరి రూరల్, మార్చి 13:** చిన్నారులు, బాలింతలు గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవా లని సీడీపీవో పచ్చవ లావణ్య సూచించారు. బుధవారం మండలంలోని గండిపాళెం సెక్టార్ పరిధి వెంగళరావునగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతి, సూపర్‌వైజర్ తేజస్విని, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వలంటీర్లకు సన్మానం


వలంటీర్లకు అవార్డులు అందజేస్తున్న ఎంపీడీవో

**వింజమూరు, మార్చి 13:** వింజమూరు మండలంలోని సచివాలయ పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లను బుధవారం ఘనంగా సన్మానించారు. వింజమూరు పంచాయతీ పరిధిలోని ఏడు సచివాల యాలకు సం బంధించిన వాలంటీర్లను సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉదయగిరి నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరై అవార్డు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేష్‌బాబు, జడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి, చైర్మన్ మలిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ రేవునూరి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ ఎస్ సుజన, వైసీపీ నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాసంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ప్రత్యూష సుబ్బారావు

**ఉదయగిరి రూరల్, మార్చి 13:** మండలంలోని గండిపాళెం బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై ప్రత్యూష సుబ్బారావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ ఉపాధ్యక్షుడు సుమన్, ప్రిన్సిపాల్ పుష్పరాజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరిక


గంగపట్నం చంద్రశేఖరయ్యతో సమావేశమైన ఆనం రామనారాయణరెడ్డి

**సంగం, మార్చి 13:** మండలంలోని మర్రిపాడు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు బుధవారం నెల్లూరులోని ఆనం రామనారాయణరెడ్డి ఇంటికి వెళ్లి ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు పులిబోయిన హరి ఆధ్వర్యంలో గ్రామ ఉపసర్పంచ్ ముడి పార్థసారథి, వార్డు సభ్యులు మరుబోయిన వెంకటేశ్వర్లు, ఖాశీం, కె పెంచలయ్యతోపాటు పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆనం రామనారాయణరెడ్డి వీరికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మండలంలోని మక్తాపురంలో వైసీపీ నేత మోహన్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, జక్కా సుబ్బారెడ్డి, దుస్యంత్‌రెడ్డిని కలిసి టీడీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అలాగే వైసీపీ మండల నాయకులు, మాజీ జడ్పీటీసీ గంగపట్నం చంద్రశేఖరయ్య, పడమటిపాళెం సర్పంచు, మండల వైసీపీ సీనియర్ నాయకులు కోటంరెడ్డి బాలకృష్ణారెడ్డిని, వంగల్లుకు చెందిన వైసీపీ అసంతృప్తి నాయకుడు పగడాల రఘురామయ్యను కలిసి టీడీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జి శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచు రఘురామయ్య, వైసీపీ అసంతృప్త సంగం, వెంగారెడ్డిపాలెం నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఆనం ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే మేకపాటితో మన్నేటి చర్చలు

**ఉదయగిరి రూరల్, మార్చి 13:** నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితులపై మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డితో ఉదయగిరిలోని తన నివాసంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి, పలువురు టీడీపీ నాయకులు బుధవారం చర్చించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అధిష్ఠానం నిర్ణయించిన టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను గెలిపించేందుకు కష్టపడి పని చేయాలని నిర్ణయించారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న అధికారులు

**ఉదయగిరి రూరల్, మార్చి 13:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ ఆధ్వర్యంలో ఉదయగిరి పట్టణంలో బుధవారం అధికారులు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక తహసీల్దారు కార్యాలయం నుంచి మోటార్ బైక్‌లతో పంచాయతీ బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. ర్యాలీని ఆర్వో రాజా రమేష్‌ప్రేమ్‌కుమార్, ఏఆర్వో నెహ్రూబాబులు జెండా ఊపి ప్రారంభించారు. ఓటు వజ్రాయుధం లాంటిదని, అమ్ముకోవద్దని, ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి బాలకేశవులు, అసిస్టెంట్ నోడల్ అధికారి ఖాజారంతుల్లా, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పూర్తి చేయాలి

**ఉదయగిరి, మార్చి 13:** మండలంలోని 12 సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ రెండు రోజుల్లో పూర్తిచేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ బుధవారం తెలిపారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పేదలకు ఆరోగ్యశ్రీ కార్డులను వలంటీర్లు పంపిణీ చేసి ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు.

## పంచాయతీ కార్యదర్శికి సన్మానం


నాగిరెడ్డి గోవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న సర్పంచి

**సీతారామపురం, మార్చి 13 :** మండలంలోని గుండుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా, సీతారామపురం బిట్-1 సచివాలయానికి ఇన్‌చార్జ్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహి స్తున్న నాగిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి అంతర్ జిల్లాల బదిలీల్లో భాగంగా కడప జిల్లా అట్లూరు మండలానికి బదిలీ అయిన సందర్భంగా సీతారామపురం సర్పంచ్ భాగ్యకుమారి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డి రాం నాథ్‌రెడ్డి, సీతారామపురం కార్యదర్శి జీవన్‌కుమార్, చిన్నాగంపల్లి కార్యదర్శి పిడుగు రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎన్నికల సిబ్బందికి శిక్షణ

**ఉదయగిరి :** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం ఎన్నికల సిబ్బందికి సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నెహ్రూబాబు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం యంత్రాల పనితీరుపై సెక్టారు హోమ్ ఓటింగ్ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

### పరిశ్రమల ఏర్పాటుకు సహకారం

**ఆత్మకూరు, మార్చి 13 :** నియోజకవర్గంలోని ఎంఎస్ఎంవి పార్కులో చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటు చేసే ఔత్సాహిక పారిశ్రామవేత్తలకు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక శ్రీధర్ గార్డెన్స్‌లో ఆయన ఏపీఐఐసీ, హెచ్‌డీఎఫ్‌సి బ్యాంకు ప్రతినిధులతో కలిసి పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయ సమాశ మందిరంలో మెప్మా ఆధ్వర్యంలో వైఎస్ఆర్ చేయూత సంబరాలలో పాల్గొని పొదుపు మహిళలకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లులా, చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్లు డాక్టర్ కెవి శ్రావణకుమార్, షేక్ సర్దార్, జేసీ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మెప్మా సిఎంఎం వి అంకయ్య, సీఓ మాధవి, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబానికి పరామర్శ

**ఉదయగిరి రూరల్, మార్చి 13:** మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు బసిరెడ్డి బాలిరెడ్డి అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### డీసీపల్లిలో పొగాకు ధరలు

**మర్రిపాడు, మార్చి 13:** డీసీపల్లి పొగాకు బోర్డులో బుధవారం కనిష్ఠ, గరిష్ఠ ధరలు కేజీ రూ. 230 పలికాయి. రైతులు బోర్డుకు 325 బేళ్లను తీసుకొని రాగా, 12 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 308 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 17 బేళ్లను తిరస్కరించినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.



## అందుబాటులో లేని రెవెన్యూ సిబ్బంది

● ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజల ఇక్కట్లు



**కలిగిరి, మార్చి 13:** సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ గడువు సమీపిస్తుండటంతో తహసీల్దారు కార్యాలయ సిబ్బంది శిక్షణకు వెళ్తున్నామన్న కారణంతో కార్యాలయంలో ఎవరూ అందుబాటులో ఉండడం లేదు. దీంతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు నెలలు తరబడి తిరగాల్సి వస్తోంది. నిర్ణీత గడువులోపు అవి అందకపోవడంతో తమ పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో వాటి కోసం కావలి ఆర్డీవో కార్యాలయానికి వెళ్లాల్సివస్తుం దని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే భూములకు సంబంధించి నోషనల్ ఖాతాలు వెబ్‌ల్యాండ్‌లో పూర్తిస్థాయిలో పనిచేయకపోవడం వలన మ్యుటేషన్ సర్వీసు చేసుకోవడానికి వీలు కావడంలేదని రైతులు పేర్కొంటున్నారు.

## అయిన వారి కోసం అడ్డదిడ్డంగా డ్రైనేజీ పనులు


పోలువారివీధిలో కాలువను వదిలి సీసీ రోడ్డును పగులకొడుతున్న ఎక్స్‌కవేటర్

**కావలి, మార్చి13:** పట్టణంలోని పోలువారివీధిలో అ యిన వారి కోసం అడ్డదిడ్డంగా డ్రైనేజీ పనులు చేపడుతు న్నారు. దీంతో బుధవారం స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ వీధిలో డ్రైనేజీ మంజూరు చేయగా, నిర్మాణ ప నులను అధికారపార్టీ నేత ప్రారంభించారు. అయిన వారి కోసం డ్రైనేజీని అష్టవంకరలు తిప్పుతున్నారు. దీనిపై స్థాని కులు అభ్యంతరం చెప్పటంతో ఇటీవల పనులు ఆపివే శారు. తిరిగి బుధవారం ఎక్స్‌కవేటర్ తీసుకు వచ్చి పాత డ్రైనేజీని దాని పక్కన సీసీ రోడ్డును తవ్వుతుండటంతో స్థా నికులు అభ్యంతరం చెప్పారు. ఈ విషయంపై మున్సిప ల్ డీఈ సాయిరాంను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి కూడా వచ్చిందని, అక్కడకు వెళ్లి పరిశీ లించి తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

## దూబగుంటలో పౌష్టికాహార పక్షోత్సవం


దూబగుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్, ఆయాలు

**కందుకూరు, మార్చి 13:** మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార పక్షోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నల్లపు మాధవి, బేబీ రూఫ్సీ, స్వాతి, సునీత, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

**వలేటివారిపాలెం :** గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో శర్మిష్ఠ తెలిపారు. మండలంలోని నూకవరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడిలో భాగంగా బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వలన రక్తహీనత దూరమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, టీచరు రాజకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మీ, అలేఖ్య పాల్గొన్నారు.

**కావలి:** పట్టణంలోని క్రిష్టియన్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు రక్తహీనత, కండరాల అభివృద్ధి, సృజనాత్మకత గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వై. సావిత్రి, సురజాదేవి, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## 23న గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

**కందుకూరు, మార్చి13:** పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తులకోసం ఈనెల 23న కందుకూరు నుంచి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం పెద్దన్నశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు రాత్రి 8 గంటలకు ప్రత్యేకబస్సు బయలుదేరుతుందని, భోజన సౌకర్యంతో కలిపి టికెట్ ధర రూ. 2,600గా నిర్ణయించామన్నారు. వివరాలకు 73828 89870 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## రేపు టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

**కొండాపురం, మార్చి13:** మండలంలోని పార్లపల్లిలో ఈనెల 15న టీడీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం బుధవారం తెలిపారు. సమావేశానికి ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ ముఖ్య అతిథి రానున్నారని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

### పరీక్ష సామగ్రి పంపిణీ

**కందుకూరు, మార్చి 13:** పట్టణంలోని కేజీబీవీలో పదో తరగతి విద్యార్థినులకు శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రవ్వా శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ప్యాడ్, పెన్నులు, ఇతర సామగ్రిని అందించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో స్వాతి, సొసైటీ ప్రతినిధులు చక్కా కేశవరావు, ఇన్నమూరి శ్రీనివాసులు, సోమిశెట్టి శశాంక్ పాల్గొన్నారు.

### ఇంటర్ పరీక్ష కేంద్రాల తనిఖీ

**కావలిటౌన్, మార్చి13:** ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసరావు బుధవారం పట్టణంలోని ఇంటర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. జేబీ జూనియర్ కళాశాల కేంద్రం వద్ద తనిఖీలు నిర్వహించిన ఆర్ఐవో మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు సజావుగా సాగుతున్నాయన్నారు. నెల్లూరు రావూస్ కళాశాల కేంద్రంలో మాల్ ప్రాక్టీస్ చేస్తూ పట్టుపడ్డ ముగ్గురిని డిబార్ చేశామన్నారు. జేబీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సన్నితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

### విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలి

**కావలి, మార్చి13:** విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలని రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తెలిపారు. కావలి విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సాయంత్రం ఆయన విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ దేశాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమని చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సాగు నీరందని పొలాల పరిశీలన

**జలదంకి, మార్చి 13 :** ఎల్ఆర్ అగ్రహారం గ్రామంలో సాగునీరందక వరిపొలాలు ఎండుము ఖం పట్టాయి. దీంతో సర్పంచి మంగలి తిరుమల, రైతులు గాలి శ్రీనివాసులు, గుర్రం సుబ్బారావు తదితరులు ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.దీంతో వారు బుధవారం వరిపొలాలను పరిశీలించారు. కావలి కా లువ ద్వారా సాగునీరిచ్చి పంటను కాపాడాలని రైతులు కోరారు. సోమశిల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పంటను కాపాడుతామని ఇరిగేషన్ డీఈ, ఏఈలు రైతులకు హామీ ఇచ్చారు.

### అత్యాచార బాధితులకు
## నష్ట పరిహారం ఇవ్వాలి

**అల్లూరు:** అత్యాచార బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని దళిత సంఘర్షణ సమితి జి ల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట బుధవారం ధ ర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాచారాలకు గురైన ఎస్సీ ఎ స్టీ యువతులు, మహిళలకు నష్టపరిహారం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. నష్టపరిహారం కోసం బాధితులు కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నా ఆదుకునే నాథుడు కరువయ్యాడన్నారు. త్వరితగతిన నష్టపరిహారం ఇవ్వకుం టే జిల్లావ్యాప్తంగా నిరసన చేపడతామని హెచ్చరించారు.అనంతరం తహసీల్దారు దుర్గేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, దర్గిగుంట కోటయ్య, కాకాణి వెంకయ్య, కోవూరు బాబు, జడ్డా వాసు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### అవకాశం ఇస్తే..
# 20 ఏళ్లకు సరిపడా అభివృద్ధి


కావలిలో టీడీపీ, జనసేన నాయకుల ర్యాలీ

**కావలి, మార్చి13:** తనకు ఒక్క అవకాశం ఇస్తే కావలి నియోజకవర్గం లో 20 ఏళ్లకు సరిపడా అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించి, అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ట్రంకురోడ్డులోని ఒంగోలు బస్టాండ్ సెంటర్ నుంచి ఎన్ని కల ప్రచారం చేపట్టారు. వ్యాపారులను కలిసి తనకు నెల్లూరు ఎంపీగా వే మిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. టీడీపీ కూటమి అధికా రంలోకి వస్తే అమలు చేసే పథకాల మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **కల్మషం ఎరుగని నిజాయతీపరులు మత్స్యకారులు**

**కావలి రూరల్ :** కాయాకష్టం తప్ప కల్మషం ఎరుగని నిజాయతీపరులు మత్స్యకారులని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ ఆధ్వర్యంలో బుధవా రం తుమ్మలపెంట, అన్నగారిపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకార యువ కులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పాల్గొన్న కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడు తూ మత్స్యకారులు తుమ్మలపెంట రోడ్డుతో పడుతున్న ఇబ్బందులు వర్ణనా తీతమన్నారు. ఈ ఎమ్మెల్యే పదవిలో ఉన్నంతకాలం తుమ్మలపెంట రోడ్డు ప నులు జరగవని అన్నారు. తాను గెలిస్తే రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **కలిసికట్టుగా పనిచేసి కావ్యను గెలిపిద్దాం...**

**బిట్రగుంట :** టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కలసి కట్టుగా పనిచే సి కావలి నుంచి కావ్య క్రిష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని టీడీ పీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి అన్నారు. బోగోలు మండలం పార్టీ కార్యాలయంలో బుధవారం మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో మూడు పార్టీల నేతల సమావేశం జరిగింది. బీజేపీ మండల అ ధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, మండల మాజీ అధ్యక్షుడు గు ర్రం వెంకటేశ్వర్లు, జనసేవ మండల అధ్యక్షుడు తిరుమలశెట్టి వెంకటేష్, ప్ర ధాన కార్యదర్శి గంగపట్ల సురేష్ కుమార్‌లకు టీడీపీ నేతలు శాలువలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాలేపాటి మాట్లాడుతూ రాను న్న ఎన్నికల్లో సైకో పా లనకు ముగింపు పలకాలని అన్నారు. కార్యక్రమంలో నేతలు వెంకటేశ్వర్లురెడ్డి, రఘురామ్‌నాయుడు, వై.వెంకటేశ్వర్లు, మాధవరావు, అహ్మద్‌బా షా, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

● **క్షేత్రస్థాయిలో దృఢంగా ఉండాలి : బీద గిరిధర్**

**అల్లూరు :** రానున్న ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు దృ ఢంగా ఉండి టీడీపీ గెలుపునకు కృషి చేయాలని నెల్లూరు పార్లమెంటు ఉ పాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. అల్లూరు మండలం నార్త్‌ఆములూరులో ఆయన బుధవారం స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఇన్నాళ్లు ఎదుర్కొన్న సమస్యలు తీరాలంటే టీడీపీ గెలుపు అనివార్యమన్నారు. ఈ నెలన్నర రోజుల్లో ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గుంజి రుద్రయ్య, దాసరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఐని కాదు ఎన్ఆర్‌యుని : కాకర్ల


కలిగిరిలో మాట్లాడుతున్న కాకర్ల సురేష్

**కలిగిరి, మార్చి 13:** వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాలరెడ్డి ప్రచారం చేస్తున్నట్లుగా తాను ఎన్ఆర్ఐని నాన్ రెసిడెన్స్ ఉదయగిరి (ఎన్ఆర్‌యు)ని మాత్రమేనని ఉదయగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి ఇంటి వద్ద బుధవారం జరిగిన పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తనకు కుటుంబ బాధ్యతలన్నీ తీరిపోయాయని, ఆర్థిక లావాదేవీలు తన సోదరుడు సునీల్ చూసుకుంటు న్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఉపాధి, తాగు, సాగునీరు కల్పనకు అధిక ప్రాధాన్యతని స్తామన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ప్రజాసమస్యల పరిష్కారానికి పాటుపడతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బీవీ రామారావు, కాకు మహేష్, గంజాం రాఘవేం ద్ర, స్వర్ణ కొండయ్య, మదన్‌కుమార్, ఎంవీ రామిరెడ్డి, తాతయ్య పాల్గొన్నారు.

### టీడీపీలో చేరికలు


టీడీపీలో చేరిన పాస్టర్ సాధిక్‌ఖాన్ దంపతులు తదితరులు

**బిట్రగుంట:** బోగోలు మండలం ఏబీ కండ్రికలో స్థానిక టీడీపీ నేత గద్దె కొండయ్య ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం జరగ్గా మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు పాల్గొన్నారు. బిట్రగుంట పంచాయతీ టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి వెంకటరామకృష్ణ ఆ ధ్వర్యంలో పాస్టర్ సాధిక్‌ఖాన్ ఆయన కుటుంబ సభ్యులు పార్టీలో చేరారు. వారికి కావ్య సోదరుడు దగ్గుమాటి వేణుగోపాల్‌రెడ్డి పార్టీ కండువా కప్పారు. మాజీ ఎంపీటీసీ ముంతాల వెం కయ్య, గోచిపాతల సంజయ్ ఆధ్వర్యంలో జేతనీపేటకు చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు.

## పేదల వైద్యానికి ప్రాధాన్యత

**కావలి, మార్చి13:** పేదల వైద్యానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాడని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్ర తాప్‌కుమార్‌రెడ్డి తెలి పారు. పట్టణంలోని వై కుంఠపురం, పుల్లారెడ్డిన గర్‌లలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ల భవనాల ను బుధవారం డీఎంహెచ్‌వో పెంచలయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆ యన మాట్లాడుతూ ఈ అర్బన్ హెల్త్‌సెంటర్ల ద్వారా ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపవైద్యఆరోగ్యశాఖ అధికారిణి బ్రిజిత, మెడి కల్ ఆఫీసర్ ఫరూక్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాం, వైసీపీ నేత లు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


చేయూత చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి

**గుడ్లూరు, మార్చి 13:** మహిళా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. వెలుగు శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన వైఎస్సార్ చేయూత నాలుగవ విడత చెక్కుల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా ప్రస్తుత ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. అనంతరం నాలుగో విడత చేయూత చెక్కును పొదుపు మహిళలకు అందచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వెంకటరమణ, ఏపీఎం అశోక్, ఎంపీపీ పులి రమేష్, వైస్ ఎంపీపీ ఎం. శ్రీరాములు, సర్పంచి పీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### నర్సు అంటే ప్రాణదాత

**కందుకూరు :** నర్సు అంటే ప్రాణదాతగా భావిస్తారని సరోజినీదేవి నర్సింగ్ కళాశాల నిర్వాహకురాలు కంచర్ల విజయ్ ఇందిరాదేవి అన్నారు. బుధవారం రాత్రి ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ సెమినార్ హాలులో బీఎస్సీ నర్సింగ్ తొలి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నైటింగేల్ స్మరణతో జ్యోతివెలిగించి ప్రమాణం చేశారు. అనంతరం టెక్నికల్ డైరెక్టర్ కే విజయ్‌శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కంచర్ల రామయ్యను సత్కరించారు. కార్యక్రమంలో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాళ్లు పీ జ్యోతి, కే సోనీ పాల్గొన్నారు.